RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in



16 మే 2025 శుక్రవారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:298

## బీఆర్ఎస్ పై మంత్రి సీతక్క మండిపాటు



హైదరాబాద్ మిస్ వరల్డ్ కంటేస్టెంట్ల ములుగు, రామప్ప దేవాలయ పర్యటనను వివాదాస్పదం చేస్తున్న బి ఆర్ ఎస్ పై మంత్రి సీతక్క మండిపడ్డారు. స్వార్థ రాజకీయాల కోసం ప్రతి అంశాన్నీ వక్రీకరించడం టిఆర్ఎస్ కు పరిపాటిగా మారింది అంటూ ఫైర్ అయ్యారు.ప్రతి చిన్న విషయానికి తెలంగాణ సెంటిమెంటును రుద్ది తెలంగాణ ప్రతిష్టను దిగజార్చవద్దని అన్నారు.


నిన్న మిస్ వరల్డ్ కాంటెస్ట్స్ వరంగల్ వేయి స్తంభాల గుడి, రామప్ప గుడి వద్ద హెరిటేజ్ వాక్ పర్యటన ఏర్పాట్లు చేసిన ఉన్నతాధికారులకు ధన్యవాదాలు. హెరిటేజ్ వాక్ సక్సస్ కావడంతో బీఆర్ఎస్ నేతలు కళ్లలో నిప్పులు పోసుకున్నారు. కోడి గుడ్డు మీద ఈకలు పీకే ప్రయత్నం చేస్తున్నారు. ఇవాంవంక ట్రంప్ వచ్చినప్పుడు తోక పట్టుకొని తిరిగిన నాయకుడి.. ఎలాంటి సంస్కృతి సంప్రదాయాలు పాటించారో అందరికీ తెలుసు. గిరిజన సంప్రదాయంలో గుళ్లలోకి కాళ్ళు కడుగుకొని వెళ్ళడం సంప్రదాయం.. అదే అక్కడ పాటించారు. అందులో ఒక ఈవెంట్ మేనేజ్మెంట్ అమ్మాయి కాళ్ళ కు నీళ్ళు పోసింది. దానిని పట్టుకొని తెలంగాణ ప్రభుత్వం చేసిందని బంధనం చేస్తున్నారు. నిస్సిగ్గుగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం కాళ్ళు కడిగితే అందరి కాళ్ళు కడిగించాలి కదా..? దానిని ప్రభుత్వానికి అంటగట్టడం సిగ్గు అనిపించడం లేదా. కవితమ్మ కాళ్ళ దగ్గర కలెక్టర్ ను కూర్చోబెట్టినప్పుడు.. కేసీఆర్ కలెక్టర్లతో కాళ్ళు మొక్కించుకోవడం మీ దురహంకారం కదా. దానికి వ్యతిరేకంగానే కదా ప్రజలు మిమ్మల్ని ప్రజలు పక్కన పెట్టారు. తెలంగాణ ఆత్మగౌరవం గురించి మాట్లాడే అర్హత మీకుందా..? తెలంగాణ పేరునే మీ పార్టీ పేరు లో నుంచి తీశారు కదా. ఈమధ్య సబితా ఇంద్ర రెడ్డి ములుగు మీద పచ్చి అబద్ధాలు చెబుతున్నారు. ఆమె మంత్రిగా ఉన్నప్పుడు ఏం మానవత్వం చూపిందో తెలుసు. వాస్తవాలు మాట్లాడు.. అబద్ధాలు కాదు. ఇప్పటికైనా అబద్ధలకు అంబాసిడర్ గా సబితమ్మ మారకని అన్నారు.

## అర్ధరాత్రి నుంచి మెట్రోఛార్జీలు పెంపు కనీసం 12



హైదరాబాద్, మే 15 హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు ఎల్అండ్‌టీ మెట్రో రైల్ లిమిటెడ్ ఊహించని షాకిచ్చింది. మెట్రో ఛార్జీలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. కనిష్ట టికెట్ ధర రూ.12 నుంచి గరిష్ట టికెట్ ధర రూ.75గా నిర్ణయించింది. పెంపు కంటే ముందు కనిష్ట ధర రూ.10, గరిష్ట ధర రూ.60గా ఉండేది. కాగా, పెంచిన ఛార్జీలు మే 17(శనివారం) నుంచి అమల్లోకి రానున్నాయి. నిత్యం మెట్రోలో ప్రయాణిస్తూ ఆఫీస్‌లకు వెళ్ళన్న ప్రయాణికులకు ఈ పెంపు మరింత భారం కానుంది.ఈ ఛార్జీల పెంపుపై ఎల్ అండ్ టీ సంస్థ స్పందిస్తూ.. "మా విలువైన ప్రయాణీకుల నిరంతర మద్దతు, ప్రోత్సాహానికి మేం హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నాం. హైదరాబాద్ మెట్రో రైలు సేవల నాణ్యతను అందరికీ నిర్వహించడానికి, పెంచడానికి అవసరమైన ఈ సవరించిన ఛార్జీల నిర్మాణాన్ని స్వీకరించడంలో మీ సహకారాన్ని మేం అభ్యర్థిస్తున్నాం" అని పేర్కొంది. కాగా లార్సెన్ అండ్ టూబ్రో అనుబంధ సంస్థ అయిన ఎల్ అండ్ టీ మెట్రో రైల్ (హైదరాబాద్) లిమిటెడ్ హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్ట్ నిర్మించిన విషయం తెలిసిందే. ప్రాజెక్ట్ డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్ ప్రాతిపదికన అమలు చేస్తారు. సెప్టెంబర్ 4, 2010న అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో రాయితీ ఒప్పందం కుదుర్చుకుంది

## భారత్‌లో యాపిల్ కంపెనీలు పెట్టొద్దు.. ట్రంప్ సంచలన కామెంట్స్



న్యూ ఢిల్లీ మే 15 అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. భారత్‌లో యాపిల్ కంపెనీలు పెట్టాల్సిన అవసరం లేదని వివాదాస్పద కామెంట్స్ చేశారు. ఇండియాలో యాపిల్ కంపెనీ నిర్మాణాలు నిలిపివేయాలని సీఈఓ టిమ్ కుక్‌ను కోరినట్లు డొనాల్డ్ ట్రంప్ గురువారం తెలిపారు. దోహాలో జరిగిన ఒక వ్యాపార కార్యక్రమంలో పాల్గొన్న ట్రంప్.. వాషింగ్టన్ భారత్‌తో విస్తృత వాణిజ్య సంబంధాల గురించి చర్చిస్తూ ఈ ప్రకటన చేశారు.ఇండియాలో అత్యధిక టారిఫ్ ఉంటుందని.. కాబట్టి, అక్కడ యాపిల్ ప్రొడక్ట్ ఉత్పత్తి చేయొద్దని సీఈవో టిమ్ కుక్‌కి చెప్పినట్లు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. భారత్ లో నిర్మించడం తమకు ఇష్టం లేదని.. అమెరికాలోనే యాపిల్ కంపెనీలు పెట్టాలని కోరినట్లు ట్రంప్ తెలిపారు.

# సరస్వతీ పుష్కరస్నానం ఆచరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి





కాళేశ్వరం మే 15 ;కాళేశ్వరం వద్ద సరస్వతీ పుష్కరాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సరస్వతీ పుష్కరస్నానం ఆచరించారు. గురువారం సాయంత్రం కాళేశ్వరం చేరుకున్న సిఎం రేవంత్.. సరస్వతీ పుష్కర ఘాట్ ను ప్రారంభించారు. అనంతరం మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి పుష్కరస్నానం ఆచరించారు. ఆ తర్వాత సరస్వతీదేవి విగ్రహాన్ని సిఎం ఆవిష్కరించారు.కాగా, జయశంకర్ భూపాలపల్లి జిల్లా, శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం కాళేశ్వరం వద్ద గోదావరి, ప్రాణహిత, సరస్వతీ నదులు కలిసి త్రివేణి సంగమంగా ప్రవహిస్తోంది. కాళేశ్వర క్షేత్రం వద్ద త్రివేణి సంగమ తీరంలో ఇవాళ్టి నుంచి ఈనెల 26వ తేదీ వరకు సుమారుగా 12 రోజుల పాటు సరస్వతీ నది పుష్కరాలు జరుగునున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కాళేశ్వరం యాప్, వెబ్ పోర్టల్‌ను ప్రారంభించి, భక్తులు సాంకేతికంగా పొందే సేవలను సైతం అందులో పొందుపరిచారు. సదరు పుష్కరాల సందర్భంగా ప్రతి రోజు సుమారు 50 వేలకు పైగా భక్తులు వచ్చి పుష్కర స్నానం చేయడంతో పాటు పిండప్రదానం, దంపతీ స్నానం, శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వార్లను దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేశారు.

# రెవిన్యూ, హౌసింగ్, ఐ & పి ఆర్ శాఖామంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు.





**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, రుద్రంగి,( ప్రజాబలం ),** రెవెన్యూ, హౌసింగ్ ఐ %డ% పి ఆర్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు.

మంత్రుల పర్యటన నేపథ్యంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝ, ఎస్పీ మహేష్ బి. గితే లతో కలిసి చేయాల్సిన ఏర్పాట్లపై విప్ ఆది శ్రీనివాస్ గురువారం రుద్రంగి గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఆర్ఓఆర్ చట్టం భూ భారతి చట్టం ముందస్తుగా నాలుగు మండలాలలో పైలెట్ ప్రాజెక్టు కింద నిర్వహించామని, ప్రస్తుతం ప్రతి జిల్లాలో ఒక మండలాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద రాజన్న సిరిసిల్ల జిల్లాలోని రుద్రంగి మండలాన్ని ఎంపిక చేసామని తెలిపారు. భూభారతి చట్టం ద్వారా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నమని వెల్లడించారు.

గతంలో ప్రభుత్వ భూములు వ్యవసాయం చేస్తున్న పేదలకు, దళితులకు, గిరిజనులకు అసైన్డ్ పట్టాలు, పోడు భూముల పట్టాలు పంపిణీ చేశామని గుర్తు చేశారు. గత ధరణి చట్టం సమయంలో అసైన్మెంట్ ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయిందని పేర్కొన్నారు.

ధరణి వ్యవస్థతో పేదలకు అనేక ఇబ్బందులు వచ్చాయని, సమస్యల పరిష్కారానికి రూల్స్ తీసుకొని రాలేదని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులకు ఇచ్చిన హామీ మేరకు నూతనంగా భూ భారతి చట్టం రూల్స్ తో సహ ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఎమ్మెల్యే అధ్యక్షుడిగా అసైన్మెంట్ కమిటీలను కూడా ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ఆది శ్రీనివాస్ తెలిపారు.

అసైన్మెంట్ కమిటీల ద్వారా ప్రభుత్వ భూములలో సాగు చేసుకుంటూ పట్టాలు రాని అర్హులు ఎవరైనా ఉంటే వారికి తప్పనిసరిగా పట్టాలు అందజేస్తామని ప్రకటించారు. రుద్రంగి మండల కేంద్రానికి శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ వస్తారని తెలిపారు.

రుద్రంగి మండలంలో మంజూరైన 243 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమం కూడా హౌసింగ్ శాఖ మంత్రి చేతుల మీదుగా జరుగుతుందని తెలిపారు. రుద్రంగిలో ఇంటి కోసం పేదలు చేసుకున్న దరఖాస్తులు ఇంకా ఏమైనా పెండింగ్ లో ఉంటే వెంటనే మంజూరు చేయాలని ఉన్నతాధికారులను ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ ఆదేశించారు.

మంత్రి పర్యటనకు రైతులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు, స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ.

భూభారతి రెవెన్యూ సదస్సుల నిర్వహణ ఇందిరమ్మ ఇండ్ల శంకుస్థాపన వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనేందుకు రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రుద్రంగిలో పర్యటించనున్నారు అని తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

రుద్రంగి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ సదస్సు నిర్వహణకు అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత ప్రజాప్రతినిధులను, ప్రోటాకాల్ ప్రకారం ఆహ్వానించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కు సూచించారు.

రెవెన్యూ సదస్సుల వద్ద పారిశుద్ధ్య నిర్వహణ, లైటింగ్ మొదలు ఏర్పాట్లను ఎంపీడీవో పకడ్బందీగా పూర్తి చేయాలని హెలిప్యాడ్ వద్ద పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని టెంట్, కుర్చీలు, సభ వేదిక వంటి ఏర్పాట్లను ఆర్ అండ్ బి అధికారులు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

మంత్రుల పర్యటన నేపథ్యంలో అంబులెన్స్ అందుబాటులో పెట్టాలని నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని సమావేశం వద్ద ఫైర్ ఇంజన్ అందుబాటులో పెట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.

అనంతరం ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గు పోసి ప్రారంభించే కార్యక్రమం ఇంటి స్థలాలు, హెలిపాడ్, బహిరంగ సభ వేదిక రెవెన్యూ సదస్సు జరిగే సభా వేదిక గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన భూభారతి సహాయ కేంద్రం వంటి వాటిని పరిశీలించారు.

ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చేలుకల తిరుపతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి.రాదాబాయి, రుద్రంగి తాసిల్దార్ శ్రీలత, ఎంపీడీవో నటరాజ్, ఈ ఈ ఆర్ అండ్ బి వెంకట రమణయ్య, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రజిత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రజాబలం

16 మే 2025 శుక్రవారం

# ఆవిష్కరణల కాంతిలో విశ్వమానవ ప్రగతి

తూర్పున ఉదయించే కాంతి రేఖలు మనకు ప్రతీ రోజూ నవశకానికి స్వాగతం పలుకుతుంది. తూర్పు దిక్కున అరుణారుణ కాంతులు మెల్లగా వ్యాపిస్తుంటే, అది కేవలం ప్రకృతి రమణీయమైన దృశ్యం మాత్రమే కాదుబీ మానవజాతి అనంతమైన ప్రగతి పథానికి అది శుభసూచకం. కాంతి కేవలం ఒక భౌతిక దృగ్విషయం మాత్రమే కాదు. ఇది నూతన ఆలోచనలకు, ఊహలకు, సృజనాత్మక ఆవిష్కరణలకు ఊపిరినిచ్చే ఒక అక్షయ శక్తి. కాంతి, ఈ విశ్వంలోని ప్రాథమిక శక్తి, కేవలం మన కంటికి గోచరించే ప్రకాశం కాదు. ఇది శాస్త్ర, సాంకేతిక, వైద్య, వ్యవసాయ, సమాచార, పర్యావరణ రంగాలలో ఊహించని విప్లవాత్మక మార్పులకు నాంది పలుకుతోంది. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో, పేదరికం, అసమానత్వం, ఆహార కొరత, వాతావరణ మార్పు వంటి పెను సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి కాంతి ఆధారిత సాంకేతికతలు ఒక దిక్సూచిలా, ఒక ఆశాకిరణంలా పని చేస్తున్నాయి. ప్రతి సంవత్సరం మే 16న జరుపుకునే అంతర్జాతీయ కాంతి దినోత్సవం మన జీవితాల్లో కాంతి ప్రాముఖ్యతను మరింత లోతుగా గుర్తుచేస్తుంది. 2025వ సంవత్సరం థీమ్ అయిన 'కాంతి, ఆవిష్కరణ, సమాజం' అనేది ఈ ప్రాముఖ్యతను మరింతగా విశదీకరిస్తుంది. కాంతి బహుముఖ ప్రజ్ఞను మన ముందుంచుతుంది. ఈ థీమ్ శాస్త్రీయ పరిశోధనల పురోగతి, సాంకేతిక ఆవిష్కరణల విశిష్టత, సమాజ సమగ్ర శ్రేయస్సును పెంపొందించడంలో కాంతి ఆధారిత సాంకేతికతల అనితరసాధ్యమైన పాత్రను నొక్కి చెబుతుంది. విభిన్న నేపథ్యాలు కలిగిన ప్రజలను %-% శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, కళాకారులు, విద్యావేత్తలు, విధాన నిర్ణేతలను కాంతి శాస్త్రం, సాంకేతికత యునెస్కో లక్ష్యాలైన శాంతి, సమానత్వం, విద్యను ఎలా సాధించగలదో తెలిపే విభిన్న కార్యక్రమాలలో క్రియాశీలకంగా పాల్గొనమని స్ఫూర్తినిస్తుంది, ప్రోత్సహిస్తుంది.

కేవలం ఒక శతాబ్దం క్రితం ఊహించలేని లేజర్ల ఆవిష్కరణ నుండి నేటి అత్యాధునిక క్వాంటమ్ టెక్నాలజీల వరకు, కాంతి శాస్త్రం మానవ మేధస్సు అద్భుతమైన విజయాలకు, పురోగతికి నిదర్శనంగా నిలుస్తోంది. ఇది ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ క్వాంటమ్ సైన్స్, టెక్నాలజీ సంవత్సరంతో కూడా అనుసంధానించబడి ఉండటం, ఈ అంశం సమకాలీన ప్రాముఖ్యతను మరింతగా చాటుతోంది. నేడు మానవ సమాజం అనేక సంక్లిష్టమైన, అంతర్లీన సవాళ్లను ఎదుర్కొంటోంది. వాతావరణ మార్పుల తీవ్రపరిణామాలు, ఆరోగ్య సంరక్షణలో అంతరాలు అసమానతలు, ప్రపంచవ్యాప్తంగా అందరికీ సమానమైన నాణ్యమైన విద్యను అందించడంలో ఉన్న అవరోధాలు కొన్ని ముఖ్యమైనవి. ఈ క్లిష్టమైన సవాళ్లను సమర్థవంతంగా స్థిరంగా అధిగమించడానికి కాంతి ఆధారిత ఆవిష్కరణలు ఒక శక్తివంతమైన సాధనంగా, ఒక ఆశాజనకమైన మార్గంగా ఆవిర్భవిస్తున్నాయి. శక్తిని మరింత సమర్థవంతంగా ఉత్పత్తి చేయడానికి వినియోగించడానికి నూతన, పర్యావరణ అనుకూల లైటింగ్ టెక్నాలజీలు నిరంతరం అభివృద్ధి చేయబడుతున్నాయి. విద్య, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం వంటి ప్రాథమిక రంగాలలో కాంతి ఆధారిత సాంకేతికతల అనువర్తనాలు అద్భుతమైన ఫలితాలను ఇస్తున్నాయి. వ్యవసాయ రంగంలో 'అగ్రి-ఫోటోనిక్స్' ద్వారా పంటల దిగుబడిని గణనీయంగా పెంచడం, నీటి వినియోగాన్ని హేతుబద్ధీకరించడం, హానికరమైన తెగుళ్ళను పర్యావరణ అనుకూల పద్ధతుల్లో నియంత్రించడం సాధ్యమవుతోంది. వైద్య రంగంలో, మరింత కచ్చితమైన రోగ నిర్ధారణ, చికిత్సా విధానాలు అందుబాటులోకి వస్తున్నాయి. అత్యాధునిక ఇమేజింగ్ టెక్నిక్‌లు కచ్చితమైన లేజర్ ఆధారిత చికిత్సా విధానాలు వ్యాధులను మరింత ముందుగా మరింత కచ్చితంగా గుర్తించడానికి సమర్థవంతంగా నయం చేయడానికి సహాయపడుతున్నాయి. ఇది రోగుల వేగవంతమైన పునరుద్ధరణకు దోహదం చేస్తోంది. సమాచార సాంకేతిక పరిజ్ఞానంలో, కాంతి వేగంతో అపారమైన సమాచారాన్ని క్షణాల్లో చేరవేసే ఆప్టికల్ ఫైబర్‌లు ప్రపంచాన్ని ఒక గ్లోబల్ విలేజ్‌గా అనుసంధానిస్తున్నాయి. విద్యారంగంలో కాంతి ఆధారిత సాంకేతికతలు బోధనా పద్ధతులను మరింత ఆకర్షణీయంగా, ఇంటరాక్టివ్‌గా తద్వారా మరింత సమర్థవంతంగా మారుస్తున్నాయి. విద్యార్థుల అభ్యాస ఫలితాలను మెరుగుపరుస్తున్నాయి.

ఈ స్ఫూర్తిదాయకమైన అంతర్జాతీయ కాంతి దినోత్సవం సందర్భంగా, కాంతి అపారమైన శక్తిని దాని ఆధారిత సాంకేతికతల విశిష్టమైన ప్రాముఖ్యతను మనమందరం గుర్తెరుగుదాం. ముఖ్యమైన ఆవిష్కరణలు కేవలం ఉన్నత స్థాయి శాస్త్రీయ ప్రయోగశాలలకు లేదా ప్రత్యేక పరిశోధనా సంస్థలకు మాత్రమే పరిమితం కాకూడదు. వాటి విస్తృత ప్రయోజనాలు సమాజంలోని ప్రతి ఒక్కరికీ, ప్రతి వర్గానికి అందుబాటులోకి రావాలి. విద్య, ఆరోగ్య సంరక్షణ స్థిరమైన అభివృద్ధి వంటి కీలక రంగాలలో కాంతి ఆధారిత ఆవిష్కరణలను విస్తృతంగా ఉపయోగించడం ద్వారా, మనం మరింత సమతా పూర్వకమైన, అభివృద్ధి చెందిన మానవీయ విలువలు కలిగిన సమాజాన్ని నిర్మించగలము. శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, కళాకారులు, విద్యావేత్తలు విధాన రూపకర్తలు ఒక ఉమ్మడి లక్ష్యంతో కలిసి పనిచేసి, కాంతిని మరింత సమర్థవంతంగా, సృజనాత్మకంగా ఉపయోగించుకునే మార్గాలను అన్వేషిద్దాం. తద్వారా, మనం ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించగలము. కాంతిని ఆవిష్కరణలకు మార్గదర్శకంగా, సమాజానికి వెలుగు దివ్వెగా నిలుపుదాం. ఈ కాంతి ప్రయాణంలో ప్రతి ఒక్కరి ఆలోచనలు, ప్రయత్నాలు భాగస్వామ్యం అమూల్యమైనవి. కలిసి సాగుదాం, కాంతివంతమైన భవిష్యత్తును నిర్మిద్దాం.

## జీవితాన్నిప్రతిబింబించేది నాటకం.

### గాజుల శ్యాంప్రసాద్, జాయింట్ సెక్రెటరీ ఎం. జి. జి. పూలే పాఠశాలలు.



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** సమైక్య సాహితి ఆధ్వర్యంలో గంఢ్ర హనుమంతరావు స్మారక పురస్కారాన్ని హైదరాబాద్ విల్లాస్ క్లబ్ లో నాటక రచయిత ఆకెళ్ళ వెంకట సూర్యనారాయణకు ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి జాయింట్ సెక్రెటరీ జూలీ బో పూలే గురుకుల విద్యాలయం గాజుల శ్యాం ప్రసాద్ లాల్ మాట్లాడుతూ పురస్కార నాటకానికి ప్రాణం పోసినారు. ఆకెళ్ళ వెంకట సూర్యనారాయణ రావు, నాటకాలు ప్రజలలో నిలిచిపోయి, సమాజానికి ప్రతీకగా నిలుస్తాయని అన్నారు. సినిమాకు తొలిమెట్టు సినిమాగా తెలిపినారు. సభకు అధ్యక్షత వహించి న మాడిశెట్టి గోపాల్ మాట్లాడుతూ సమైక్య సాహితి వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, వైవిధ్య భరిత కార్యక్రమాలను భవిష్యత్తులో చేస్తున్నామని అన్నారు. ఎప్పటికీ నాటకానికి ఆదరణ ఉంటుందని అన్నారు. పురస్కార విశేషాలను డాక్టర్ గంఢ్ర లక్ష్మణరావు తెలిపినారు.

ఈ కార్యక్రమంలో నాటకాల పరిచయం కే.ఎస్. అనంత చార్య అతిధులు వారాల ఆనంద్, బి.ఎం.రెడ్డి, గాజుల రవీందర్, వనం లక్ష్మీకాంతరావు, గిరిజ, మనోహర్ బాబు, తదితరులు ప్రసంగించారు.

కొత్త అనిల్ కుమార్, కాంటూరు వెంకన్న, శ్రీకర్, ఇందిరా, రామలక్ష్మి మనోహర చారి, బి. ఎన్. ఆర్. శర్మ, ముత్తినేని శ్రీనివాస్, శేషం వేణుగోపాల శర్మ, తదితరులు పాల్గొన్నారు.

## గోషామహల్ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ శ్రీనివాసులు కి మర్యాదపూర్వకంగా కలిసిన ఎన్.ఆర్. లక్ష్మణ్ రావు



**గోషామహల్ ప్రజాబలం ప్రతినిధి:** మే 15 గోషామహల్ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ గా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసులు కి మర్యాదపూర్వకంగా కలిసి న బజరంగ్ సేన తెలంగాణ అధ్యక్షుడు ఎన్.ఆర్. లక్ష్మణ్ రావు, సునీల్ అగర్వాల్ తో కలిసిహృదయపూర్వక అభినందనలు మరియు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజా సేవ పట్ల ఆయన అంకితభావాన్ని మరియు సమగ్రత మరియు నిబద్ధతతో శాంతిభద్రతలను కాపాడే ఆయన సామర్థ్యంపై విశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ, నాయకులు కొత్తగా నియమితులైన ఎస్ హెచ్ ఓ ను సత్కరించారు. ఈ సమావేశం పౌర సమాజం మరియు చట్ట అమలు సంస్థల మధ్య పరస్పర గౌరవం మరియు సహకారానికి నిదర్శనం అని అన్నారు

## పిడుగురాళ్లలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

పిడుగురాళ్ల - జానపాడు (ఆర్ఓబి) రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన శిలాఫలకం ను గురువారం నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు చేతుల మీదగా ప్రారంభించారు. గుంటూరు జిల్లాలోని బెల్లంకొండ పిడుగురాళ్ల రైల్వే కి మి 73/0-1, జూలకల్లు పిడుగురాళ్ల రహదారి కి. మి 10/340 వద్ద యల్. సి. నం. 64కు 52 వేల కోట్ల నిధులతో నిర్మించ తలపెట్టిన రైల్వే ఓవర్ బ్రిడ్జి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ బాబు, జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, యువ నాయకులు యరపతినేని నిఖిల్, గురజాల ఆర్డిఓ మురళి కృష్ణ , మున్సిపల్ కమిషనర్ పి. శ్రీధర్, పిడుగురాళ్ల తహసిల్దార్ జె మధుబాబు, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## గచ్చిబౌలి భూముల వ్యవహారంలో రేవంత్ రెడ్డి తన తప్పు ఒప్పుకోవాలి

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్



హైదరాబాద్ మే 15 హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో రేవంత్ రెడ్డి తన తప్పు ఒప్పుకోవాలి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు విచారణ సందర్భంగా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందించారు.ప్రభుత్వం తరఫున వాదిస్తున్న అడ్వకేట్‌ను సుప్రీంకోర్టు హెచ్చరించింది. కంచ గచ్చిబౌలి అడవుల విధ్వంసానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు పలువురు అధికారులను జైలుకు పంపించాలా అంటూ హెచ్చరించింది. రేవంత్ రెడ్డి చేసిన తప్పులకు తెలంగాణ ప్రభుత్వ అధికారులు శిక్ష ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది. తెలంగాణ ప్రభుత్వ అధికారులకు సుప్రీంకోర్టు హెచ్చరికలు జారీ చేసింది. రేవంత్ రెడ్డి మూర్ఖత్వం వల్ల అధికారులు జైలుకు వెళ్లాల్సి వస్తుంది. వీటన్నింటికీ తాను బాధ్యుడిని కాదని రేవంత్ రెడ్డి తప్పించుకునే అవకాశం లేదు అని కేటీఆర్ పేర్కొన్నారు.రేవంత్ రెడ్డి సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలపై, కంచె గచ్చిబౌలి వ్యవహారంలో చేసిన తప్పులను ఒప్పుకోవాలి. వందల బుల్డోజర్లతో ధ్వంసం చేసిన కంచె గచ్చిబౌలి అడవులను తిరిగి పునరుద్ధరించాలి. లేకుంటే రేవంత్ రెడ్డికి కోర్టు శిక్షలు తప్పవు. కంచె గచ్చిబౌలి భూములను అమ్మి పది వేల కోట్ల రూపాయల స్కాం చేయడం ముమ్మాటికి అవినీతి, నమ్మక ద్రోహమే. సెలవు దినాల్లో బుల్డోజర్లను పంపి అడవులను ధ్వంసం చేయడం ముమ్మాటికి పర్యావరణ చట్టాల ఉల్లంఘనే. రేవంత్ రెడ్డి బాధ్యతారాహిత్య చర్యల ఫలితంగా పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగింది. కంచె గచ్చిబౌలి భూములను ప్రభుత్వం కాపాడాల్సిందే. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి తాను సృష్టించిన విధ్వంసానికి, తన బాధ్యతారాహిత్యానికి, చేసిన పది వేల కోట్ల స్కాంకు బాధ్యత వహించాలి అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# నియంత్రణలేని ప్రైవేట్ ఆస్పత్రులు. పరీక్షల పేరుతో రోగుల నిలువు దోపిడీ.

వరంగల్ ." వైద్యో నారాయణో హరీ అన్నారు పెద్దలు "అంటే వైద్యుడు దేవుడితో సమానమని కొలుస్తుంటారు రోగులు. జనానికి కాలునొచ్చిన , కన్ను నొచ్చినా, కడుపు నొచ్చినా శరీరంలో ఓ అవయం ఇబ్బంది పెట్టి మనిషిని భయంపెట్టినా బతుకుపై ఆశతో వైద్యులను సంప్రదిస్తూ ఉంటారు వైద్యుల వద్ద ఎలాంటి తప్పుడు సమాచారాన్ని ఇవ్వకుండా శరీరంలో ఏ ఇబ్బంది ఉన్న ఆ ఇబ్బందిని చెప్పుకొని ఉపశమనాన్ని పొందుతుంటారు అందుకు రోగి మనసేరిగి వైద్యులు పలు సూచనలతో పాటు రోగం నయం కావడానికి కావలసిన మందులను ఇచ్చి పంపుతారు అని ప్రతితి.కానీ రోజులు మారిపోయాయి కార్పొరేట్ ఆసుపత్రులు నియంత్రణను దాటి విచ్చలవిడిగా రోగులను జలగల్లా పీల్చి పిప్పి చేస్తున్నారన్న అప్రఖ్యాత నెలకొంది. వైద్యాన్ని వృత్తి కంటే అత్యుత్తమమైన సేవగా భావించిన పరిస్థితి నుండి మారిపోయి పూర్తిగా డబ్బు మాయం అయిపోయిందని ప్రజల వాపోతున్నారు. వైద్యవృత్తి నానాటికి ప్రజల్లో పలుచబడి అనేక విమర్శలను ఎదుర్కొంటుంది. హనుమకొండ , వరంగల్ జిల్లాలలోని కొంతమంది డాక్టర్లు వృత్తి చాటున రోగులను గుల్ల చేస్తూ జలగల వలె రక్తాన్ని పీల్చుగా తింటున్నారని జిల్లా ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శరీరంలో ఏర్పడిన ఏదో చిన్న ఇబ్బందితో ఆసుపత్రికి వెళితే పరీక్షల పేరుతో వేలకు వేలు గుంజి జేబులు ఖాళీ చేసి ఇంటికి పంపే వైనం ఆస్పత్రిలో చోటుచేసుకుంటుందని జిల్లా ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. కాలు నొప్పితో ఆసుపత్రికి వెళితే రక్త పరీక్ష , మూత్ర పరీక్ష లాంటి ఎన్నో రకాల పరీక్షలు చేసి చివరికి ఏమీ లేదని తేల్చి డబ్బులను గుంజే పరిస్థితి కార్పొరేట్ ఆసుపత్రిలో చోటు చేసుకుంటున్నా తీరు జిల్లాలో ఇటీవల తీవ్రమైన చర్చనీయాంశంగా మారింది. తెలిసో తెలియకో జిల్లాలోని కార్పొరేట్ ఆసుపత్రులలో కాలు పెట్టాలంటేనే జడ్చుకునే పరిస్థితి తయారయిందని జిల్లా ప్రజలకు విమర్శిస్తున్నారు. జిల్లాలో ఉన్న కార్పొరేట్ ఆసుపత్రుల వ్యవహారం గత కొన్ని సంవత్సరాలుగా జిల్లా ప్రజలతో ఎన్నో రకాలైన విమర్శలను ఎదుర్కొంటున్నారు. అయినప్పటికీ జిల్లాలోని కార్పొరేట్ ఆసుపత్రులలో వారి వ్యవహారాలు వాటి పద్ధతులను మార్చుకున్న పరిస్థితి కనిపించడం లేదంటున్నారు. కొన్ని ఆసుపత్రులు రోగులకు చెల్లిపోయిన మందులను ఇచ్చి మోసం చేస్తున్న సంగతి తెలిసిందే. దీనికి తోడు కార్పొరేట్ ఆసుపత్రులు జిల్లాలోని ఆర్ఎంపీలను పిఆర్వోలుగా మార్చుకొని రోగాలను తీసుకువచ్చిన పిఆర్ఓ లకు రాయితీలను ఇస్తూ రోగులను పీల్చిపెప్పి చేస్తున్నారన్న విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. రోగిని తీసుకవచ్చిన పి ఆర్ ఓ కు ఓపి మొదలు పరీక్షలు సీటు స్కానింగ్ ఎమ్మారై స్కానింగ్ తో పాటు ఎన్నో రకాలైన వాటిలో రాయితీలను కల్పించి దోచుకుంటున్న చర్యలు కొనసాగుతున్నాయి. వీటిని నియంత్రించే చర్యలు జిల్లాలోని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చేపట్టడం లేదని జిల్లా ప్రజలు విమర్శిస్తున్నారు కార్పొరేట్ ఆసుపత్రులతో జిల్లాలోని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మామూళ్లకు ఆశపడి వాటిపై చర్యలు తీసుకోవడానికి వెనకాడుతున్నారు అన్న ఆందోళన జిల్లా ప్రజల వ్యక్తం చేస్తున్నారు

పరీక్షల పేరుతో నిలువు దోపిడి

కార్పొరేట్ ఆసుపత్రిలో అడగు పెడితే చాలు రోగిని జలగల్లా మారి రక్తాన్ని పీల్చగా తింటున్నారని రోగుల బంధువులు తీవ్రంగా విమర్శిస్తున్నారు.శరీరంలోని ఏ చిన్న అవయవంతో బాధపడి కార్పొరేట్ ఆసుపత్రిలో అడుగుపెడితే సంచుల్లో డబ్బులు తెచ్చి జేబుల్లో మందులు కొనుక్కోపోయే దుస్థితి ఏర్పడిందని ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఒకటి రెండు రోజుల్లోనే చిన్న చిన్న ఇబ్బందులకు రోగులను 10 20,000 బిల్లులు వేసి రోగులను కార్పొరేట్ ఆసుపత్రులు దోచుకుంటున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోగి చేరిన సమయానికి ఎలాంటి పరీక్షలు అవసరం లేకున్నా ఆసుపత్రికి డబ్బులు రావాలన్నా ఆశతో కార్పొరేట్ ఆసుపత్రిలో యాజమాన్యాలు పలు రకాల పరీక్షలు స్కానింగ్ లతో రోగిని నిలువు దోపిడీ చేస్తున్నారని ప్రజలు బాహాటంగా విమర్శిస్తున్నారు. ప్రతిదానికి ఒక రేట్ ను నిర్ణయించుకొని ఎక్కువ మొత్తంలో రోగుల వద్దనుండి దండుకుంటున్న వైనం జిల్లాలో చోటు చేసుకుంటుందని ప్రజలు వాపోతున్నారు. కార్పొరేట్ ఆసుపత్రులు రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ఏమో కానీ రోగుల కుటుంబాలను బజారునపడేస్తున్నాయి అన్న ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కార్పొరేట్ ఆసుపత్రులపై తనిఖీలు నిర్వహించి అధిక ఫీజులను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

# దోమకాటుతో డెంగ్యూ వైరల్ వ్యాధి

రుతుపవనాలు ప్రారంభమయ్యే వర్షాకాలపై వేకువ జామున లేదా సాయంకాలం గడియల్లో వైరస్ సోకిన 'ఆడెస్ ఎజిప్టీ' వర్గపు దోమల కాటు వల్ల సంక్రమించే డెంగ్యూ వైరల్ నిర్లక్ష్యం చేస్తే ప్రమాదకరంగా, చివరకు ప్రాణాంతకంగా కూడా మారుతుంది. నాలుగు రకాల డెంగ్యూ వ్యాధుల కట్టడి చేయడానికి, దోమలు పెరగకుండా పరిసరాల పరిశుభ్రతను పాటించడమే ఏకైక ఉత్తమ మార్గం అని తెలుసుకోవాలి. డెంగ్యూ వ్యాధికి చికిత్స ఉన్నప్పటికీ అశ్రద్ధ చేస్తే ప్రమాదకరంగా మారి ప్రాణాలను కూడా తీస్తుందని పౌర సమాజం అర్థం చేసుకోవాలి. డెంగ్యూ వ్యాధి ముఖ్య లక్షణాల్లో అధిక జ్వరం, తీవ్ర తలనొప్పి, నేత్రాల వెనుక నొప్పి, కండరాలు/కీళ్ల నొప్పులు, వాంతులు, అలసట, ముక్కు/చిగుర్ల నుంచి రక్తం కారడం, శారీరక బలహీనత, చర్మంపై దద్దుర్లు, బీపీ తగ్గడం, ప్లేట్లెట్ల సంఖ్య పడిపోవడం, చివరకు అవయవాల నిర్క్రియత్వం లాంటివి కనిపిస్తాయి. ప్రమాదకర ప్రజారోగ్య సమస్యగా మారిన డెంగ్యూ వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన కల్పించటానికి ప్రతి ఏట మే 16న భారత దేశవ్యాప్తంగా "జాతీయ డెంగ్యూ దినం" లేదా "నేషనల్ డెంగ్యూ డే" పాటించడం ఆనవాయితీగా మారింది. ప్రభుత్వ వైద్య ఆరోగ్య యంత్రాంగం పాత్ర, వైద్య సిబ్బంది అంకితభావం, వ్యాధి పట్ల ప్రజలకు కనీస అవగాహన కల్పించడం, పరిసరాల పరిశుభ్రతకు పెద్ద పీట వేయడం, ప్రజారోగ్య వ్యవస్థలను బలోపేతం చేయడం, వర్షాకాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవడానికి చర్యలు తీసుకోవడం, పౌర సమాజాన్ని ఏకీకరణ చేయడం లాంటి లక్ష్యాలను చేపట్టడానికి జాతీయ డెంగ్యూ దినం వేదికలను వినియోగించుకోవాలి. జాతీయ డెంగ్యూ దినం-2025 ఇతివృత్తంగా "ప్రారంభంలోనే చర్యలు,డెంగ్యూ నివారణ : పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యకర జీవన విధానం" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు.

భారత దేశవ్యాప్తంగా డెంగ్యూ కేసులు నమోదు అయినప్పటికీ యూపీ, గుజరాత్, మహారాష్ట్ర, కర్నాటక, పంజాబ్ లాంటి రాష్ట్రాల్లో డెంగ్యూ వ్యాప్తి అధికంగా కనిపిస్తున్నది. ముఖ్యంగా పట్టణాల ప్రజల నుంచి పల్లెలకు ఈ వ్యాధి వ్యాపించడం జరుగుతున్నది. 2023లో దేశవ్యాప్తంగా 2.9 లక్షల కేసులు నమోదు కాగా 485 మరణాలు కూడా జరిగాయి. అదే విధంగా 2024లో 2.33 లక్షల రోగులు, 236 మరణాలు డెంగ్యూ వల్ల జరిగాయని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఉష్ణోగ్రతలు పెరగడం, అకాల వర్షాలు కురవడం, ప్రజల్లోఅవగాహనలేమి, ప్రభుత్వాల చర్యలు మందగించడం లాంటి కారణాలతో డెంగ్యూ వ్యాప్తి పెరుగుతున్నది. ప్రణాళిక కొరవడిన పట్టణీకరణ కూడా డెంగ్యూ రెచ్చిపోవడానికి ఒక ప్రధాన కారణం అవుతున్నది. జాతీయ డెంగ్యూ దినం వేదికగా ప్రజలు, ప్రభుత్వ యంత్రాంగాలు సమైక్యంగా పోరాడితే పలు అంటువ్యాధులు, సాంక్రమిక వ్యాధులకు అడ్డుకట్ట వేయవచ్చు. అస్తవ్యస్త పట్టణీకరణ, వాతావరణ ప్రతికూల మార్పులు, వర్షాకాల అపరిశుభ్రతలు డెంగ్యూ లాంటి సాంక్రమిక వ్యాధులకు తలుపులు తెరుస్తున్నట్లు అవుతున్నది. సరైన సమయంలో స్పందిస్తూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు పౌర సమాజ చైతన్యం తగు రీతిలో కొనసాగితే డెంగ్యూ వ్యాధి కట్టడి సులభం అవుతుంది. మన స్వల్ప అశ్రద్ధ ప్రాణాంతకం కావద్దు. మన ఇంటి పరిసరాల పరిశుభ్రత మన కుటుంబ/సమాజ ఆరోగ్య ప్రదాయిని అని తెలుసుకుందాం. వ్యాధి చికిత్స కన్న నివారణే మిన్న అనే నినాదాన్ని గుర్తుంచుకొని మన ఆరోగ్యం కోసం మనమే ప్రతినబూనుదాం, డెంగ్యూ కనబడని భారతాన్ని నిర్మించుకుందాం.

# జీవుల మనుగడకు ఆధారం 'కాంతి'

విశ్వంలో కాంతి ఒక ప్రధాన భాగమే కాకుండా అత్యంత మౌళిక అంశంగా మారింది. అత్యంత సూక్ష్మ కణాల ధర్మాలను వర్ణించే క్వాంటం సైన్స్‌కు మూలాధారం కాంతి మాత్రమే. వేడి చేసిన వస్తువుల నుండి కాంతి కణాల లేదా ఫోటాన్ల ధర్మాల వరకు కాంతి శాస్త్రం వర్ణించబడుతుంది. ఫోటాన్స్ అంటే కాంతి సూక్ష్మ కణాలని అర్థం చేసుకోవాలి.

కాంతికి పర్యాయపదంగా ఫోటాన్స్ నిలుస్తున్నాయి. కాంతి లేని భూగోళం శీతలం, బంజరు నేలల మయం.

కాంతి ఎక్కడ ఉంటుందో అక్కడ జీవుల ఉనికి కనిపిస్తుంది. మానవాళి మనుగడకు కాంతితో అవిభాజ్య సంబంధం నెలకొని ఉన్నది. వైజ్ఞానిక శాస్త్ర అభివృద్ధి అంటే కాంతి దృగ్విషయాల శోధనలు మాత్రమే. కాంతి మాంద్యంగానే ప్రపంచ సూక్ష్మ విషయాలు అవగతం అవుతున్నాయి. 16 మే 1960 రోజున తొలిసారి భౌతికశాస్త్రజ్ఞుడైన ఇంజనీరు 'థియోడోర్ మైమాన్' కృషితో లేజర్ సర్జరీ జరిగింది. కాంతి పరిశోధనలతో ప్రత్యామ్నాయ శక్తి వనరులు, వైద్య రంగంలో ఒకచ్ఛితత్వంతో రోగ నిర్ధారణలు, చికిత్స మార్గాలు, హై-స్పీడ్ ఇంటర్నెట్ లాంటి అనేక ఆవిష్కరణలు నేటి ఆధునిక పౌర సమాజాన్ని అత్యంత ప్రభావితం చేస్తున్నాయి. నేడు కాంతి ఆధార వైజ్ఞానికశాస్త్రం, టెక్నాలజీల పాత్ర అనన్య సామాన్యమైపోయింది. ఫోటోనిక్స్ ద్వారా నేడు ప్రపంచమంతటా అంతర్జాలం/కమ్యూనికేషన్స్ నెట్‌వర్క్ సమన్వయ పరచబడింది.

ఆప్టికల్ టెక్నాలజీలతో వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. రిమోట్ సెన్సింగ్ వ్యవస్థలు సుస్థిర వ్యవసాయానికి బాటలు వేస్తున్నాయి. కాంతి వల్లనే భూమి కుగ్రామం అయిపోయింది. వాతావరణ మార్పుల అధ్యయనాలు, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను అధిగమించడం లాంటివి సుసాధ్యం అవుతున్నాయి. సమ్మిళిత అభివృద్ధి, ఆహార భద్రత, ఆకలికి సమాధానం కూడా కాంతి శాస్త్రం ఇవ్వగలుగుతున్నది. అగ్ర-ఫోటానిక్స్ వేదికగా సాగు పద్ధతుల్లో విప్లవాత్మక సకారాత్మక మార్పులు వస్తున్నాయి.

శక్తిని ఆదా చేయడానికి ఎల్ఈడీ ప్రక్రియ అందుబాటులోకి వచ్చింది. టెలీ-కమ్యూనికేషన్ల రంగంలో విప్లవాత్మక మార్పులకు కాంతి పునాదులు వేస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది కంటి చూపు దోషాలను సవరించడానికి కాంతి-ఆధారిత భౌతిక శాస్త్రం దోహదపడుతున్నది. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమాటిక్స్ - స్టెమ్ సమన్వయంతో సమ్మిళిత వైజ్ఞానికశాస్త్ర అభివృద్ధికి రాచ బాటలు పడుతున్నాయి. లింగ సమానకడక్వ సాధనకు మహిళలు, యువతులను కాంతి ఆధారిత పరిశోధనల వైపు మరల్చాలి. నేడు దాదాపు 28 శాతం మహిళలు పరిశోధనారంగాల్లో పని చేయడం జరుగుతోంది. శుద్ధ సురక్షిత తాగు నీటి లభ్యతకు ఫోటోనిక్స్ టెక్నాలజీలు ఉపయోగపడుతున్నాయి. ప్రపంచ శాంతి, సుస్థిరాభివృద్ధికి బాటలు వేస్తున్న కాంతి ప్రక్రియలను, కాంచి ప్రాధాన్యాలను వివరించడానికి, మరింత ప్రయోజనకరంగా మార్చడానికి ప్రతి ఏట 16 మే రోజున "అంతర్జాతీయ కాంతి దినోత్సవం" లేదా "ఇంటర్నేషనల్ డే ఆఫ్ లైఫ్"ను పాటించడం ఆనవాయితీగా మారింది. 2025 అంతర్జాత కాంచి దినోత్సవ ఇతివృత్తంగా "మన జీవితాల్లో కాంతి (లైట్ ఇన్ అవర్ లైఫ్స్)" అనబడే అంశాన్ని తీసుకోని నిత్య జీవితంలో కాంతి ప్రాధాన్యాలను వివరించడంతో జరుగుతుంది. కాంతి అద్భుత ధర్మాలను లేదా కాంతి-ఆధారిత టెక్నాలజీలను సాధారణ మానవాళికి వివరించడం, కాంతి అంశంలో మరింత లోతైన పరిశోధనలను ప్రోత్సహించడం, కాంతితో కళలు/సంస్కృతి సంబంధాలను వర్ణించడం, కాంతి అనువర్తనాలను చర్చించడం, సుస్థిరాభివృద్ధిలో కాంతి సాంకేతికతను వాడుకోవడం లాంటి అంశాలతో పాటు శక్తిని సమర్థవంత వినియోగాలు, శక్తి నష్టాల నివారణ, కాంతి కాలుష్య కట్టడి లాంటి అంశాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వబడుతుంది. పునరుత్పాదక శక్తి వనరులు, మానవాళి కనీస అవసరాలు, వాతావరణ మార్పులు, కృత్రిమ ఉపగ్రహాలు లాంటివి కాంతి ఆధారంగానే జరుగుతున్నాయి. 2015 ఏడాదిని అంతర్జాతీయ కాంతి సంవత్సరంగా పాటించడం సత్ఫలితాలను ఇవ్వడంతో 2018 నుంచి యునెస్కో అంచర్జాతీయ కాంతి దినోత్సవాన్ని ప్రవేశ పెట్టడం జరిగింది. వైద్య ఆరోగ్య రంగాలు, ఇంటర్నెట్-కమ్యూనికేషన్ వ్యవస్థలు, సుస్థిర శక్తి వనరుల వాడకం, విద్యుత్తో పాటు ఆవిష్కరణలు లాంటి రంగాల్లో విప్లవాత్మక మార్పులు సుసాధ్యం కావడానికి కాంతి-ఆధారిత ఆధునిక పరిజ్ఞానాలు దోహదపడుతున్నాయి. అంతర్జాతీయ కాంతి దినోత్సవ వేదికగా వైజ్ఞానిక ప్రదర్శనలు, ఉపన్యాసాలు, వెబినార్లు, సడలేజర్-ఆప్టిక్స్ నమూనాల ప్రదర్శనలు, ఆర్ట్ - ఫోటోగ్రఫీ రంగాల్లో పోటీలు, ప్లానిటోరియం సందర్శనలు లాంటివి ఏర్పాటు చేయవచ్చు. ఈ వేదికలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లితండ్రులు, ఫోటోగ్రాఫర్లు, ఆర్టిస్టులు, ఫోటోనిక్స్ టెక్నోక్రాట్లు పాల్గొని రేపటి తరానికి మార్గదర్శనం చేయాలి. కాంతిలో దాగిన విశ్వ రహస్యాలను బట్టబయలు చేయాలి, మానవాళి సరళ జీవన విధానాలకు బంగారు బాటలు వేయాలి. కాంతి ఆవిష్కరణలు కమ్యూనికేషన్, ఆరోగ్య, పర్యావరణ, వ్యవసాయం లాంటి అనేక రంగాల్లో సకారాత్మక మార్పులకు పునాదులు వేయాలి. కాంతి వాడకంతో మన ముఖాల్లో నవ్వుల వెలుగులు ప్రసరించాలి.

# అలుపెరుగని పోరాట యోధుడు

యజుర్వేద శాఖీయులు అయిన పేరేప వంశజులు శ్రీకాకుళానికి ఇరవై కిలోమీటర్ల దూరంలోని పేరేప గ్రామ పరిసరాలలో పురోహితులుగా కాక, దేవాలయ ప్రతిష్ఠలు, కళ్యాణాలు చేయించే వేద పండితులుగా పేరెన్నిక గన్నారు. అలాంటి సనాతన వైదిక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించి, పక్కా కమ్యూనిస్టుగా పేరొందిన ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు పేరేప మృత్యుంజయుడు. నమ్మిన సిద్ధాంతాల కోసం జీవితాన్ని అంకితం చేసిన ఆ త్యాగమూర్తి వర్ధంతి సందర్భంగా, లభ్యం అవుతున్న సమాచారం ఆధారంగా గుర్తు చేసుకునే చిరు ప్రయత్నం. పేరేప మృత్యుంజయుడు (అక్టోబర్ 5, 1914 - మే 16, 1950) భారత కమ్యూనిస్టు పార్టీ నాయకుడు, స్వాతంత్ర్య సమర యోధుడు. పశ్చిమ గోదావరి జిల్లా ఆచంటలో పేరేప వెంకట సుబ్బయ్య, మహా లక్ష్మిలకు 1914, అక్టోబర్ 5 న జన్మించారు. ఆచంటలో మాధ్యమిక పాఠశాల చదువయ్యాక ధవళేశ్వరం వెళ్లి మేనమామ మొక్కపాటి శేషయ్య ఇంట్లో ఉంటూ రాజమండ్రి ప్రభుత్వ మోడల్ సెకండరీ స్కూలులో చదివి, చదువయ్యాక (1933- 34లో) పి.డబ్ల్యు.డిలో రోజు కూలికి మేస్త్రీగా పని చేశారు.1925 ప్రాంతంలో భానుమతి (1917)ని వివాహ మాడారు. 1936లో నెక్కంటి నరసింహారావు, మీరా లతో పాటు కమ్యూనిస్టు పార్టీ సభ్యులయ్యారు. బస్సు డ్రైవరుగా పనిచేస్తున్న మీరాతో పాటు బస్సు కార్మికులను సంఘటిత పరచే కార్యక్రమం చేపట్టారు.1941-42 ప్రాంతంలో యంవియన్ కపర్దీని కూడా మోటారు కార్మిక సంఘ నిర్మాణంలో పాల్గొనేందుకు ప్రోత్సహించారు.1937-39 కాలంలో కాళీపట్నం రైతుల పోరాటానికి నాయకత్వం వహించిన అల్లూరి సత్య నారాయణ రాజు, ఉద్దరాజు రామం లతో కలిశారు. 1940-42 కాలంలో చినమల్లం గ్రామం వద్ద 60- 70 మంది పార్టీ కార్యకర్తలకు మృత్యుం జయుడు ప్రిన్సిపాలుగా నిర్వహించిన శిక్షణా శిబిరంలో సైద్ధాంతిక శిక్షణతో బాటు, ఇందుకూరి సుబ్బరాజు ఆధ్వర్యంలో కొంత మిలటరీ శిక్షణ కూడా యిచ్చారు. మృత్యుం జయుడు...వ్యవసాయ కూలీలతో ఆచంట నుంచి నరసాపురం తహశీల్దారు కార్యాలయానికి 1940లో ఆకలి యాత్ర నిర్వహించారు. 1940-42 మధ్య కొంత కాలం ఆయన జిల్లా పార్టీ కార్యదర్శిగా ఉన్నారు. ఏలూరులో జిల్లా పోలీసు స్పెషల్ బ్రాంచి వారు ఆయనను అరెస్టు చేసి, స్థానిక జిల్లా సబ్ జైలులో 15 రోజులు రిమాండులో వుంచారు. 1944 - 45లో జైలు నుంచి విడుదల అయినాక పాలకొల్లులో కాపురం పెట్టారు. నరసాపురం తాలూకా పార్టీ కార్యదర్శిగా వుంటూ, జిల్లా ప్రజానాట్య మండలి ఆర్గనైజరుగా ఉన్నారు. అల్లు రామలింగయ్య, పినిశెట్టి శ్రీరామ మూర్తి, చలం మొదలగు కళాకారులను ప్రజానాట్య మండలిలోకి తెచ్చింది మృత్యుంజయుడే. నెక్కల పూడి సుబ్బాయమ్మ గారితో కలిసి అన్నా చెల్లెలు పాట (బెంగాలులో కరువు) వేదికల మీద పాడే వారు. చావుకు వెరవకురా అన్న పాట తరచు ఒంటరిగా కూడా పాడుకొంటుండే వారని చంద్ర సావిత్రమ్మ, కొండేపూడి రాధ తదితరులు చెపుతుండే వారు. పిల్లలమర్రి వెంకటేశ్వర్లు, భీమిరెడ్డి నర్సింహారెడ్డి, మల్లు స్వరాజ్యం, వావిలాల గోపాల కృష్ణయ్య లతో పాటు, ప్రత్యేకంగా తెలంగాణ పోరాటానికి సహాయం కూడ గట్టడానికి పి.సి.జోషి, పుచ్చలపల్లి సుందరయ్యలు వచ్చి ఆయనతో చర్చలు జరిపారు. మృత్యుంజయుడు నరసాపురం తాలూకా పార్టీ కార్యదర్శిగా, జిల్లా ప్రజానాట్య మండలి ఆర్గనైజరుగా వున్నారు. రెండవ ప్రపంచ యుద్ధపు చివరి రోజుల్లో బెంగాల్ లో భీకరమైన కరువు, తెలంగాణ రైతాంగ పోరాటం నేపథ్యంలో నిత్యావసర వస్తువుల కటకట, దొంగ నిల్వలు, దొంగ రవాణా నివారణకు కృషి చేస్తూ, ఆకలి యాత్రలు నిర్వహించారు. బెంగాలు కరువు, తెలంగాణ పోరాటం గురించి అల్లు రామలింగయ్య, పినిశెట్టి శ్రీరామమూర్తి, చలం మొదలగు కళాకారులతో కలిసి, ప్రజానాట్య మండలి ప్రదర్శనలు ఇచ్చేవారు. నెక్కల పూడి సుబ్బాయమ్మతో కలిసి "అన్నా చెల్లెలు" పాట (బెంగాలులో కరువుకు సం బంధించి) వేదికల మీద పాడే వారు. "చావుకు వెరవ కురా" అన్న పాట వేదికల నుంచి గంభీర స్వరంతో పాడడమే కాక, తరచు ఒంటరిగా కూడా పాడుకొంటుండే వారని చంద్ర సావిత్రమ్మ, కొండేపూడి రాధ చెప్పేవారు. నిజంగా జీవితంలో కూడా ఆయన "చావుకి వెరవని" వ్యక్తి. 1945-46లో పాల కొల్లులో మునిసిపల్ కార్మికుల సమ్మె జయప్రదంగా జరగతంలో ఆయన పాత్ర ఉంది. 1946లోనే సాధారణ ఎన్నికలు జరిగిన క్రమంలో, పార్టీ అభ్యర్థి తరపున పోలింగు ఏజెంటుగా మోటారు సైకిలు మీద నరసాపురం అసెంబ్లీ నియో జకవర్గం అంతా తిరిగారు. భీమిరెడ్డి నర్సింహారెడ్డి, మల్లు స్వరాజ్యం, వావిలాల గోపాల కృష్ణయ్య తెలంగాణ పోరాటానికి సహాయం కూడగట్టడానికి వెళ్ళిన సందరంగంలో పెద్ద బహిరంగ సభ జరిగింది. ఆ తర్వాత, పి.సి.జోషి, పి.సుందరయ్యలు ప్రత్యేకంగా ఆయనతో చర్చలు జరిపారు. అంతకుముందు "ప్రజాశక్తి" వార పత్రిక, ద్వైవార పత్రికానున్న సందర్భంగా విరాళాలకి ప్రకటన వచ్చింది. ఆయన తనకి పెళ్లికి అత్తవారిచ్చిన వెండి మరచెంబు, కంచం అమ్మి పంపించారు. 1946లోనే మళ్లీ రహస్య జీవితం మొదలయింది. 1948లో గాంధీజీ హత్య తర్వాత మళ్లీ కమ్యూనిస్టు పార్టీ మీద నిషేధం జరిగింది. విజయవాడలో కమ్యూనిస్టు, ఆర్.ఎస్.ఎస్. కార్యకర్తల మధ్య ఘర్షణలు జరగగా, అరెస్టు అయి కైకలూరు సబ్ జైలులో దాదాపు 3 నెలలున్నాక తప్పించుకొని మళ్ళీ రహస్య జీవితంలోకి వెళ్ళారు. 1948లో పోలీసు చర్య తర్వాత తెలంగాణ లోనే కాక వెన్నుదన్నుగా వున్న కోస్తా ఆంధ్ర జిల్లాలలోనూ కమ్యూనిస్టు శ్రేణులు ఆత్మరక్షణ చేసుకొనే స్థితిలో పడ్డాయి. పార్టీ ఆదేశం ప్రకారం కామ్రేడ్స్ ఇతర ప్రాంతాలకి తరలి వెళ్ళారు. మృత్యుంజయుడు, సంకు అప్పారావు, మరి కొందరు, ఒరిస్సా వెళ్లేందుకు రాజమండ్రిలో ఒక రహస్య స్థావరానికి చేరారు. ఇంతలో స్థావరం యిచ్చిన వ్యక్తి ప్రభుత్వం యిచ్చే పారితోషికానికి ఆశపడి పోలీసులకి ఆచూకీ యిచ్చాడు.సుందరయ్య 'వీర తెలంగాణ విప్లవ పోరాటం- గుణపాఠాలు" ప్రకారం మిగతా వారిని పంపించి ఆయన ఖమ్మం ప్రాంతంలో పోరాట శ్రేణుల్లో చేరవలసి వచ్చింది.పట్టుబడిన వారందరూ చిత్ర హింసలకి గురయ్యారు. మృత్యుం జయుడు పట్టుబడిన కబురు తెలిసి అందరూ స్థావరం మార్చుకున్నారు."మా స్థావరం ఆయనకు తెలుసు, వచ్చి మమల్ని కలుసుకోవలసి వుంది. ఆయన ఆ బాధలు భరించినందువల్ల మే బతికిపోయాం" అని రాజేశ్వరరావు, సుందరయ్య చెప్పేవారు. 1950 మే 16 బొమ్మూ రు మొట్ట దగ్గర చనిపోయినట్లు పత్రికల సమాచారం ఇచ్చాయి. కాల్చిన యస్.ఐ తనికెల సుబ్బారావు రిటైరైన తర్వాత... ఫొటోగ్రాఫర్ భూషణ్‌ను కలిసి, కానిస్టేబుళ్ళు మృత్యుంజయుని కాల్చడానికి నిరాకరించగా తాను కాల్చవలసి వచ్చిందని, ఆఖరి గుండు పేల్చే వరకూ ఆయన జయజయ నినాదాలు చేస్తూ నిలబడి వున్నారని చెప్పినట్లు సమాచారం. అప్పటి సహచరులు, కొరియరులు ఎందరో తమ పిల్లలకు మృత్యుంజయుడు అని పేరు పెట్టు కున్నారు. రాజమండ్రి సెంట్రల్ జైలు దగ్గర రిక్షా కార్మికులు తమ కాలనీకి మృత్యుంజయ నగర్ అని పేరు పెట్టారు. పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపు రంలో "మృత్యుంజయ నగర్ కాలనీ", గ్రంథాలయం ఏర్పడ్డాయి.

# కడప రెడ్డమ్మ పగ తీర్చేసుకున్నారుగా

కడప, మే 15,కడప జిల్లాలో టీడీపీ ఎమ్మెల్యే మాధవి రెడ్డి కసి తీర్చుకున్నారు. కడపలో ఫైర్ బ్రాండ్ లీడర్ గా మాధవి రెడ్డి గెలిచారు. గెలిచింది ఒకేసారి అయినప్పటికీ ఆమె నిత్యం వార్తల్లో ఉంటున్నారు. కడప రెడ్డమ్మగా ఆమె దూకుడుతో వ్యవహరిస్తున్న తీరు కొన్ని సార్లు విమర్శలకు ఎదురవుతున్నప్పటికీ ఏమాత్రం వెనక్కు తగ్గడం లేదు. మాధవి రెడ్డి కడప జిల్లాలో టీడీపీలో ఫైర్ ఉన్న లీడర్ గా ఎదుగుతున్నారు. కడప జిల్లా వైసీపీ అధినేత జగన్ సొంత జిల్లా కావడంతో మాధవీ రెడ్డి కి టీడీపీ కూడా అదే స్థాయిలో ప్రయారిటీ ఇస్తుంది. పార్టీ అన్ని రకాలుగా అండగా నిలుస్తుంది. తాజాగా కడప మేయర్ సురేష్ బాబును పదవి నుంచి తొలగించి తన పవర్ ఏంటో మాధవిరెడ్డి చూపించగలిగారువైసీపీకి, సురేష్ బాబుకు సానుభూతి వస్తుందా? లేదా? అన్నది పక్కన పెడితే తాను అనుకున్నది సాధించడంలో మాధవి రెడ్డి ముందున్నారని మాత్రం చెప్పాలి. తాను శపథం చేసినట్లుగానే తనకు మున్సిపల్ కార్పొరేషన్ సమావేశంలో వేదికపై కుర్చీ ఇవ్వనందుకు చివరకు మేయర్ కుర్చీనే లాగేశారు. మున్సిపల్ నిబంధనలను అడ్డుపెట్టి మేయర్ సురేష్ బాబును పదవి నుంచి తొలగించారు. మేయర్ సురేష్ బాబు తన కుటుంబ సభ్యులు డైరెక్టర్లుగా ఉన్న సంస్థకు అరవై లక్షల రూపాయల కాంట్రాక్ట్ పనులు అప్పగించారన్న ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం తాజాగా కడప మేయర్ సురేష్ బాబుపై వేటు వేసింది. దీంతో ఆయన కుర్చీ ఇవ్వనందుకు తన కుర్చీనే కోల్పోవాల్సి వచ్చింది.మొన్నటి ఎన్నికల్లో కడప జిల్లాలోనూ తెలుగుదేశం పార్టీ ఏడు నియోజకవర్గాల్లో గెలిచింది. పది శాసనసభ నియోజకవర్గాలున్న కడప జిల్లాలో తొలిసారి కూటమి పార్టీలకు ఇంతటి పెద్ద స్థాయిలో విజయం లభించింది. గతంలో ఇన్ని స్థానాలను టీడీపీ ఎప్పుడూ గెలవలేదు. మొన్నటి ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అత్యధిక స్థానాలను గెలుచుకుని సత్తా చాటింది.యితే కడప నియోజకవర్గంలో 1999లో గెలిచిన తర్వాత మళ్లీ టీడీపీ గెలిచింది 2024 లోనే. 1999 తర్వాత ఇక టీడీపీ అక్కడ గెలవలేదు. అంటే దాదాపు రెండున్నర దశాబ్దం కడప నియోజకవర్గంలో పసుపు జెండా ఎగురలేదనే చెప్పాలి. ఈసారి మాత్రం మాధవి రెడ్డి గెలిచి తన సత్తాను చాటారు. దీంతో ఆమెకు మంత్రి పదవి దక్కుతుందని భావించినా కొన్ని ప్రత్యేక పరిస్థితుల కారణంగా అది సాధ్యం కాలేదు.మాధవీ రెడ్డి భర్త కడప జిల్లా టీడీపీ అధ్యక్షుడు రెడ్డప్పగారి శ్రీనివాసులు రెడ్డి. తొలి నుంచి ఆయన కుటుంబం టీడీపీలోనే కొనసాగుతుంది. ఆర్థికంగా, సామాజికపరంగా బలమైన కుటుంబంగా పేరుంది. జగన్ సొంత జిల్లాలో అదీ కడపలో గెలవలేకపోయినా పార్టీ జెండాను రెడ్డప్పగారి కుటుంబం వదిలి పెట్టలేదు. ఈసారి మాత్రం తన సతీమణి మాధవరెడ్డికి టిక్కెట్ తెచ్చుకుని మరీ గెలిపించుకున్నారు. మాధవీ రెడ్డి గెలిచిన దగ్గర నుంచి స్పీడ్ గానే ఉన్నారు. కార్పొరేషన్ లో కుర్చీ కోసం చేస్తున్న గలాటా కూడా కొంత కాంట్రవర్సీగా మారినా ఆమె వెనక్కు తగ్గలేదు. కార్పొరేషన్ సమావేశంలోనే మాధవి రెడ్డి శపథం చేశారు. తనకు వేదికపై కుర్చీ వేయని నువ్వు కుర్చీలో ఉలా ఉంటావో చూస్తానంటూ వెళ్లిపోయారు. అనుకున్నట్లే మాధవి రెడ్డి అనుకున్నది సాధించారు.

### కాంట్రాక్టు పనులకు అప్పగించారని...

మేయర్ ను సురేష్ బాబును ప్రభుత్వం తొలగించింది. మున్సిపల్ శాఖ నిబంధనలను ఉల్లంఘించి తమ బంధువులకు కాంట్రాక్టు పనులకు అప్పగించారన్న ఆరోపణలపై కడప మేయర్ సురేష్ బాబును ఆ పదవి నుంచి తొలగించింది. మున్సిపల్ చట్టాలను ఉల్లంఘించారని విచారణలో తేలిందని మున్సిపల్ శాఖ తెలిపింది.దీనిపై నోటీసులు ఇచ్చిన మున్సిపల్ శాఖ విచారణకు హాజరు కావాలని కోరింది. నిన్న సురేష్ బాబు మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ శాఖ కార్యదర్శి ఎదుటహాజరయ్యారు. తమ కుటుంబ సభ్యులకు సంబంధించిన సంస్థకు అరవై లక్షల రూపాయల కాంట్రాక్ట్ పనులకు అప్పగించారన్న ఆరోపణలపై ఆయనను తొలగిస్తూ నిర్ణయిం తీసుకున్నారు. ప్రభుత్వం సురేష్ బాబుపై అనర్హతవేటు వేసింది.

# బుగ్గన పార్టీ మారుతున్నారా..

కర్నూలు మే 15, వైసీపీ ప్రభుత్వంలో తిరుగులేని స్థాయిలో చక్రం తిప్పిన ఆర్థికశాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఇప్పుడు ఎక్కడా కనిపించడం లేదు. వినిపించడం లేదు. 2024 ఎన్నికలలో బుగ్గన పరాజయం పాలయ్యారు. కర్నూలు జిల్లా డోన్ లో తెలుగుదేశం అభ్యర్థి కోట్ల విజయం సాధించారు. డోన్ లో తెలుగుదేశం జెండా ఎగరడం పదేళ్ల తర్వాత ఇదే తొలిసారి. చంద్రబాబు వ్యూహం ఫలించి కోట్ల విజయం సాధించారు. బుగ్గన పరాజయం పాలయ్యారు. వైసీపీ హయాంలో ఐదేళ్ల పాటు ఆర్థిక మంత్రిగా చక్రం తిప్పి, ఐదేళ్లు వరుసగా బడ్జెట్ ప్రవేశ పెట్టిన బుగ్గన ఆ ఓటమితో డోన్ లో అడ్రస్ లేకుండా పోయారు. అపర మేధావిలా అసెంబ్లీ లో వ్యవహరించిన ఆయన ఇప్పుడు కూటమి అధికారంలోకి రావడంతో తన వ్యాపార వ్యవహారాల కోసం జగన్‌కి హ్యాండ్ ఇచ్చే ఆలోచన చేస్తున్నారంట. అయితే కూటమి పార్టీలు నో ఎంట్రీ బోర్డు పెట్టడంతో ఏం చేయాలో తోచక అండర్‌గ్రౌండ్‌లోకి వెళ్లిపోయారన్న టాక్ నడుస్తోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని డోన్ రాజకీయం ఎప్పుడూ ప్రత్యేకంగా ఉంటుంది. గతంలో ఈ సెగ్మెంట్ లో ప్రస్తుతం తెలుగుదేశంలో ఉన్న కేఈ, కోట్ల కుటుంబాలే ప్రత్యర్ధులుగా కొనసాగాయి. 1978 నుంచి 2009 వరకు ఆ రెండు ఫ్యామిలీ మధ్యే ఎలక్షన్ వార్ నడుస్తూ వచ్చింది. 2014లో వైసీపీ నుంచి ఎంట్రీ ఇచ్చిన బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అనూహ్యంగా కేఈ కృష్ణమూర్తిపై గెలుపొందారు. రెండోసారి కూడా గెలిచిన బుగ్గన ఆర్థిక మంత్రిగా అయిదేళ్లు చక్రం తిప్పారు రాజకీయ ప్రత్యర్థులైన దిగ్గజ కుటుంబాలు కేఈ, కోట్ల కుటుంబాలు గత ఎన్నికల సమయానికి ఒకే గూటి కిందకు చేరడం, కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి టీడీపీ అభ్యర్థిగా బరిలోకి దిగడంతో బుగ్గనకు ఘోర పరాజయం తప్పలేదు. అదీ కాక నియోజకవర్గానికి అందుబాటులో ఉండకుండా అసెంబ్లీలో పిట్టకథలు చెప్తూ గడిపేసిన బుగ్గనపై డోన్‌లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఆ ఓటమి తర్వాత బుగ్గన డోన్ వాసులకు నల్లపూసై పోయారు. ఆర్థిక శాఖ మంత్రిగా ఆయన అక్రమాలపై కూటమి సర్కారు దృష్టి సారిస్తోందన్న ప్రచారంతో భయపడి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారంటున్నారు.వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ నాయకులను, వారి వ్యాపారాలను టార్గెట్ చేస్తూ బుగ్గన వేధింపులకు గురి చేశారన్న ఆరోపణలున్నాయి. అదే విధంగా బుగ్గనను ప్రజలు నేరుగా కలిసి తమ సమస్యలు చెప్పుకునే అవకాశం ఎప్పుడూ రాలేదు, అమరావతి, ఢిల్లీలోనే ఎక్కువ సమయం గడుపుతూ నియోజకవర్గంలో ప్రజలకు దూరమయ్యారు. అంతేగాక సొంత పార్టీ కేడర్‌ను కూడా బుగ్గన పట్టించుకోలేదని టాక్. వాటికి తోడు సొంత మండలం బేతంచెర్లలోనే బుగ్గన తీవ్రస్థాయిలో అరాచకాలకు పాల్పడ్డారంట. ప్రస్తుతం కేసుల భయం వెంటాడుతుండటంతో బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి వైసీపీని వీడి జగన్‌కు హ్యాండ్ ఇచ్చే ఆలోచనలో ఉన్నారంట. ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు అప్పుల కోసం ఢిల్లీ చుట్టూ తిరిగి అక్కడి పెద్దలతో అంతో ఇంతో పరిచయాలు పెంచుకున్న ఆయన.. బీజేపీలో చేరడానికి వారితో మంతనాలు సాగిస్తున్నారంట. అందుకే ఆయన వైసీపీ కార్యక్రమాల్లో కూడా కనిపించడం లేదనీ, ఎక్కువ టైమ్ ఢిల్లీలోనే గడుపుతున్నారని బుగ్గన అనుచరులు చెప్పుకుంటున్నారంట. బీజేపీలో చేరడానికి ఆయన చేస్తున్న ప్రయత్నాల సంగతి తెలిసి డోన్ కూటమి నేతలు తమ అధిష్టానాలపై తీవ్ర ఒత్తిడి తెచ్చారంట. దాంతో బుగ్గనకు కూటమి పార్టీల్లో ఎంట్రీకి డోర్స్ క్లోజ్ అయిపోయారంటున్నారు. ఆ క్రమంలో బుగ్గన ఆచూకీ ఆయన సొంత అనుచరులకే అంతుపట్టకుండా తయారైందంట.

# చెవిరెడ్డి భాస్కరరెడ్డి గాయబ్...

తిరుపతి, మే 15,వైసీపీలో కీలక నేతగా వెలుగొందిన చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి అధికారంలో ఉన్నంత కాలం తెగ దూకుడు ప్రదర్శించారు. అలాంటి ఫైర్‌బ్రాండ్ కనీళ్లు పెట్టుకోవడం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. తన స్వగ్రామం తుమ్మలగుంట అత్మీయసభలో మీకు అన్ని చేశాను, కాని మీరు నా కొడుకును ఓడించారంటూ తన మనోవేదన వెళ్లగక్కిన సందర్భంలో ఆయన కళ్లు చెమర్చాయి. గత 11 నెలలుగా గ్రామస్తులలో ఎలాంటి సమావేశాలు పెట్టని అయన తాజాగా ఉన్నట్లుండి మీటింగ్ పెట్టారు. అసలు చెవిరెడ్డి ఎందుకు అంత అత్యవసరంగా అత్మీయ సమావేశం ఏర్పాటు చేశారనేది చర్చనీయాంశంగా మారింది.ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే కాకుండా రెండు తెలుగు రాష్ట్రాలలో వైసిపి కీలక నాయకుడు చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అంటే తెలియని వారుండరు. జగన్ ప్రభుత్వంలో తుడా చైర్మన్‌గా వ్యవహరించిన ఆయన మంత్రి పదవి దక్కించుకోలేక పోయినప్పటికీ.. చాలా మంది మంత్రుల కంటే ఎక్కువగానే చెలాయించారు. జగన్‌కు అత్యంత సన్నిహితుడైన చెవిరెడ్డి ఏకంగా తాడేపల్లిలోని జగన్ ప్యాలెస్‌లో తిరుమల దేవాలయ సెట్ వేయించి తన నాయకుడితో ఉగాది వేడుకలు నిర్వహింప చేసి తన వీరవిధేయత చాటుకుని విమర్శల పాలయ్యారు.2014లో టీడీపీలోని అనైక్యతతో చంద్రగిరిలో సొంత సామాజికవర్గం గల్లా అరుణకూమారిని వ్యతిరేకించడంతో చెవిరెడ్డి మొదటిసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. తర్వాత 2019లో జగన్ గాలిలో సునాయాస విజయం సాధించారు. అయితే మొదటి సారి ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి నియోజకవర్గంలో పట్టు కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారు. నియోజకవర్గం వ్యాప్తంగా పండుగలకు తాయిలాలు పంచడంతో పాటు ఇంటింటికి శుభాకాంక్షలు వెళ్ళేవి. దానికి తోడు వాలంటీర్ వ్యవస్థ రాక ముందే తానే నియోజకవర్గంలో అలాంటి వ్యవస్థను ఏర్పాటు చేసుకుని మంత్రాంగం సాగించారు. అలా అన్నీ కలిసి వచ్చి 2019లోఆయన భారీ మెజార్టీతో గెలవగలిగారు.ఎన్నికల తర్వాత శాసన సభ విప్‌తో పాటు తుడా చైర్మన్ పదవి కూడా అయనకే దక్కింది. తుడా పదవిని అడ్డంపెట్టుకుని చెవిరెడ్డి పెద్ద తతంగమే నడిపారు. తన గ్రామ సమీపంలోని తుమ్మలగుంట చెరువును సగానికిపైగా పూడ్పించి.. తుడా నుంచి 60 కోట్లు పైగా ఖర్చు పెట్టి అత్యాధునిక వాకింగ్ ట్రాక్‌తో పాటు, అనేక విధాలుగా అభివృద్ధి చేసారు. చెరువును పూడుస్తున్నా చెవిరెడ్డి హవా చూస్తూ ఇరిగేషన్ శాఖ వారు నోరెత్తలేకపోయారంటారు. తుడా పరిధిలో ఇష్టా రాజ్యంగా బెంచీల పేరుతో కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి, ఆ బల్లలపై తన పేరు వేయించుకుని చెవిరెడ్డి చేసిన ప్రచార అర్భాటం ఇప్పటికీ ప్రజల నోళ్లలో నానుతూనే ఉంది. దానికి తోడు రహదారులకు సైతం వైఎస్‌తో పాటు తన పేరు పెట్టుకున్న ఘనత ఆయనది. తుడా అనేది కేవలం చంద్రగిరి నియోజకవర్గం వరకే అన్నట్లు పాలన సాగించారు. తుడా నిధులతో సొంత సర్వే టీములకు, వ్యక్తిగత సిబ్బందికి జీతాలు ఇప్పించుకున్నారన్న ఆరోపణలున్నాయి. వాటితో పాటు అనేక రకాలుగా తుడా నిధులు దుర్వినియోగం చేశారన్న అభియోగాలున్నాయి.తుడా నిధులతో తుమ్మల గుంట చెరువులో ఏర్పాటు చేసిన పార్కుపై ఇప్పటికీ వివాదాలు నడు స్తున్నాయి. పూర్వం చెరువు ఏలాగుందో అలా ఉంచాలని చాలామంది గ్రీన్ ట్రిబ్యునల్‌కువెళ్ళారు. ఇప్పటికే గ్రీన్ ట్రిబ్యునల్ అదేశాలతో అవిలాల చెరువును యాధావిధిగా ఉంచడానికి టీటీడీ ఇరిగేషన్ శాఖ అందులో ఉన్న నిర్మాణాలు తొలగిస్తోంది. ఇదే పరిస్థితి తుమ్మల గుంట చెరువులో ఏర్పాటు చేసిన పార్క్‌కు కూడా పట్టే కాలం దగ్గరలో ఉందని అంటున్నారుఎన్నికలలో ఎంపీగా ఒంగోలు నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు చెవిరెడ్డి. మరో వైపు చంద్రగిరిలో తన కూమారుడు మోహిత్ రెడ్డిని అభ్యర్థిగా రంగంలో దించారు. మోహిత్ భారీ తేడాతో టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని చేతిలో ఓటమి పాలయ్యారు. ఇప్పుడు పలు కేసులు, వివాదాలు చెవిరెడ్డిని చుట్టుముడుతున్నాయి. ఓటర్ల జాబితా తయారీలో అక్రమాలకు పాల్పడ్డారని ఎమ్మెల్యే పులివర్తి నాని ఫిర్యాదుతో సీఐడీ కేసులు పెట్టి విచారిస్తోంది. తుడా నిధుల అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరుగుతున్నది. దాంతో పాటు పోలింగ్ తర్వాత పులివర్తి నానిపై పద్మావతి మహిళా యూనివర్సిటీలో జరిగిన దాడికి సంబంధించి హత్యాయత్నం కేసుల విచారణ సాగుతోంది.వాటితో పాటు తుమ్మలగుంట చెరువులో ఉన్న పార్క్‌ను ఇప్పటి వరకు చెవిరెడ్డి తన సొంత ఆస్తిలా భావిస్తూ వచ్చారు.. ఇప్పుడు దాన్ని తుడా నిర్వహణలో తీసుకోవాలని పై స్థాయిలో నిర్ణయం తీసుకోవాలని ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతుండటంతో పావులు కదపడం మొదలు పెట్టారంట. గ్రామంలోని వారందరితో అత్యవసర అత్మీయ సమావేశం ఏర్పాటు చేసి మరీ తాను అందర్నీ బిడ్డల కంటే ఎక్కువగా చూసుకున్నా, తన బిడ్డని ఓడించారంటూ సెంటిమెంట్ పండించే ప్రయత్నం చేశారంట. దాంతో పాటు పార్క్‌ను తుడా నిర్వహిస్తే దారుణంగా మారిపోతుందని దాని కోసం పోరాటం సాగిద్దామని పిలుపు నివ్వడం హాస్యాస్పదంగా మారింది. పార్క్ కట్టిన చెరువు ఇరిగేషన్ శాఖది, అయితే నిధులు తుడావి అయినప్పుడు నిర్వహణ అవి చేయాలి కానీ తన పరిధిలో ఉంచుకోవాలని ప్రయత్నించడంపై విమర్శలు వస్తున్నాయి. మొత్తం మీద సొంత అస్తి కోల్పోతున్నట్లు చెవిరెడ్డి తెగ ఇదై పోతున్నారని అందరూ సెటైర్లు విసురుతున్నారు. పక్కనున్న హాథీరాంజీ మఠం భూములలో గ్రామస్తులు కొంతమంది ఇల్లు కట్టుకున్నప్పుడు వాటిని చెవిరెడ్డి కూల్చి వేయించారు. ఇప్పుడు తన దాకా వచ్చే సరికి నొప్పి తెలుస్తోందని గ్రామస్తులు దెప్పిపొడుస్తున్నారు. మొత్తం మీద చెవిరెడ్డి కన్నీటి ఎపిసోడ్ ఇప్పుడు పెద్ద చర్చనీయాంశంగా మారింది.

# క్లైమాక్స్ కు చేరిన లడ్డూ కల్తీ కేసు

విజయవాడ, మే 15, లడ్డూ ప్రసాదం కల్తీ కేసు దర్యాప్తులో సిట్ దూకుడు పెంచింది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఈ కేసు దర్యాప్తును సీబీఐ ఆధ్వర్యంలో ప్రత్యేక సిట్ ఏర్పాటు చేసి మరీ దర్యాప్తు చేస్తున్న సంగతితెలిసిందే. సిట్ దర్యాప్తులో భాగంగా నెయ్యి సరఫరాకు తిరుమల తిరుపతి దేవస్థానం టెండర్ దక్కించుకున్న తమిళనాడు రాష్ట్రం దిండుగల్ కు చెందిన ఏఆర్ డైరీ నెయ్యి సరఫరా చేయలేదని తేలింది. మరి ఏం జరిగింది అంటే.. నెయ్యి ని ఉత్తరాఖండ్ రూర్కీలోని బోలేబాబ డైరీ నుంచి కొనుగోలు చేసి తిరుపతి జిల్లా లోని వైష్ణవి డైరీకి తరలించారు. అక్కడ ఏఆర్ డైరీ సీల్ వేసి టీటీడీకి సరఫరా చేశారు. ఈ విషయం దర్యాప్తులో తేలడంతో సిట్ అధికారులు నెల్లూరులోని ఏసీబీ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. అసలు శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగం గురించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తొలుత ప్రకటించారు. ఒక సభలో ఆయన జగన్ ప్రభుత్వ హయాంలో తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగం జరిగిందని ప్రకటించారు. హిందువులు ఆరాధ్యదైవం అయిన తిరుమల వేంకటేశ్వరస్వామి. ఈ శ్రీవారి దర్శన భాగ్యం అదృష్టంగా భక్తులు భావిస్తారు. అంతే అదృష్టంగా తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని స్వీకరిస్తారు. అందుకే స్వామి వారి లడ్డూ ప్రసాదం భక్తులకు అత్యంత ప్రీతిపాత్రం అయ్యింది. స్వామి వారి దర్శనం లేకపోయినా లడ్డూ ప్రసాదం లభిస్తే స్వామి వారి దయ ఉన్నట్లేనని భావిస్తారు. అలాంటి ప్రసాదం అపవిత్రం చేస్తూ జగన్ హయాంలో లడ్డూ ప్రసాదానికి వినియోగించే నెయ్యి కల్తీ అయిందని? రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు సభా ముఖంగా ప్రకటించారు. చంద్రబాబు ప్రకటన అప్పట్లో సంచలనం సృష్టించింది. తెలుగుదశం కూటమి పార్టీలూ, వైసీపీల మధ్య మాటల యుద్ధమే జరిగింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి అంశంపై దర్యాప్తునకు సిట్ ఏర్పాటు చేసింది.అయితే ఈ కేసులో సిట్ దర్యాప్తుపై సందేహాలు వ్యక్తమౌతూ దాఖలైన పిటిషన్ ను విచారణకు స్వీకరించి.. ప్రత్యేక దర్యాప్తు బృందం సీబీఐ ఆధ్వర్యంలో జరగాల్సిందేనని ఆదేశించిన సుప్రీం కోర్టు కొత్త సిట్ ను ఏర్పాటు చేసింది. ఇప్పుడా ప్రత్యేక సిట్ ఏసీబీ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసింది. సిట్ దాఖలు చేసిన ఛార్జ్ షీట్ లో 12 మంది పేర్లు ఉన్నాయని చెబుతున్నారు. ఏ1 గా ఏఆర్ డైరీ, ఏ2 గా ఆ సంస్థ ఎండీ రాజు రాజశేఖరన్, ఏ3గా పొమిల్ జైన్, ఏ4గా విపిన్ జైన్, ఏ5 అపూర్వ చవాడాలను చేర్చింది. ఈ ఆరుగురినీ సిట్ పలుమార్లు విచారించింది. సిట్ అరెస్ చేసి పలు దఫాలు విచారణ చేశారు. ఏ6 బోలేబాబ డైరీ, ఏ7 వైష్ణవి డైరీని చేర్చారు. ఏ8 వైష్ణవి డైరీ ప్లాంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ షబిల్ కలీముల్లాఖాన్ తో పాటు టీటీడీ ప్రొక్యూర్ మెంట్ ఉద్యోగి, బోలేబాబ సీజీఎం, నెయ్యి ముడిపదార్థాలు సరఫరా చేసే వారిని ఛార్జ్ షీట్ లో పొందుపరిచారు. త్వరలో మరింత మందిని విచారణ చేసే అవకాశం ఉంది.

# వైజాగ్ లో హోం స్టే

విశాఖపట్టణం, మే 15, విశాఖపట్నం వచ్చే పర్యాటకులకు హోమ్ స్టే సౌకర్యాన్ని కల్పించాలని అధికారులు నిర్ణయించారు. కనీసం ఒక గది నుంచి ఆరు గదుల వరకూ అన్ని వసతులతో పర్యాటకులకు అందించగలిగేవారు రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని పిలుపునిచ్చారు.

విశాఖపట్నం వచ్చే పర్యాటకులకు 'ఇంటిలో ఆతిథ్యం' ఇవ్వాలనుకునేవారు రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని పర్యాటక శాఖ అధికారులు పిలుపునిచ్చారు. ఎవరికైనా సొంత ఇల్లు/విల్లా/అపార్టుమెంట్ ఫ్లాట్ ఉండి, వాటిని పర్యాటకులకు రోజువారీ పద్ధతిలో అద్దెకు ఇవ్వడానికి ఆసక్తి ఉంటే పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా పర్యాటక శాఖాధికారిణి జె.మాధవి సూచించారు. పర్యాటకులకు అన్ని ప్రాంతాల్లోను హోటళ్లలో గదులు లభించవు. అలాగే తినడానికి ఆహారం కూడా దొరకదు. చాలామంది పర్యాటకులు స్థానికంగా లభించే ఆహార పదార్థాలను రుచి చూడాలనుకుంటారు. అక్కడి మనుషులతో మాట్లాడి, సంస్కృతీ సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లు, దుస్తులు, స్థానిక కళల గురించి తెలుసుకోవాలనుకుంటారు. ఇవన్నీ సాధారణ హోటళ్లలో లభించవు. అటువంటి అభిరుచి కలిగిన వారికి స్థానిక విధానంలో 'వసతి సౌకర్యాలు' కల్పించడాన్ని 'హోమ్ స్టే'గా వ్యవహరిస్తున్నారు.కేరళతో పాటు కశ్మీర్, పంజాబ్ వంటి రాష్ట్రాలతో పాటు మలేషియా వంటి దేశాల్లో, గిరిజన ప్రాంతాల్లో ఈ హోమ్ స్టే బాగా ఆదరణ పొందింది. దీనివల్ల స్థానికులకు కూడా ఉపాధి లభిస్తోంది. వారి సంస్కృతి, సంప్రదాయాలకు ప్రచారం పెరుగుతోంది. ప్రభుత్వాలపై ఒత్తిడి తగ్గుతోంది. రాష్ట్రాలకు వచ్చే పర్యాటకులకు అవసమైనన్ని గదులు పర్యాటక, ప్రైవేటు సంస్థలు సమకూర్చలేకపోతున్నాయి. ఈ హోమ్ స్టే వల్ల పర్యాటకంగా డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో స్థానికులే వారి గృహాలను అందంగా అలంకరించి, వాణిజ్య ధరల కంటే తక్కువకే వసతి కల్పించడం, ఇంట్లో వండిన ఆహార పదార్థాలను ఆప్యాయంగా వడ్డించడం వల్ల పర్యాటకుల సంతృప్తి శాతం పెరుగుతోంది.రాష్ట్ర ప్రభుత్వం దీనిని నూతన పర్యాటక పాలసీలో చేర్చింది. కనీసం ఒక గది నుంచి ఆరు గదుల వరకు అన్ని వసతులతో పర్యాటకులకు అందించగలిగేవారు పేర్లు నమోదు చేయించుకోవాలని పిలుపునిచ్చింది. ఆంధ్రప్రదేశ్ పర్యాటక ప్రాధికార సంస్థ (ఏపీటీఏ) వెబ్‌సైట్‌లో ఎవరికి వారే వివరాలు నమోదు చేసుకోవచ్చు. ఇతర వివరాలకు 0891-2754716 నంబరులో సంప్రతించాలని జె.మాధవి సూచించారు. కొద్ది రోజులు గడిచాక ఆసక్తి కలిగిన వారిని పిలిచి అవగాహన సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. విధి విధానాలు తెలియజేస్తామని, పర్యాటకులే నేరుగా ఎవరికి ఎక్కడ నచ్చితే అక్కడి హోమ్ స్టేను ఎంపిక చేసుకుంటారని వివరించారు.

# స్విమ్స్ కు పూర్తి స్థాయి సౌకర్యాలు

తిరుపతి, మే 15, తిరుపతి స్విమ్స్‌లో వైద్య సేవలను మరింత ఉన్నతంగా అందించేందుకు టిటిడి చైర్మెన్ బీఆర్ నాయుడు నేతృత్వంలో చర్యలు చేపట్టారు. బుధవారం జరిగిన జనరల్ కౌన్సిల్ సమావేశంలో, మాజీ టిటిడి ఈవో ఐవి సుబ్బరావు అధ్యక్షతన ఏర్పాటైన ఎక్స్‌పర్ట్ కమిటీ సమర్పించిన నివేదికపై చర్చించారు. ఈ నివేదికలో మౌలిక సదుపాయాలు, మానవ వనరులు, వైద్య పరికరాలు, ఇంజనీరింగ్ పనులు, నిధుల సేకరణ, వైద్య నిపుణుల సేవలు వంటి అంశాలపై సిఫార్సులు ఉన్నాయి. ఈ నివేదికను టిటిడి బోర్డులో చర్చించి, రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని చైర్మెన్ తెలిపారు.శ్రీ వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (స్విమ్స్), తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో తిరుపతిలో నడిచే ప్రతిష్ఠాత్మక వైద్య సంస్థ. స్విమ్స్ ఆస్పత్రి ద్వారా ఎంతో మంది పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు.

2021లో స్విమ్స్ ఆస్పత్రిని టీటీడీ తన నియంత్రణలోకి తీసుకుంది. మరోవైపు తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు టీటీడీ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన బుధవారం స్విమ్స్ సమావేశ మందిరంలో జనరల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన టీటీడీ ఛైర్మన్ స్విమ్స్ ఆస్పత్రిలో మరింత మెరుగైన సేవలు అందిస్తామన్నారు. ఇందుకోసం మాజీ టీటీడీ ఈవో ఐవీ సుబ్బారావు నేతృత్వంలో నిపుణుల కమిటీ వేశామని.. ఈ నిపుణుల కమిటీ అధ్యయనం చేసి నివేదిక సమర్పించిందని బీఆర్ నాయుడు తెలిపారు.

నిపుణుల కమిటీ అందించిన నివేదిక ఆధారంగా స్విమ్స్ ఆస్పత్రిలో మౌళిక సదుపాయాలు, మానవ వనరులు, వైద్య పరికరాలు, ఇంజనీరింగ్ పనులు చేపట్టనున్నట్లు టీటీడీ ఛైర్మన్ వెల్లడించారు. మరింత ఉన్నతంగా వైద్య సేవలు అందించేందుకు వైద్య నిపుణుల సేవలు, నిధుల సేకరణ అంశాల గురించి కూడా నిపుణుల కమిటీ పలు సూచనలు చేసిందని.. ఈ నివేదికపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటామని వివరించారు. మరోవైపు స్విమ్స్ ఆసుపత్రికి టీటీడీ నుంచి సంపూర్ణ సహకారం అందిస్తున్నట్లు టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. ఏటా టీటీడీ నుంచి స్విమ్స్ ఆస్పత్రికి రూ. 60 కోట్ల గ్రాంట్ అందించటంతో పాటుగా.. ఎంప్లాయిస్ హెల్త్ స్కీం, ప్రాణదాన ట్రస్ట్ , వివిధ రకాల ట్రస్టుల ద్వారా రూ. 100 కోట్లకుపైగా మద్దతుగా అందిస్తున్నామని వివరించారు.స్విమ్స్ ఆస్పత్రిలో ఏడాదికి 18,000 సర్జరీలు జరుగుతుంటాయని.. 4.50 లక్షల మందికి పైగా ఔట్ పేషంట్లు, 47 వేలమంది ఇన్‌పేషెంట్లు వైద్య సేవలు పొందుతున్నారని టీటీడీ ఈవో శ్యామలరావు వివరించారు. స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిలో పేదలే అత్యధికంగా ఉన్నారని.. భవిష్యత్ తరాలకు సరిపడేలా ప్లాన్ ప్రకారం స్విమ్స్ ఆస్పత్రిలో నూతన భవనాల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు.

అంకాలజీ , చిన్న పిల్లల ఆరోగ్యం కోసం నిర్మాణాలు జరుగుతున్నాయని వివరించారు.మరోవైపు స్విమ్స్ ఆస్పత్రిలో అత్యాధునిక వైద్య పరికరాలతో నిర్మితమవుతున్న క్యాన్సర్ భవనాన్ని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు అంతకుముందు పరిశీలించారు. 391 పడకల సామర్థ్యంతో ఈ క్యాన్సర్ భవనాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో 5 ఆపరేషన్ థియేటర్లు ఉండనున్నాయి. ఈ సందర్భంగా చికిత్స పొందుతున్న పలువురు రోగులతో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ముచ్చటించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు

# లోకేశ్ కు పగ్గాలు...



విజయవాడ, మే 15,నారా లోకేశ్ కు కీలక పదవి లభించనుంది. పార్టీ నేతల డిమాండ్ కు చంద్రబాబు ఓకే చెప్పినట్లు తెలిసింది. ఈ నెలలో టీడీపీ మహానాడు జరగనుంది. కడప జిల్లాలో నిర్వహించనున్న ఈ మహానాడులో అనేక ప్రశ్నలకు సమాధానం చెప్పనుంది. ఇప్పటి వరకూ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న నారా లోకేశ్ అంతకంటే కీలకమైన పదవిని చేపట్టబోతున్నారన్న టాక్ పార్టీలో వినపడుతుంది. కార్యకర్తలు కూడా నారా లోకేశ్ నాయకత్వం కావాలని బలంగా కోరుకుంటుండటంతో ఈ మేరకు లోకేశ్ కు కీలకమైన పదవి కట్టబెట్టే అవకాశముందని తెలిసింది. ఇందుకోసం ఇప్పటికే కొందరు నేతలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి కూడా తీసుకెళ్లారు. ఆయన నుంచి ఇంకా గ్రీన్ సిగ్నల్ రాకపోయినా ఖచ్చితంగా అంగీకరిస్తారన్న నమ్మకంతో పసుపు పార్టీ నేతలున్నారు. ఈరోజు జరిగే పొలిట్ బ్యూరో సమావేశంలో లోకేశ్ పదవి పై చర్చించనున్నారుఎవరు అవునన్నా.. కాదన్నా నారా లోకేశ్ ఇప్పుడు పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ కీలకం. ఆయన తన ముద్రను అన్ని రకాలుగా చూపించుకుంటున్నారు. దీంతో పాటు కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉంటున్నారు. నారా లోకేశ్ ఈ తరం నాయకుడు కావడంతో యూత్ కు కనెక్ట్ కావడంతో ఆయన ఇమేజ్ ను మరింత పార్టీ పరంగా పెంచాలన్న ప్రయత్నంలో పార్టీ నేతలున్నారు. చంద్రబాబు నాయుడు కూడా ముఖ్యమంత్రిగా బాధ్యతలను నిర్వహిస్తూ ఇటు పార్టీ కార్యక్రమాలను చక్కబెట్టలేకపోతున్నారు. చంద్రబాబుకూడా వీలయినంత వరకూ జిల్లాల పర్యటనకు వెళ్లినప్పుడు నియోజకవర్గాల్లోనూ ముఖ్య కార్యకర్తలతో సమావేశమవుతున్నప్పటికీ లోకేశ్ అయితే బాగుంటుందన్న సూచనలు బలంగా వినిపిస్తున్నాయి. పొలిట్ బ్యూరోతో పాటు పార్టీలోనూ యువతకు ప్రాధాన్యం ఇవ్వాలనిభావిస్తున్నారు. సీనియర్లకు మాత్రం సలహాలు, సూచనలు అందించేలా ప్రత్యేక వింగ్ ఏర్పాటు చేయనున్నారు.అయితే మొన్నటి వరకూ ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలంటూ డిమాండ్లు బాగానే వినిపించాయి. అయితే ఆ సౌండ్ ను మాత్రం చంద్రబాబు సమర్థవంతంగా కొంత అణిచి వేయగలిగారు. కొందరు ఒక అడుగుముందుకు వేసి కాబోయే ముఖ్యమంత్రి అని సంబోధించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేత చీవాట్లు కూడా తిన్నారు. అయితే పార్టీలో భవిష్యత్ అంతా లోకేశ్ దే ఉంటుందని భావించిన నేతలు ఏ మాత్రం వెనక్కు తగ్గడం లేదు. డిప్యూటీ సీఎం అంటే కొన్నిఆటంకాలు ఉండవచ్చని, కానీ పార్టీ విషయంలో మాత్రం లోకేశ్ కు మరింత ప్రాధాన్యత ఇవ్వాల్సిందేనని అంటున్నారు. నిత్యంకార్యకర్తలకు అందుబాటులో ఉండే లోకేశ్ కు కీలక పదవి ఇస్తేనే పార్టీ మరింత బలోపేతమవుతుందని చంద్రబాబు చెవిలో మరీ చెప్పే వారి సంఖ్య ఎక్కువవుతుంది.మహానాడులో పార్టీ పగ్గాలు ఇక లోకేశ్ చేతికి అందేలా పదవిని రెడీ చేస్తున్నారట. ఇప్పటికే పార్టీ అంతా లోకేశ్ కనుసన్నల్లోనే నడుస్తుంది. అయితే అధికారికంగా దానికి ముద్ర పడాలంటే కీలకమైన పదవి అప్పగించాలన్న డిమాండ్ ఊపందుకోవడంతో పాటు లోకేశ్ అయితేనే కార్యకర్తలు కూడా హ్యాపీగా ఫీలవుతారన్న అభిప్రాయం పార్టీలో బలంగా వినిపిస్తుంది. అందుకే కడప జిల్లాలో ఈ నెలలో జరిగే మహానాడులో లోకేశ్ కు కీలక పదవిని అప్పగించే యోచనలో చంద్రబాబు కూడా ఉన్నట్లు తెలిసింది. దీంతో ఇక అధికారికంగా లోకేశ్ పార్టీలో మరింత కీలకంగా నిర్ణయాత్మక శక్తిగా చినబాబు మారనున్నారన్నది పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తుంది. ఈరోజు జరిగే పొలిట్ బ్యూరో సమావేశంలో దీనిపై చర్చించి ఆమోద ముద్ర వేసే అవకాశాలున్నాయి.

# పాకిస్తాన్ కోలుకోవడం అంత ఈజీ కాదు

భారత్, పాకిస్తాన్ కాల్పుల విరమణకు అంగీకరించినప్పటికీ, పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత భారత్ తీసుకున్న ఐదు కీలక నిర్ణయాలు పాకిస్థాన్‌ను చావుదెబ్బ తీశాయి. ఇప్పుడే కాదు భవిష్యత్తులో కూడా పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థను అవి ప్రభావితం చేస్తూనే ఉంటాయి. పహెల్గామ్ ఉగ్రదాడికి భారత్ ప్రతీకారం తీర్చుకుంది.. ఆపరేషన్ సింధూర్ పేరుతో పాక్‌లోని ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసింది. మే 7, 2025న చేపట్టిన ఆపరేషన్ సింధూర్.. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో భారతదేశ సైనిక, వ్యూహాత్మక పరాక్రమాన్ని ప్రదర్శించింది. పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై ఈ సర్జికల్ స్ట్రైక్ చేసిందిసింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయడం, గగనతలాన్ని మూసివేయడం, ప్రత్యక్ష, పరోక్ష వాణిజ్యంపై పూర్తి నిషేధం వంటి ఈ చర్యలే అందుకు కారణం. ఉగ్రవాదం, వాణిజ్యం రెండు కలిసి సాగవు అంటూ ప్రధాని మోదీ పాకిస్థాన్‌కు గట్టి హెచ్చరికలు జారీ చేశారు.సింధు జలాల ఒప్పందం నిలిపివేత.. 1960 సెప్టెంబర్ 19న కుదిరిన సింధూ జలాల ఒప్పందం.. భారత్, పాకిస్తాన్ మధ్య ఒక ముఖ్యమైన నీటి భాగస్వామ్య ఒప్పందం. తొమ్మిది సంవత్సరాల చర్చల తర్వాత ప్రపంచ బ్యాంకు దీనికి మద్దతు ఇచ్చింది. దీనిపై అప్పటి భారత ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ, పాకిస్తాన్ అధ్యక్షుడు అయూబ్ ఖాన్ సంతకం చేశారు. భారత ప్రభుత్వం ప్రకారం.. పాకిస్తాన్ సింధూ నది వ్యవస్థపై ఎక్కువగా ఆధారపడి ఉంది. దాని 16 మిలియన్ హెక్టార్ల వ్యవసాయ భూమిలో 80 శాతం నీటిపారుదల, దాని మొత్తం నీటి వినియోగంలో 93 శాతం వాటా కలిగి ఉంది. ఈ నదీ వ్యవస్థ 237 మిలియన్ల మందికి మద్దతు ఇస్తుంది. గోధుమ, వరి, పత్తి వంటి కీలక పంటల ద్వారా పాకిస్తాన్ జిడిపిలో 25 శాతం వాటాను అందిస్తుంది. అయితే మంగళా, టార్బెలా వంటి ప్రధాన జలాశయాలలో పరిమితమైన లైవ్ వాటర్ నిల్వ, వార్షిక ప్రవాహ సామర్థ్యంలో కేవలం 10 శాతం ఉండటంతో నీటి సరఫరాలో అంతరాయం వల్ల తీవ్రమైన వ్యవసాయ నష్టం, ఆహార అభద్రత, నగరాల్లో నీటి కొరత, విస్తృత విద్యుత్ అంతరాయాలకు కారణమవుతుంది. ఈ అంతరాయాలు వస్త్రాలు, ఎరువులు వంటి కీలక రంగాలను తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. ఇది విస్తృత ఆర్థిక, విదేశీ మారక ద్రవ్య సంక్షోభానికి దారితీస్తుంది.వాణిజ్యం రద్దు.. మే 2న జారీ చేసిన నోటిఫికేషన్‌లో ఈఖ 2023లో కొత్త నిబంధనను ప్రవేశపెట్టిన డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ పాకిస్తాన్ నుండి దిగుమతులపై పూర్తి నిషేధం విధించింది. ఈ నిర్ణయం "తదుపరి ఆదేశాలు వచ్చే వరకు పాకిస్తాన్‌లో ఉద్భవించే లేదా ఎగుమతి చేసే అన్ని వస్తువుల ప్రత్యక్ష లేదా పరోక్ష దిగుమతి లేదా రవాణాను తక్షణమే నిషేధించాలని" నిర్దేశిస్తుంది. ఇప్పటికే అధిక ద్రవ్యోల్బణం, బలహీనమైన ఆర్థిక వ్యవస్థతో పోరాడుతున్న పాకిస్తాన్‌పై 'పరోక్ష' దిగుమతుల నిషేధం తీవ్రంగా ప్రభావం చూపుతుందని భావిస్తున్నారు. భారత్, పాకిస్తాన్ మధ్య ప్రత్యక్ష వాణిజ్యం తక్కువగా ఉన్నప్పటికీ, గణనీయమైన పరిమాణంలో వస్తువులు థర్డ్ పార్టీ దేశాల ద్వారా వర్తకం నడుస్తోంది.

ఒక నివేదిక ప్రకారం.. దాదాపు 500 మిలియన్ అమెరికన్ డాలర్ల విలువైన డ్రై ఫ్రూట్స్, రసాయనాలు వంటి వస్తువులు ఇతర దేశాల ద్వారా భారతదేశానికి చేరుకుంటాయి. భారతదేశం విధించిన నిషేధంతో పరోక్ష దిగుమతులను కూడా కవర్ చేస్తూ కస్టమ్స్ అధికారులు ఇప్పుడు మధ్యవర్తిత్వ దేశాల ద్వారా పాకిస్తాన్ వస్తువులను నిరోధించగలరని టైమ్స్ ఆఫ్ ఇండియా నివేదించింది.ఎయిర్ స్పేస్ మూసివేయడం.. పాకిస్తాన్ రిజిస్టర్డ్, ఆపరేట్ చేయబడిన లేదా లీజుకు తీసుకున్న అన్ని విమానాలు వాణిజ్య, సైనిక, ప్రైవేట్ విమానాలు సహా భారత గగనతలాన్ని ఉపయోగించకుండా నిషేధిస్తూ ఇండియా ఎయిర్‌మెన్ కు నోటీసు జారీ చేసింది. ఈ చర్య విమాన షెడ్యూల్‌లకు గణనీయంగా అంతరాయం కలిగిస్తుంది. ప్రయాణ సమయాలను పొడిగిస్తుంది. పాకిస్తాన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్ నిర్వహణ ఖర్చులను పెంచుతుంది.

విమాన ప్రయాణ వ్యవధిని పొడిగించడం వల్ల ఎక్కువ ఇంధనం, ఎక్కువ సిబ్బంది షిఫ్ట్‌లు అవసరం అవుతాయి.సరిహద్దుల మూసివేత.. భారత్, పాకిస్తాన్ మధ్య ప్రధాన వాణిజ్య వారధి అయిన అట్టారి సరిహద్దును మూసివేయడం వలన పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థకు గణనీయమైన నష్టం వాటిల్లుతుందని భావిస్తున్నారు. ఈ చర్య వస్తువుల ప్రవాహానికి అంతరాయం కలిగిస్తుంది. ఈ మార్గంపై ఎక్కువగా ఆధారపడే చిన్న వ్యాపారులు, తయారీదారులపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. అదనంగా భారత యాత్రికులు వీసా లేకుండా పాకిస్తాన్‌లోని సిక్కుల అత్యంత గౌరవనీయమైన పుణ్యక్షేత్రాలలో ఒకదాన్ని సందర్శించడానికి వీలు కల్పించే కర్తార్‌పూర్ సాహిబ్ కారిడార్‌కు తాత్కాలికంగా నిలిపివేయాలని భారత్ తీసుకున్న నిర్ణయం ఆ ప్రాంతంలో పర్యాటకాన్ని ప్రభావితం చేస్తుంది.షిప్పింగ్, పార్సిల్ సేవలపై నిషేధం.. భారత్, పాకిస్తాన్ మధ్య షిప్పింగ్, పార్సిల్ సేవలను భారత ప్రభుత్వం నిషేధించడం వలన ఇప్పటికే వెంటిలేటర్‌పై ఉన్న పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థపై మరింత దెబ్బతినే అవకాశం ఉంది. షిప్పింగ్ కంపెనీలు తమ కార్యకలాపాలను తిరిగి మార్చవలసి రావచ్చు. దీని వలన డెలివరీలలో జాప్యం జరుగుతుంది. ప్రపంచ వాణిజ్య నెట్‌వర్క్‌లతో పాకిస్తాన్ కనెక్టివిటీకి అంతరాయం కలుగుతుంది. అదనంగా పాకిస్తాన్ నౌకలను భారత ఓడరేవులను ఉపయోగించడంపై నిషేధం ఇప్పటికే ఇబ్బందులు పడుతున్న దేశ లాజిస్టిక్స్, షిప్పింగ్ పరిశ్రమను మరింత దెబ్బతీస్తుంది. తగ్గిన వాణిజ్యం, పెరిగిన ఖర్చుల కారణంగా పాకిస్తాన్‌లో మొత్తం ఆర్థిక పరిస్థితి మరింత బలహీనపడవచ్చు.బాగా ఆలోచించిన వ్యూహం ద్వారా, భారతదేశం కీలకమైన ఉగ్రవాద మౌలిక సదుపాయాలను కూల్చివేయడంలో, కీలకమైన సైనిక ముప్పులను తటస్థీకరించడంలో, చాలా కాలంగా క్షీణించిన నిరోధాన్ని పునరుద్ధరించడంలో విజయం సాధించింది. పూర్తి స్థాయి యుద్ధం, పౌర ప్రాణనష్టాలను నివారించేటప్పుడు ఇదంతా సాధించబడింది. టామ్ కూపర్, జాన్ స్పెన్సర్, జెన్నిఫర్ జెంగ్ నొక్కిచెప్పినట్లుగా, ఈ ఆపరేషన్ భారతదేశం అభివృద్ధి చెందుతున్న రక్షణ సిద్ధాంతాన్ని ప్రతిబింబిస్తుంది.

ఇది దృఢమైనది, బాధ్యతాయుతమైనది.. అత్యంత శక్తివంతమైనది.పాకిస్తాన్ తన ఆస్తులను కాపాడుకోవడంలో సమర్థవంతమైన ప్రతిదాడిని ప్రారంభించడంలో విఫలమవడం, ఆ తర్వాత కాల్పుల విరమణ కోసం వెంటనే విజ్ఞప్తి చేయడం, ప్రాంతీయ డైనమిక్స్‌లో గణనీయమైన మార్పును సూచిస్తుంది. భారతదేశం కేవలం సైనికపరంగా గెలవలేదు, నియమాలను తిరిగి రాసింది. ఆపరేషన్ సిందూర్ తో, వ్యూహాత్మక సంయమనం అంటే నిష్క్రియాత్మకత కాదని.. రెచ్చగొట్టబడినప్పుడు, అది అంతే స్థాయిలో భారీ ప్రతిస్పందనను అందించగలదని.. అందిస్తుందని భారతదేశం పొరుగు దేశానికి చూపించింది.

# నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణంలో భాగస్వాములు కావాలి



నీటి పారుదల శాఖలో కొత్త ఉద్యోగులకు సీఎం రేవంత్ సూచన హైదరాబాద్ తెలంగాణలో తరతరాలుగా వాయిదాలు పడుతున్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలన్న చిత్తశుద్ధితో పని చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నీటి పారుదల శాఖలో కొత్తగా నియామక పత్రాలు అందుకున్న ఉద్యోగులను ఉద్దేశించి చెప్పారు. తెలంగాణ రైతులు ఆత్మగౌరవంతో బతకడానికి అవసరమైన నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణంలో భాగస్వాములై ప్రజల భావోద్వేగానికి ప్రతీకలుగా నిలబడాలని సూచించారు.

కొలువుల పండుగలో భాగంగా నీటి పారుదల శాఖలో కొత్తగా ఎంపికైన 244 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, (ఏఈఈ), 199 జూనియర్ టెక్నికల్ ఆఫీసర్స్ (మా) లకు జలసౌధ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు ప్రసంగిస్తూ, తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములవుతున్న ఉద్యోగులకు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.

"గత నలభై యాభై ఏళ్లుగా రావలసిన నీళ్లు రాకపోగా, పూర్తి కావలసిన ప్రాజెక్టులు పూర్తి కాని కారణంగా తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్ది, వాయిదా పడుతున్న ప్రాజెక్టులను పూర్తి చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం. నీళ్లు ఎంత అవసరమో అందుకు ఎంతగా పరితపించామో, ఏ నీటి కోసమైతే పోరాటం మొదలైందో ఆ నీళ్లే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి పెట్టాయి. అందుకే నీటి పారుదల శాఖకు ప్రభుత్వం అంత ప్రాధాన్యత ఇస్తోంది.



ఉమ్మడి రాష్ట్రంలో నాలుగైదు దశాబ్దాలు వాయిదా పడిన ప్రాజెక్టులు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో పదేళ్లలో కూడా పూర్తి కాలేదు. జలయజ్ఞంలో భాగంగా ప్రారంభమైన ప్రాజెక్టులు తెలంగాణ వచ్చిన తర్వాత పదేళ్లలో ఏవీ పూర్తి కాలేదు. ఈనాటికీ వాయిదాలు పడుతూనే ఉన్నాయి.

తెలంగాణ ప్రజలకు అతిపెద్ద సెంటిమెంట్ నీళ్లు. ప్రాజెక్టులను మొదటి ప్రాధాన్యత కింద పూర్తి చేస్తాం. ఇంజనీర్లుగా మీరు చేపట్టే ప్రాజెక్టులు భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత ఉంది. ఇది నెలనెలా జీతం తీసుకునే ఉద్యోగంగా కాకుండా ఒక బాధ్యతగా, ప్రజల భావోద్వేగంగా తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములై రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలి. పదేళ్లుగా ఉద్యోగ నియామకాలు చేపట్టలేదు. గత సెప్టెంబర్ లో ఇదే వేదిక నుంచి 738 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లను, జూనియర్ అసిస్టెంట్లకు నియామక పత్రాలు అందించి భుజం తట్టాం. మళ్లీ ఈరోజు 443 ఉద్యోగాలను నియమించాం. 14 నెల కాలంలో ఈ ఒక్క శాఖలోనే 1121 మందిని నియమించామంటే ఈ శాఖకు ఇస్తున్న ప్రాధాన్యతను అర్థం చేసుకోవాలి. ఉమ్మడి రాష్ట్రంలో పదేళ్లు, ప్రత్యేక తెలంగాణలో పదేళ్లు నోటిఫికేషన్ల కోసం కొట్లాడాం. ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యత ఉద్యోగ నియామకాలు. 14 నెలల్లో 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశాం. ప్రైవేటు రంగంలో లక్ష ఉద్యోగాలు కల్పించాం. 3 లక్షల కోట్ల రూపాయల మేరకు పెట్టుబడులను తీసుకొచ్చాం. యువతకు విద్య, ఉద్యోగాల కల్పన ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత. అర్హతలను అధిగమించి తొందరలోనే గ్రూప్ ఎ, ఎఎ, ఎఎఎ, ఎఎ నియామకాలు పూర్తి చేస్తాం..." అని ముఖ్యమంత్రి గారు ఉద్యోగులను ఉద్దేశించి వివరించారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, , పొన్నం ప్రభాకర్, ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ జి. చిన్నారెడ్డి, , ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తో పాటు నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# గాలి జాతకం అలా అయిపోయిందే..?



హైదరాబాద్, మే 15, కోట్లు ఉన్నప్పటికీ ప్రయోజనం ఏముంది? జీవితంలో ఎక్కువ భాగం జైలుకే పరిమితమయితే ఇక సంపాదించింది అనుభవించడం కూడా లేని అది దరిద్రమైన జాతకం గాలి జనార్ధన్ రెడ్డిది. అక్రమంగానో.. ఎలాగోనో గాలి జనార్ధన్ రెడ్డి కోట్లాది రూపాయలు కూడబెట్టారు. ఆంధ్రప్రదేశ్ కు చెందిన గాలి కుటుంబం కర్ణాటకకు వెళ్లి సెటిలయింది. కర్ణాటకలో అనేక వ్యాపారాలు చేసి కోట్లాది రూపాయలను కూడబెట్టింది. గాలి జనార్ధన్ రెడ్డికి ఎన్ని కోట్ల రూపాయలు ఉన్నాయో ఆయన కుమార్తెకు చేసిన వివాహంలో చేసిన హంగూ ఆర్భాటాలు చూస్తేనే అర్థమవుతుంది. బంగారు పళ్లేలు, నగలు, నట్రా.. ఇలా ఒకటేమిటి.. బంగారంతో పొదిగిన అన్నీ విలువైన వస్తువులు.కాలుకదిపితే ఏ కారు వస్తుందో ఆయనకు కూడా తెలియదు. ఇక ఇంట్లో ఉన్నా బయట ఉన్నా ఏసీల్లోనే గాలి సేదతీరుతారు. అలాంటి గాలి జనార్ధన్ రెడ్డి ఇప్పుడు చంచల్ గూడ జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. ఓబులాపురం అక్రమ మైనింగ్ కేసులో సీబీఐ ప్రత్యేక కోర్టు గాలి జనార్ధన్ రెడ్డితో పాటు మరో నలుగురికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్షను విధించింది. వీరిపై ఒక్కొక్కరికి లక్ష రూపాయల జరిమానాను కూడా విధించింది. గతంలోనూ కొన్నేళ్ల పాటు గాలి జనార్ధన్ రెడ్డి శిక్ష అనుభవిస్తూ జైలు జీవితం గడిపారు. అయితే ఆ శిక్షను మినహాయించాలని కోరినా న్యాయస్థానం ఒప్పుకోలేదు. దీంతో గాలి జనార్ధన్ రెడ్డి చంచల్ గూడ జైలులో నిందితుడిగా ఉంటూ ఉన్నారుఇంట్లోనే మనం ఉండలేకపోతున్నాం. ఇక బిజినెస్ మాగ్నెట్ అయిన గాలి జనార్ధన్ రెడ్డి జైల్లో ఉక్కపోతకు మగ్గిపోతున్నారట. తనకు జైల్లో అదనపు సౌకర్యాలు కల్పించాలంటూ గాలి జనార్ధన్ రెడ్డి పిటీషన్ వేశారు. అయితే గాలి పిటీషన్ ప్రస్తుతం రిజిస్ట్రీ పరిశీలనలో ఉంది. ఈ కేసులో విచారించి ఏ నిర్ణయం తీసుకుంటుందో తెలియదు కానీ గాలి జనార్ధన్ రెడ్డి జైలు జీవితం గడపలేకపోతున్నారని అర్థమవుతుంది. తనకు ఇంటి నుంచి భోజనంతో పాటు నిర్ధించదగిన బెడ్, ఫ్యాన్ తో పాటు మరికొన్ని సౌకర్యాలు కోరుతున్నారు. పాపం చేసిన గాలికి ఈ శిక్ష సరిపోతుందన్న కామెంట్స్ వినపడుతున్నాయి. అక్రమాలకు అనుభవించాల్సిందేనంటూ కామెంట్స్ వినపడుతున్నాయి. రాజకీయాల్లో పోటీ చేసే అవకాశం కూడా లేనట్లే.అందుకు జనార్ధన్ రెడ్డి స్పందిస్తూ.. తన వయసును, తాను చేసిన సామాజిక సేవలను గుర్తించి, శిక్షను తగ్గించాలని కోరారు. ఆయన విన్నపై జడ్జి స్పందిస్తూ..'ఈ కేసులో ఏడేళ్ల శిక్ష ఎందుకు వేయకూడదు' అని ప్రశ్నించారు. తాను ఇప్పటికే నాలుగేండ్లకు పైగా సామాజిక సేవ చేస్తున్నానని.. బళ్లారితో పాటు గంగావతిలో కూడా ప్రజలు తనను అఖండ మెజారిటీతో గెలిపించారని ఈ సందర్భంగా గాలి జనార్ధన్ రెడ్డి కోర్టుకు తెలిపారు. తన సేవలను గుర్తించినందుకే ప్రజలు గెలిపించారని చెప్పారు. ఆయన వాదనలు విన్న న్యాయస్థానం.. వివరణ ఆయనకు ఏడేళ్ల శిక్షను ఖరారు చేస్తూ తీర్పు వెల్లడించింది.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో.. ఓబులాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ) అక్రమ తవ్వకాల కేసు సంచలనం సృష్టించింది. ఏపీ అనంతపురం జిల్లాలోని ఓబులాపురం మైనింగ్ కంపెనీలో అక్రమ తవ్వకాలు జరిగాయనే ఆరోపణలు వచ్చాయి. దీని వల్ల ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం వాటిల్లిందన్నారు. ఈ వ్యవహారం అప్పట్లో రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. సీబీఐ ఈ కేసును విచారించి.. పలువురిపై ఛార్జ్ షీట్ దాఖలు చేసింది.విచారణలో భాగంగా గాలి జనార్ధన్ రెడ్డి, బీవీ శ్రీనివాస్ రెడ్డి, వీడీ రాజగోపాల్, మెఫజ్ అలీ ఖాన్, ఓఎంసీ కంపెనీని దోషులుగా నిర్ధారించింది. వీరికి ఏడేళ్ల పాటు జైలు శిక్ష విధించింది. అలానే ఈ కేసుకలో ఆరోపణలు ఎదుర్కొన్న సబితా ఇంద్రారెడ్డి, కృపానందంలను నిర్దోషులుగా ప్రకటించింది. గతంలో ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మిని హైకోర్టు నిర్దోషిగా తేల్చిన సంగతి తెలిసిందే.

# ట్రంప్ టవర్స్ కు ఎసరు...

హైదరాబాద్, మే 15, హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో గ్లోబల్ బ్రాండ్‌గా పేరొందిన ట్రంప్ రియాల్టీ సంస్థ కోకాపేటలో అత్యంత విలాసవంతమైన టవర్స్ నిర్మాణానికి సన్నాహాలు చేస్తోంది. అయితే, ఈ ప్రాజెక్ట్ ప్రారంభం కాకముందే స్థల యాజమాన్య వివాదంలో చిక్కుకుంది. ఈ వివాదం ట్రంప్ టవర్స్ నిర్మాణ ప్రణాళికలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు చెందిన ట్రంప్ ఆర్గనైజేషన్ భారతదేశంలో ఇప్పటికే ముంబై, కోల్‌కతా, గురుగ్రామ్, పుణెలలో విలాసవంతమైన రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులను విజయవంతంగా నిర్మించింది. ఇప్పుడు హైదరాబాద్‌లోని కోకాపేట గోల్డెన్ మైల్ ప్రాంతంలో రూ3,500 కోట్ల విలువైన ట్రంప్ టవర్స్ నిర్మాణానికి సిద్ధమవుతోంది. ఈ ప్రాజెక్ట్‌లో మూడు టవర్లు, 66 అంతస్తులు, 243 మీటర్ల ఎత్తుతో నిర్మాణం జరగనుంది. ఈ ప్రాజెక్టుకు భారతీయ భాగస్వామిగా ఐరా రియాల్టీని ఎంచుకున్నారు. కోకాపేటలోని గోల్డెన్ మైల్ ప్రాంతంలో ఐరా రియాల్టీకి చెందిన స్థలంలో ఈ టవర్ల నిర్మాణం జరగనుంది. అనుమతుల ప్రక్రియ దాదాపు పూర్తయినట్లు ప్రచారం జరిగింది, మరియు ఈ ఏడాది చివరలో నిర్మాణ పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.ఈ భారీ ప్రాజెక్ట్ మొదలు కాకముందే స్థల యాజమాన్య వివాదం తలెత్తింది. నాంపెల్ రామ్‌రెడ్డి అనే వ్యక్తి తాను కూడా ఈ స్థలంలో సహ యజమాని అని, తనకు తెలియకుండానే ట్రంప్ టవర్స్ నిర్మాణ ప్రకటనలు జరిగాయని ఆరోపిస్తూ బహిరంగ లీగల్ నోటీసు జారీ చేశారు. రామ్‌రెడ్డి తరపు న్యాయవాది జారీ చేసిన పత్రికా ప్రకటన ప్రకారం, గోల్డెన్ మైల్ ప్రాంతంలోని 12,602 గజాల స్థలంలో రామ్‌రెడ్డికి 425 గజాల వాటా ఉంది. ఈ స్థలాన్ని ఐరా రియాల్టీతోపాటు పది మందికి పైగా వ్యక్తులు కలిసి కొనుగోలు చేశారని, అందులో రామ్‌రెడ్డి ఒకరని వారు పేర్కొన్నారు.రామ్‌రెడ్డి తనకు సమాచారం ఇవ్వకుండా ఈ స్థలంపై ట్రంప్ టవర్స్ నిర్మాణానికి సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడం తన హక్కులను కాలరాసినట్లు భావిస్తున్నారు.

ఈ విషయంలో తాను ఊరుకునేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకుంటానని ఆయన హెచ్చరించారు.ఈ స్థల యాజమాన్య వివాదం ట్రంప్ టవర్స్ ప్రాజెక్ట్‌పై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. రియల్ ఎస్టేట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఇటువంటి చట్టపరమైన సమస్యలు పరిష్కారం కాకపోతే, ప్రాజెక్ట్ ఆలస్యం కావచ్చు లేదా పూర్తిగా రద్దయ్యే ప్రమాదం ఉంది. గతంలో కూడా హైదరాబాద్‌లోని కొన్ని రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు స్థల వివాదాల కారణంగా ఆగిపోయిన సందర్భాలు ఉన్నాయి.

ఐరా రియాల్టీ, ట్రంప్ ఆర్గనైజేషన్ ఈ వివాదాన్ని ఎలా పరిష్కరిస్తాయనేది ఇప్పుడు కీలకం. ఒకవేళ రామ్‌రెడ్డితో చర్చలు జరిపి, ఆయన వాటాను కొనుగోలు చేయడం లేదా ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా సమస్యను పరిష్కరించగలిగితే, ప్రాజెక్ట్ పురోగతిలోకి వెళ్లే అవకాశం ఉంది.

అలా కాకపోతే, ఈ వివాదం చట్టపరమైన పోరాటంగా మారి, ప్రాజెక్ట్‌ను వెనక్కి నెట్టవచ్చు.హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ గత కొన్నేళ్లుగా వేగంగా వృద్ధి చెందుతోంది. కోకాపేట, గచ్చిబౌలి, మాదాపూర్ వంటి ప్రాంతాలు విలాసవంతమైన నివాస ప్రాజెక్టులకు కేంద్రంగా మారాయి. ట్రంప్ టవర్స్ వంటి గ్లోబల్ బ్రాండ్ ప్రాజెక్ట్ హైదరాబాద్‌కు అంతర్జాతీయ గుర్తింపును తెచ్చిపెట్టే అవకాశం ఉంది. అయితే, స్థల వివాదాలు వంటి సమస్యలు ఈ అవకాశాలను అడ్డుకోవచ్చు.

రియల్ ఎస్టేట్ నిపుణులు ఈ వివాదం ఇతర డెవలపర్లకు కూడా ఒక హెచ్చరికగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. స్థల కొనుగోళ్లలో సహ యజమానులతో స్పష్టమైన ఒప్పందాలు, అనుమతులు, మరియు చట్టపరమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవడం ఎంత ముఖ్యమో ఈ ఘటన తెలియజేస్తోంది.

## ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థలో జిల్లాకు ర్యాంకుల పంట

పెద్దపల్లి గత ఏప్రిల్ నెలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన సెక్షన్, సబ్ డివిజన్, డివిజన్ కార్యాలయాల లకు, ఉద్యోగులకు, జిల్లాలకు ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ రెడ్డి పూర్వపు జిల్లాల వారిగా ర్యాంకులను ప్రకటించారు. ఇందులో భాగంగా పెద్దపల్లి జిల్లాకు అత్యధిక ర్యాంకులు పొందిన పలువురికి ఎస్ ఈ మాధవరావు అభినందనలు తెలిపారు. ఈ విజయం అందరి సమష్టి కృషితోనే సాధ్య మైనదని కంపెనీలో పెద్దపల్లి జిల్లా 2వ ర్యాంక్ సాధించిందని తెలిపారు. రూరల్ సెక్షన్ విభాగంలో 1, 2, 3, 4, 5 వ ర్యాంక్స్ ను పెద్దపల్లి జిల్లా సెక్షన్ లు కైవసం చేసుకున్నాయని, వాటిలో కాట్నపల్లి 1 వ, బసంత్ నగర్ 2వ, అంతర్గం 3వ, ఖిలావనపర్తి 4వ ఎలిగేడు 5వ ర్యాంక్స్ ను సాధించినట్లు తెలిపారు. అర్బన్ సెక్షన్స్ లో పెద్దపల్లి టౌన్ 5వ ర్యాంక్ సాధించిందని, సబ్ డివిజన్ రూరల్ విభాగంలో సుల్తానాబాద్ ఏడిఈ శ్రీనివాస్ కి 1వ ర్యాంక్, ధర్మారం ఏడిఈ విజయ్ గోపాల్ సింగ్ కు 5వ ర్యాంక్ దక్కగా, డివిజన్ లలో పెద్దపల్లి డిఈ అదనపు ఇన్చార్జి రవి 1 వ ర్యాంక్ సాధించారని తెలిపారు. ఏఈ, ఏడిఈ, సబ్ ఇంజనీర్స్, అకౌంట్స్ స్టాఫ్ అందరి కృషితోనే పెద్దపల్లి డివిజన్ డిఈ టెక్నికల్ బి. రవి కి 1 వ ర్యాంక్ వచ్చిందన్నారు. 16 జిల్లాలలో పెద్దపల్లి జిల్లా 2వ ర్యాంక్ రావడానికి కృషి చేసిన ప్రతీ ఉద్యోగికి సర్కిల్ తరుపున సూపరింటెండింగ్ ఇంజనీర్ మాధవరావు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పూర్వపు కరీంనగర్ జిల్లాలో రూరల్ సబ్ డివిజన్ లలో శ్రీరాంపూర్ ఏడిఈ మధుకర్ కు ర్యాంక్ దక్కింది. పూర్వపు కరీంనగర్ జిల్లాలో సబ్ డివిజన్ అర్బన్ లో రామగుండం ఏడిఈ రమేష్ కి ర్యాంక్ దక్కింది. ముమ్ముందు అందరూ కష్టపడి పెద్దపల్లి జిల్లాకు ఇంకా మంచి ర్యాంక్ లు తీసుకురావాలని, మన సంస్థను అన్ని రంగాలలో ముందుకు తీసుకెళ్లామని పెద్దపల్లి సూపరింటెండింగ్ ఇంజనీర్ మాధవరావు విద్యుత్ సంస్థ లో పనిచేస్తున్న ఉద్యోగులందరిని కోరారు. జిల్లాలో ర్యాంకులు సాధించిన అందరికీ పేరు పేరున శు భాకాంక్షలు తెలిపారు.

## గురుకుల పాఠశాలలో నాణ్యమైన ఉచిత విద్య

సిద్దిపేట జిల్లాలోని గురుకుల పాఠశాలలో నాణ్యమైన ఉచిత విద్య అందుతుందని జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు.గురువారం సమీకృత కార్యాలయ సముదాయం లోని కలెక్టర్ ఛాంబర్ లో 6 మైనారిటీ గురుకులాల్లో 5వ తరగతిలో ప్రవేశం కొరకు కరపత్రాలను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..ఇటీవలే క్వాస్మోటిక్ ఛార్జీలు పెంచినారని 2025-2026 సంవత్సరానికి గాను 5వ తరగతిలో మైనార్టీ గురుకులాలలో రిజిస్ట్రేషన్ చేసుకొని అడ్మిషన్ పొంద వలసిందిగా ఈ అవకాశాన్ని మైనారిటీ విద్యార్థులు తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్ఎల్ సి సుధా రాణి, మరియు సిద్దిపేట జిల్లాలోని మైనారిటీ పాఠశాలల ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.

# గులాబీలో కుర్చీలాట

హైదరాబాద్, మే 15,భారత రాష్ట్ర సమితి బీఆర్ఎస్ చీలిక ముంగిట నిలిచిందా? ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు.. తన వారసుడి ప్రకటనకు ముహూర్తం పెట్టేసి రాజకీయ విరమణ లేదా రాజకీయ సన్యాసానికి రంగం సిద్ధం చేసేసుకున్నారా? అంటే బీఆర్ఎస్ లో గత కొన్ని రోజులుగా వరుసగా చోటు చేసుకుంటున్న పరిణామాలను గమనిస్తే ఔనన్న సమాధానమే వస్తున్నది. గత కొంత కాలంగా ఒక పద్ధతి ప్రకారం పార్టీలో హరీష్ రావు ప్రాధాన్యత తగ్గుతూ లేదా తగ్గిస్తూ వస్తున్న తీరు, అలాగే ఇటీవలి కాలంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, పార్టీ అధినేత కుమార్తె కల్వకుంట్ల కవిత పార్టీ లైన్ కు భిన్నంగా చేస్తున్న వ్యాఖ్యలు గమనిస్తే.. పార్టీ పగ్గాల విషయంలో బీఆర్ఎస్ లో మూడు కుర్చీలాట జోరుగా సాగుతున్నదని పరిశీలకులు అంటున్నారు.2023 ఎన్నికలలో బిఆర్ఎస్ పరాజయం తరువాత నుంచీ ఆ పార్టీ అధినేత కేసీఆర్ పొలిటికల్ గా ఏమంత యాక్టివ్ గా లేరు. ఇంత కాలం ఆయన రాజకీయాల నుంచి తాత్కాలిక విరామం మాత్రమే తీసుకున్నారని అంతా భావిస్తూ వచ్చారు. అయితే  ఇప్పుడిప్పుడే పార్టీ వర్గాలలో కూడా ఆయన తీసుకున్నది తాత్కాలిక విరామం కాదనీ,రాజకీయ విరమణేనన్న అభిప్రాయం వ్యక్తం అవుతున్నది. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కు పూర్తిగా పగ్గాలు అప్పగించేయడమే తరువాయి అన్న వార్తలు కూడా గట్టిగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే అందుకు అనుగుణంగా కేసీఆర్ నెమ్మదిగా పావులు కదుపుతున్నారని అంటున్నారు. అందులో భాగంగానే ఇటీవల వరంగల్ వేదికగా జరిగిన పార్టీ పాతికేళ్ల సభలో హరీష్ రావు ప్రస్తావన, ప్రాముఖ్యత ఇసుమంతైనా లేకుండా అంతా కేటీఆరే అన్నట్లుగా నిర్వహించారంటున్నారు. అదే సమయంలో విషయాన్ని గుర్తించిన హరీష్ రావు తన దారి తాను చూసుకునేందుకు నిర్ణయించుకున్నారన్న వార్తలూ జోరుగా వినిపించాయి. అదే సమయంలో కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కవిత కూడా తన సంగతేంటంటూ గొంతెత్తుతున్న పరిస్థితి కనిపిస్తోంది. తాజాగా ఆమె రామానుజపురంలో నాంచారమ్మ జాతరలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోది చెప్పే నాంచారమ్మలు కవిత భవిష్యత్ లో తెలంగాణకు ముఖ్యమంత్రి అవుతారని  జోస్యం చెప్పారు. వారి మాటలను చిరునగవుతో విన్న కవిత జై తెలంగాణ అంటూ నినదించారు. ఈ సంఘటన యథాలాపంగా జరిగింది కాదని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. కొద్ది రోజుల కిందట ఆమె సామాజిక తెలంగాణ సాధన ఇంకా మిగిలే ఉందంటూ చేసిన వ్యాఖ్యకు దీనిని జోడించి సొంత సోదరుడు కేటీఆర్ కు పార్టీ పగ్గాలు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తున్నారంటున్నారు. అది పక్కన పెడితే.. సందర్భంతో సంబంధం లేకుండా తాను కేసీఆర్ ఎవరికి పగ్గాలు అప్పగించినా స్వాగతిస్తానంటూ హరీష్ రావు చేసిన వ్యాఖ్యలను కూడా ఆయనలోని అసంతృప్తికి,అసహనానికీ తార్కానంగా చెబుతున్నారు. అదే సమయంలో హరీష్ పార్టీ తదుపరి అధ్యక్షుడి విషయం లేవనెత్తడాన్ని కేసీఆర్ పొలిటికల్ రిటైర్మెంట్ కు రెడీ అయిపోయారన్న సంకేతాన్ని ఇవ్వడమేనని చెబుతున్నారు.పార్టీ శాసనసభా పక్ష నేతగా కేటీఆర్ అంగీకరించని పార్టీ ఎమ్మెల్యేలు, నేతలు.. ఇప్పుడు ఏకంగా పార్టీ అధ్యక్ష పగ్గాలనే అప్పగిస్తానని కేసీఆర్ అంటే అంగీక రిస్తారా అన్న అనుమానాలూ సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి.పార్టీ అధినేతగా కేసీఆర్ ఉన్నంత వరకూ ఆయన అభిప్రాయాన్ని కాదని ఎవరూ అనరు కానీ, ఒక సారి ఆయన ఆ స్థానం నుంచి తప్పుకుంటే మాత్రం కేసీఆర్ మాట ఇక పార్టీలో ఎంత మాత్రం శిలాశాసనం అన్న పరిస్థితి ఉండదని అంటున్నారు. ఈ నేపథ్యంలోనే పరిశీలకులు బీఆర్ఎస్ చీలిక అంచున ఉందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

# కాంటాక్ట్ లెక్చరర్లు తొలగింపేనా

హైదరాబాద్, మే 15, తెలంగాణలోని విశ్వవిద్యాలయాలలో కాంట్రాక్ట్ లెక్చరర్ల కొనసాగింపుపై నిర్ణయం ఆయా విశ్వవిద్యాలయాలకే ప్రభుత్వం వదిలేసింది. ఈ మేరకు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఈసీ) సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని విద్యాశాఖ పేర్కొంది. అయితే.. ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించాలని లేదా కనీసం టైమ్ స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తుది నిర్ణయాన్నివిశ్వవిద్యాలయాలకు అప్పగించడం చర్చనీయాంశంగా మారింది. కాంట్రాక్టు లెక్చరర్లను కొనసాగిస్తారా లేదా తొలగిస్తారా అనే అంశం ఇప్పుడు విశ్వవిద్యాలయాల పరిధిలోకి వెళ్లిపోయింది. ఈ విషయంలో ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఈసీ) సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని విద్యాశాఖ సూచించినట్లు సమాచారం. ఈసీ తీసుకునే నిర్ణయానికి అనుగుణంగా ప్రభుత్వం ఆమోదం తెలుపుతుందని సంకేతాలు పంపినట్లు తెలుస్తోంది.అయితే.. ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరించాలని, లేదా కనీసం టైమ్ స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేస్తుండటంతో.. ప్రభుత్వం ఈ అంశాన్ని విశ్వవిద్యాలయాలకు వదిలివేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.కాంట్రాక్టు లెక్చరర్లను కొనసాగించడం లేదా వారిని తొలగించి రెగ్యులర్ సిబ్బందిని నియమించడం అనేది పూర్తిగా ప్రభుత్వ విధాన నిర్ణయానికి సంబంధించిన విషయం. అయితే విద్యాశాఖ ఈ విషయంలో విశ్వవిద్యాలయాల నిర్ణయానికి వదిలివేయడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ప్రస్తుతం ఉన్న కాంట్రాక్టు లెక్చరర్లు చాలా సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. ఇప్పుడు హఠాత్తుగా వారిని తొలగిస్తే ప్రభుత్వంపై రాజకీయ విమర్శలు వచ్చే ప్రమాదం ఉంది.అందుకే ఈ విషయంపై విధానపరమైన నిర్ణయం ప్రభుత్వం తీసుకోవాల్సి ఉంటుంది. కానీ విద్యాశాఖ మాత్రం కాంట్రాక్టు లెక్చరర్ల అంశంపై ఈసీలో చర్చించి ప్రతిపాదనలు పంపాలని విశ్వవిద్యాలయాలకు సూచించింది. దీనివల్ల ప్రభుత్వానికి ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఎందుకంటే విశ్వవిద్యాలయాలు కాంట్రాక్టు లెక్చరర్లను కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నా.. సమస్య పరిష్కారం కాదని, ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని కాంట్రాక్టు లెక్చరర్లు చెబుతున్నారువిద్యాశాఖలో అవగాహన లేని కొందరు అధికారుల కారణంగా అనవసర సమస్యలు వస్తున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న టీచింగ్ పోస్టులను భర్తీ చేయడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసే ముందు.. క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లడంలో అధికారులు విఫలమయ్యారని ఆరోపణలు వినిపిస్తున్నాయివిశ్వవిద్యాలయాల్లో దాదాపు 1500 మంది కాంట్రాక్టు.. అవుట్ సోర్సింగ్ టీచింగ్ సిబ్బంది పనిచేస్తున్నారు. అయితే అధికారులు ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లకుండా.. ఖాళీలన్నింటినీ భర్తీ చేయవచ్చని వివరించినట్లు తెలుస్తోంది. దీనితో ఆయన వెంటనే ఖాళీల భర్తీకి ఆమోదం తెలిపారు. ఆ తరువాతే కాంట్రాక్టు లెక్చరర్లు తమను క్రమబద్ధీకరించాలని.. లేకపోతే టైమ్ స్కేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలకు దిగారు.

# శాతవాహనలో లా కోర్సు...

కరీంనగర్, మే 15 కరీంనగర్‌లోని శాతవాహన విశ్వ విద్యాలయం పరిధిలో లా కాలేజీ (న్యాయ కళాశాల) ను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయగా అనుమతి కోసం కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చేసిన క్రుషి ఫలించింది.  లా కళాశాల అనుమతికి బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆమోదం తెలిపింది. ఈ విద్యా సంవత్సరం నుండే అడ్మిషన్లు ప్రారంభం కానున్నాయి.మంది విద్యార్థులతో(రెండు సెక్షన్లు) ఎల్ఎల్ బి కోర్సు ప్రారంభం కానుంది. శాతవాహన వర్శిటీలో లా కళాశాల మంజూరు చేయాలని కోరుతూ వర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్  ఉమేశ్ కుమార్ గతంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ను కోరారు. ఈ నేపథ్యంలో గత నెల మొదటి వారంలో ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్, మాజీ మేయర్ సునీల్ రావును వెంటబెట్టుకుని బండి సంజయ్ న్యూఢిల్లీలోని  కేంద్ర న్యాయశాఖ మంత్రిత్వ కార్యాలయానికి వెళ్లారు.సంబంధిత శాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్ ను కలిసి లా కాలేజీని మంజూరు చేయడంతోపాటు ఈ ఏడాది నుండే అడ్మిషన్లు ప్రారంభమయ్యేలా చూడాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. మొత్తం 120 మందితో (రెండు సెక్షన్లతో కలిపి) లా కాలేజీని నడిపేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు.బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఈ విషయంపై వర్చువల్ గా శాతవాహన వర్శిటీని వర్చువల్ గా తనఖీ చేయడంతోపాటు వివరణలతో కూడిన నివేదిక కోరిన విషయాన్ని కూడా ఈ సందర్భంగా బండి సంజయ్ గుర్తు చేశారు. బార్ కౌన్సిల్ ఆదేశాల మేరకు వివరణాత్మక నివేదికను పంపినట్లు తెలిపారు.  కాలేజీ అనుమతికి ఆమోదం తెలపడంతోపాటు వచ్చే విద్యా సంవత్సరం నుండే ఎల్ ఎల్ బీ కోర్సును ప్రారంభానికి అనుమతి ఇవ్వడం గమనార్హం. మూడేళ్ల లా డిగ్రీకి అనుమతులు లభించింది. 2025-26 అకాడమిక్ ఇయర్ నుండి తరగతులు ప్రారంభంఅవుతాయి., కొత్త కోర్సుల మౌలిక ఏర్పాటులో విశ్వవి ద్యాలయం ముందుకు సాగు తుంది. తోడ్పా టు అందించిన రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి, జిల్లా మంత్రులు పొన్నం ప్రభాకర్ కి,  కేంద్ర మంత్రి బండి సంజయకుమార్‌కి  కేంద్ర  చట్ట,న్యాయశాఖ మంత్రి  అర్జున్ రామ్ మేఘ్వాల్ కి  కృతజ్ఞతలు తెలిపారు

# మహారాజ్ గంజ్ లో అగ్ని ప్రమాదం



హైదరాబాద్ అఫ్జల్గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మహారాజ్ గంజ్ లో గోల్ మసీదు సమీపంలో ఓ భవనంలో అగ్నిప్రమాదం సంభవించింది. మూడో అంతస్తులో మొదలైన మంటలు ఒక్కసారిగా ఎగసిపడ్డాయి. మూడో అంతస్తులో చిక్కుకున్న వారిని అగ్నిమాపక సిబ్బంది సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. ఆరు ఫైర్ ఇంజన్లతో మంటలు అదుపులోకి తెచ్చారు అగ్నిమాపక సిబ్బంది. కింద ఉన్న షాపు లలోకి మంటలు వ్యాపించకుండా మంటలను ఆర్పారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

# రేషన్ కార్డుల ఏరివేత

హైదరాబాద్, మే 15, తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన వ్యాఖ్యల్లో నిజముంది. ఎందుకంటే రెండు రాష్ట్రాల్లో పథకాలను పొందుతూ, రెండు రాష్ట్రాల రేషన్ కార్డులు ఉన్న వారు అనేక మంది ఉన్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు వచ్చి స్థిరపడినా అక్కడ సొంత ఇల్లు.. ఇక్కడ ఉపాధి కోసం వచ్చిన వారు రెండు చోట్ల రేషన్ కార్డులు తీసుకుంటున్నారు. రెండు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు అందించే పథకాలు అందుకుంటున్నారు. నిజంగా ఇది దురదృష్టకరమే. ప్రజాధనం పక్కదోవపట్టడమే అవుతుందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది. దీనిపై రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు సీరియస్ గా తీసుకుని కేవలం ఒక రాష్ట్రంలోనే రేషన్ కార్డులు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలకు మాత్రమే ఉచిత పథకాలు అందాలన్నారు. అప్పుడే ప్రభుత్వ పథకాలకు సార్థకత చేకూరతుందన్నారు. ప్రభుత్వం ఇచ్చే బియ్యం అమ్ముకునే వారికి ఎందుకు ఇవ్వాలని ఆయన వేసిన ప్రశ్నలో కూడా అర్థం ఉంది. తెలంగాణలో కోటి పది లక్షల కుటుంబలు ఉంటే పొరుగు రాష్ట్రానికి చెందని వారికి కూడా ఇక్కడ రేషన్ కార్డులన్నాయన్నారు. దీనివల్ల అక్కడా, ఇక్కడా బియ్యం తీసుకోవడంతో అవి పక్కదారి పట్టే అవకాశముంది. అదే సమయంలో రెండు చోట్ల పథకాలను అందుకుంటుంటే ప్రభుత్వ ఖజానాపై కూడా భారం పడే అవకాశముంటుంది. ఒకరు ఒక రాష్ట్రంలోనే సంక్షేమ పథకాలను పేదలు అందుకోవాల్సి ఉంటుందికానీ అర్హతలులేని వారు కూడా అనేక మంది ఉచితాలు పొందుతున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది.ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో రెండుచోట్ల రెండు ఓట్లు ఉన్నాయి. వేర్వేరు సార్లు ఎన్నికలు జరుగుతుండటంతో అక్కడకు వెళ్లి ఓటేస్తారు. ఇక్కడా తమ ఓటు హక్కును వినియోగించుకుంటారు. ఎన్నికల కమిషన్ ఒకే రాష్ట్రంలో ఒకేచోట మాత్రమే ఓటు హక్కు ఉండాలన్ననిబంధన పెట్టింది. ఇప్పుడు అలాగే పథకాలను కూడా ఎక్కడో ఒకచోట మాత్రమే తీసుకునే అవకాశం కల్పిస్తే నిజమైన పేదలకు పథకాలు అందుతాయి. ప్రభుత్వాలకు కూడా కొంత వెసులుబాటు లభిస్తుందని భావిస్తున్నారు. దీనిపై తెలంగాణ ప్రభుత్వం సీరియస్ గా తీసుకుని విచారణ జరపాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఒకచోట మాత్రమే రేషన్ కార్డు ఉండేలా చర్యలు తీసుకుంటే చాలా వరకూ ఖజానా పై భారం తగ్గుతుందని ఉన్నతాధికారులు కూడా చెబుతున్నారు.

# 19 వేల కోట్లతో మెట్రో సెకండ్ ఫేజ్



హైదరాబాద్, మే 15, హైదరాబాద్ మెట్రో రైలు రెండవ దశలోని రెండవ భాగం (2బి) 86.5 కిలోమీటర్ల మేర మూడు మార్గాల్లో విస్తరించనుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ ను హెచ్ఏఎంఎల్ ఆమోదించింది. త్వరలో మంత్రివర్గ ఆమోదం పొందిన తర్వాత కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తారు. ఈ ప్రాజెక్టులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పాటు బ్యాంకుల రుణాలు, పీపీపీ విధానం ద్వారా కూడా నిధులు సేకరించనున్నారు. మెట్రో రైలు రెండవ దశలోని రెండవ భాగం (2బి) విస్తరణ ప్రణాళిక దాదాపు 19 వేల కోట్ల రూపాయల వ్యయంతో రూపొందించబడింది. ఈ ప్రతిపాదిత విస్తరణలో భాగంగా, మూడు ప్రత్యేక మార్గాల్లో మొత్తం 86.5 కిలోమీటర్ల మేర మెట్రో రైలు సేవలను విస్తరించనున్నారు. ఈ కొత్త మార్గాల్లో జేబీఎస్ నుండి మేడ్చల్ వరకు, జేబీఎస్ నుండి శామీర్‌పేట వరకు, అలాగే శంషాబాద్ విమానాశ్రయం నుండి ఫ్యూచర్ సిటీ వరకు మెట్రో రైలు మార్గాలను అభివృద్ధి చేయనున్నారు.ఈ ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్) బోర్డు ఆమోదించింది, దీనికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షత వహిస్తున్నారు. ఆమోదం పొందిన నివేదికను ఇప్పుడు ప్రభుత్వం పరిశీలిస్తోంది, మరియు త్వరలో జరగబోయే మంత్రివర్గ సమావేశంలో ఆమోదం పొందిన తర్వాత, ఈ నివేదికను కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం పంపనున్నారు.ఈ ప్రాజెక్టులో భాగంగా ప్రతిపాదించిన మూడు మార్గాల కోసం ప్రత్యేక డీపీఆర్ లను రూపొందించారు. మునుపటి ప్రణాళికల్లో జేబీఎస్-శామీర్‌పేట , జేబీఎస్-మేడ్చల్ మార్గాల్లో డబుల్ డెక్ నిర్మాణాన్నిచేపట్టాలని భావించారు, ఇక్కడ ఒకే స్తంభంపై రెండు అంతస్తుల్లో రవాణా సౌకర్యాలు ఉండేలా డిజైన్ చేయాలనుకున్నారు..ఒక అంతస్తులో రహదారి, మరొకటి మెట్రో రైలు కోసం. అయితే, స్టేషన్లు అధిక ఎత్తులో ఉండటం వలన ప్రయాణికులకు అసౌకర్యం కలుగుతుందని భావించి, హెచ్ఏఎంఎల్ ఈ ప్రతిపాదనను విరమించుకుంది.కొత్త ప్రతిపాదనల ప్రకారం, జేబీఎస్ నుండి కార్ఖానా, అల్వాల్, హకీంపేట, తూంకుంట మీదుగా శామీర్‌పేట వరకు 22 కిలోమీటర్ల మేర మెట్రో మార్గాన్ని నిర్మించనున్నారు. ఇక్కడ.. హకీంపేట ఎయిర్ ఫోర్స్ స్టేషన్ రన్‌వే రహదారికి సమీపంలో ఉండటంతో.. భద్రతా కారణాల దృష్ట్యా ఎలివేటెడ్ మార్గానికి రక్షణ సంస్థలు అభ్యంతరం తెలిపాయి. దీని కారణంగా.. ఈ మార్గంలో దాదాపు కిలోమీటరున్నర దూరం వరకు భూగర్భ మార్గంలో మెట్రో రైలును నిర్మించాలని నిర్ణయించారు. రన్‌వే కింద నుండి మెట్రో రైలు వెళ్లేలా తుది డిజైన్‌ను రూపొందించారు.జేబీఎస్ నుండి తాడ్ బండ్, బోయిన్ పల్లి, సుచిత్ర, కొంపల్లి మీదుగా మేడ్చల్ వరకు 24.5 కిలోమీటర్ల మేర మెట్రో మార్గాన్ని ప్రతిపాదించారు. ఎయిర్ పోర్ట్ అథారిటీ కొన్ని ఆంక్షలు విధించడంతో, ఈ మార్గంతో పాటు శామీర్‌పేట మార్గం కూడా జేబీఎస్ నుండి ప్రస్తుతం ఉన్న మెట్రో మార్గం కంటే తక్కువ ఎత్తులో వెళ్లేలా ప్రణాళిక చేశారు. జేబీఎస్ ను మూడు మార్గాలకు అనుసంధానం చేస్తూ ఒక ప్రధాన రవాణా కేంద్రంగా అభివృద్ధి చేయాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఈ మార్గాలను రూపొందించారు.శంషాబాద్ విమానాశ్రయం నుండి ఫ్యూచర్ సిటీ వరకు 40 కిలోమీటర్ల మేర మెట్రో మార్గాన్ని ప్రతిపాదించారు. ఇక్కడ విమానాశ్రయంలోని టెర్మినల్ స్టేషన్ భూగర్భంలో ఉంటుంది. ఈ మార్గంలో, రావిర్యాల ఔటర్ రింగ్ రోడ్డు వరకు ఎలివేటెడ్ మార్గంలో మెట్రో రైలు వెళ్తుంది. అక్కడి నుండి, ప్రభుత్వం ప్రతిపాదించిన కొత్త గ్రీన్ ఫీల్డ్ రహదారి మధ్యలో 18 కిలోమీటర్ల మేర భూగర్భ మార్గంలో వెళ్లేలా డీపీఆర్ ను రూపొందించారు.ఈ ప్రతిష్టాత్మక రెండవ దశలోని రెండవ భాగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి చేపట్టేలా డీపీఆర్ ను రూపొందించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన నిధుల్లో రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం, కేంద్ర ప్రభుత్వం 18 శాతం భరించేలా ప్రతిపాదించారు. మిగిలిన 48 శాతం నిధులను బ్యాంకుల నుండి రుణాలుగా సేకరిస్తారు. మరో 4 శాతం నిధులను పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్షిప్ (పీపీపీ) విధానంలో సేకరించాలని యోచిస్తున్నారు.

# సంగారెడ్డి, మెదక్ జిల్లాలో భారీ వర్షాలు

## పలు చోట్ల ధాన్యం నీటిపాలు

సంగారెడ్డి ఉమ్మడి మెదక్ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం  సాయంత్రం నుంచి ఎడతెరిపి లేకుండా వాన కురుస్తోంది. రాష్ట్రంలోనే అత్యధిక వర్షపాతం సంగారెడ్డి జిల్లాలో నమోదు అయింది. సంగారెడ్డి జిల్లా కోహిర్ 9.5, పుల్కాల్ 7.5, లక్ష్మి సాగర్ లో 5.5 సెం. మీ వర్షపాతం నమోదుఅయింది. మెదక్ జిల్లా టేక్మాల్ 8.4, లింగంపల్లిలో 3.8 సెం. మీ వాన కురిసింది. భారీ వర్షాలతో ధాన్యం తడిసి ముద్దవుతోంది. జోగిపేట, మెదక్, తూప్రాన్ ప్రాంతంలో  ధాన్యం తడిసింది.

## పల్లప్రోలు గ్రామం లో మల్లికార్జున రెడ్డి అనే వ్యక్తి అనుమానస్పద మృతి

## ఆస్తి వివాదంలో తమ్ముడే హత్య చేసి ఉంటారని కుటుంబసభ్యుల అనుమానం

నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పల్లప్రోలు గ్రామం గోపాలపురం లో దారుణం చోటు చేసుకుంది. గ్రామంలోని పొలం వద్ద మల్లికార్జున రెడ్డి అనే వ్యక్తి  అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నారు. సాయంత్రం ఇంటి నుంచి బయటికి  వెళ్ళిన మల్లికార్జున రెడ్డి రాత్రి 8 అయిన ఇంటికి రాకపోవడంతో  అతని భార్య వెతుక్కుంటూ పొలం వద్దకు వెళ్ళింది. పొలం వద్ద ఆయన భర్త విగత జీవిగా పడి ఉన్నారు. తలకు బలమైన గాయం తగిలి ఉండడంతో  స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీమ్ తో పాటు డాగ్  స్క్వాడ్  ద్వారా ఆధారాలు సేకరిస్తున్నారు. అన్నదమ్ముల పొలం వివాదమే హత్యకు కారణంగా  అనుమానిస్తున్నామని ఇన్చార్జి కోవూరు సిఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. విచారణ పూర్తయిన వెంటనే వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

## కలెక్టరేట్ ముందు ట్రాక్టర్లతో రైతుల నిరసన

అమలాపురం రైతుల వద్ద ఉన్న ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ధాన్యం బస్తాల ట్రాక్టర్లతో అమలాపురం లోని జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట అయినవిల్లి మండల రైతులు నిరసన వ్యక్తం చేశారు.   ముక్తేశ్వరం సెంటర్ లో ధర్నా నిర్వహించిన అనంతరం ధాన్యం ట్రాక్టర్ల లోడుతో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్దకు రైతులు చేరుకున్నారు. ధాన్యం బస్తాల ట్రాక్టర్లతో జిల్లా కలెక్టర్ కార్యాలయంకు తరలి వచ్చిన రైతులతో జిల్లా రెవెన్యూ అధికారి రాజకుమారి చర్చలు జరిపారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు ధాన్యం కొనుగోలు చేస్తామని రైతులు ఆందోళన చెంద వద్దని డీఆర్వో హామీ ఇచ్చారు.    ప్రస్తుతం రైతుల వద్ద ఉన్న ధాన్యం కొనుగోలుకు సాయంత్రం లోపు ఇండెంట్లు జారీ చేస్తామని డీఆర్వో హామీ ఇవ్వడంతో రైతులు వెనుతిరిగి వెళ్లిపోయారు .

# గిగ్ వర్క్స్ కోసం చట్టం సిద్ధం

హైదరాబాద్, మే 15, గిగ్ అండ్ ప్లాట్ ఫాం వర్కర్స్ కోసం ప్రత్యేక బిల్లును తీసుకొస్తున్నట్లు ప్రకటించింది తెలంగాణ ప్రభుత్వం.ముసాయిదా బిల్లును విడుదల చేసి, దానిపై అభ్యంతరాలు తీసుకుంటోంది.వీటి ఆధారంగా తుది బిల్లును తయారు చేసి అమల్లోకి తీసుకువస్తామని చెబుతోంది ప్రభుత్వం.అయితే, తాము ఆశించిన మేరకు బిల్లు తీసుకురాలేదంటున్నారు తెలగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు.2022 జూన్‌లో నీతి ఆయోగ్ విడుదల చేసిన నివేదిక ప్రకారం... 2020-21 నాటికే భారత్‌లో 77లక్షల మంది గిగ్ రంగంలో ఉపాధి పొందుతున్నట్లుగా గుర్తించారు. ప్రస్తుతం ఈ సంఖ్య ఇంకా ఎక్కువ ఉండవచ్చని అంచనా.దేశ శ్రామిక రంగంలో గిగ్ వర్కర్స్ వాటా 1.5 శాతంగా ఉందని నీతి ఆయోగ్ తన నివేదికలో పేర్కొంది.2029-30 నాటికి గిగ్ వర్కర్లు సుమారు 2.35 కోట్లకు చేరుతారని, శ్రామిక రంగంలో వీరి వాటా 6.7శాతానికి చేరుకుంటుందని అంచనా.గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్‌కు సామాజిక భద్రత కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించింది నీతి ఆయోగ్.తెలంగాణలో 4.20 లక్షల మంది గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ ఉన్నారని తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్ ఫాం వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ బీబీసీతో చెప్పారు.స్విగ్గీ, జొమాటో, ర్యాపిడో, ఓలా లాంటి యాప్ బేస్డ్ ట్యాక్సీ డ్రైవర్స్ లేదా మోటార్ సైకిల్ రైడర్స్, డెలివరీ ఏజంట్స్‌తో పాటు గిగ్ అండ్ మార్కెట్ ప్లాట్‌ఫాంలలో పనిచేసే ఫ్రీలాన్స్ లేదా పార్ట్ టైం వర్కర్లందరూ గిగ్ అండ్ ప్లాట్ ఫాం వర్కర్స్ కిందకు వస్తారు.తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్ ఫాం వర్కర్స్ (రిజిస్ట్రేషన్, సోషల్ సెక్యూరిటీ అండ్ వెల్ఫేర్) యాక్ట్,2025 పేరుతో ముసాయిదా బిల్లు ఉంది.ప్రస్తుతం ఈ ముసాయిదా బిల్లుపై అభ్యంతరాలు తీసుకుంటోంది తెలంగాణ కార్మిక శాఖ.ప్రత్యేకంగా తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇది చట్టం వర్తించే తేదీ నుంచి అందుబాటులోకి వస్తుంది.బోర్డు ప్రధాన కార్యాలయం హైదరాబాద్‌లో ఉంటుంది.బోర్డులో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి ఎక్స్-అఫీషియో ఛైర్‌పర్సన్‌గా ఉంటారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించే అధికారి కార్యదర్శిగా ఉంటారు.కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఒకరు, రాష్ట్ర కార్మిక శాఖ, ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి లేదా ముఖ్య కార్యదర్శి లేదా కార్యదర్శి, ఫైనాన్స్ డిపార్ట్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ, రవాణా శాఖ పిన్సిపల్ సెక్రటరీ, కార్మిక శాఖ కమిషనర్ ఎక్స్-అఫీషియో సభ్యులుగా ఉంటారు.గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ తరఫున నలుగురు సభ్యులు (ఒక మహిళ),అగ్రిగేటర్స్ నుంచి నలుగురు సభ్యులు (ఒక మహిళ), పౌర సమాజం నుంచి ఇద్దరు ప్రతినిధులు సభ్యులుగా ఉంటారు.వీరిని రాష్ట్ర ప్రభుత్వం నామినేట్ చేస్తుంది. డాటా కలెక్షన్, ఐటీ సిస్టమ్స్ పరంగా సాంకేతిక నిపుణుడు ప్రత్యేక ఆహ్వానితుడిగా ఉంటారు. వీరి పదవీకాలం మూడేళ్లు ఉంటుంది.గిగ్ వర్కర్లుగా పనిచేసే వ్యక్తులు రాష్ట్ర ప్రభుత్వం వద్ద రిజిస్టర్ చేసుకుంటే ప్రతి కార్మికుడికీ ఓ యూనిక్ ఐడీ ఇస్తారు.అగ్రిగేటర్స్ లేదా ఫ్లాట్‌ఫాంలు ఈ చట్టం అమల్లోకి వచ్చిన 45 రోజులలోగా వెల్ఫేర్ బోర్డులో తమ సంస్థలు లేదా కంపెనీలను రిజిస్టర్ చేసుకోవాలి.ఆయా సంస్థలు వర్కర్స్ విషయంలో మతం, జాతి, కులం, లింగం పుట్టిన స్థలం, వైకల్యం ఆధారంగా ఎలాంటి వివక్ష చూపించకూడదు.ఎవరైనా వర్కర్‌ను ఉద్యోగం నుంచి తొలగించాలంటే ఏడు రోజుల ముందుగా రాతపూర్వక నోటీసు ఇవ్వాలి.కానీ, వినియోగదారుడు (కస్టమర్)కి హాని జరిగిందని గుర్తిసే వెంటనే తొలగించే

అధికారం ఆయా సంస్థలకు ఉంటుంది.వర్కర్స్‌కు ఇచ్చే వేతనాల్లో కోత పెడితే, వాటిని వారికి చేసే పేమెంట్స్ ఇన్‌వాయిస్‌లో చూపించాలి.గిగ్ వర్కర్స్ చేసే ఫిర్యాదులు లేదా సందేహాలను నివృత్తి చేసేందుకు ప్రత్యేకంగా ఒక వ్యక్తిని ప్రతి ఫ్లాట్‌ఫాం నియమించుకోవాలి. సదరు వ్యక్తి వివరాలు వర్కర్‌కు తెలిసేలా ఫ్లాట్‌ఫాం అప్లికేషన్‌లో ఉండాలి.రాష్ట్ర ప్రభుత్వం గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ కోసం ప్రత్యేక నిధి (తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ సోషల్ సెక్యూరిటీ అండ్ వెల్ఫేర్ ఫండ్) ఏర్పాటు చేయనుంది.నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూపంలో ఇవ్వడంతోపాటు సంస్థలు, గిగ్ వర్కర్స్ ఇచ్చే మొత్తాన్ని ఫండ్‌లో జమచేస్తారు.తెలంగాణ గిగ్ అండ్ ఫ్లాట్‌ఫాం వర్కర్స్ వెల్ఫేర్ ఫండ్ ఫీజును అగ్రిగేటర్స్ లేదా ప్లాట్‌ఫామ్స్ నుంచి వసూలు చేస్తామని ప్రభుత్వం ప్రతిపాదించింది.గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్లకు చెల్లింపుల్లో ఒకశాతం తక్కువ కాకుండా, రెండు శాతానికి మించకుండా ఫీజు ఉంటుంది.

'సంస్థల తరఫున జరిగే లావాదేవీలన్నీ వెల్ఫేర్ ఫండ్ ఫీ వెరిఫికేషన్ సిస్టమ్ (డబ్ల్యూఎఫ్‌వీఎస్)తో మ్యాప్ చేసి ఉంటుంది. దీన్ని రాష్ట్ర ప్రభుత్వం, బోర్డు పర్యవేక్షిస్తుంది" అని బిల్లులో ప్రతిపాదించింది తెలంగాణ ప్రభుత్వం.'సంస్థలు వెల్ఫేర్ ఫండ్ ఫీజు చెల్లించని పక్షంలో ఏడాది జైలు లేదా రెండు లక్షల రూపాయల వరకు జరిమానా లేదా రెండూ విధించే వీలుంటుంది. ఆయా సంస్థలు సమాచారం, స్టేట్‌మెంట్, రిపోర్టులు ఇచ్చేందుకు నిరాకరిస్తే, రూ.50 వేల వరకు జరిమానా విధించే వీలుంటుంది" అని ప్రభుత్వం చెబుతోంది.రాష్ట్ర ప్రభుత్వం తరఫున గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ కోసం ప్రత్యేక ఫండ్ ఏర్పాటు చేస్తానని చెబుతున్నప్పటికీ,అది ఎంత అనేది చట్టంలో ప్రస్తావించలేదని చెబుతున్నారు గిగ్ వర్కర్లు."కనీస వేతనాలు, సామాజిక భద్రత, ఉద్యోగ భద్రత హక్కులు చట్టంలో పెట్టాలి. వీటిని నిబంధనలకే పరిమితం చేయకూడదు" అని బీబీసీతో చెప్పారు సలావుద్దీన్.అయితే, అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్ల పాలసీని తీసుకువస్తున్నామని, మే ఒకటో తేదీన కార్మిక దినోత్సవం సందర్భంగా ప్రకటించారు సీఎం రేవంత్ రెడ్డి.అధికారం చేపట్టిన వెంటనే అసంఘటిత రంగంలో పని చేస్తున్న గిగ్ వర్కర్ల కోసం రూ.5 లక్షల ప్రమాద బీమా అమలు చేశామని ఆయన చెప్పారు.గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ నుంచి వచ్చే విజ్ఞప్తులను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక అధికారిని నియమిస్తుందని బిల్లులో ప్రభుత్వం ప్రతిపాదించింది.మరోవైపు, "ప్రభుత్వం ప్రతిపాదించిన బోర్డులో వర్కర్స్, ప్లాట్ ఫాంలు, ప్రభుత్వం నుంచి సమాన ప్రాతినిధ్యం ఉండాలి. బోర్డ్ కేవలం సలహాలివ్వడానికే పరిమితం కాకుండా జరిమానాలు విధించడం, కంపెనీలపై పర్యవేక్షణ, విచారణ నిర్వహించే అధికారం ఉండాలి" అని సలావుద్దీన్ సూచించారు.తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు 2023 నవంబరులో గిగ్ అండ్ ప్లాట్ ఫాం వర్కర్లతో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ సమావేశమయ్యారు.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గిగ్ వర్కర్ల సంక్షేమానికి ప్రత్యేక చట్టం తీసుకువస్తామని అప్పట్లో ఆయన హామీ ఇచ్చారు.తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 2023 డిసెంబరులో సీఎం రేవంత్ రెడ్డి.. గిగ్ వర్కర్లతో సమావేశయ్యారు."రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలోనూ గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్ల సంక్షేమం కోసం ప్రత్యేక చట్టం తీసుకువస్తాం" అని చెప్పారు.ఇందులో భాగంగా తెలంగాణలో ప్రత్యేక చట్టం తీసుకువచ్చేందుకు ముసాయిదా బిల్లును తెలంగాణ ప్రభుత్వం జారీ చేసింది.ఇప్పటికే దేశంలో రాజస్థాన్, కర్ణాటకలో గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్ల సంక్షేమానికి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టం తీసుకువచ్చాయి.బీమా సదుపాయం కల్పించడంతో పాటు ప్రమాదం జరిగితే ఇన్సూరెన్స్ వంటివి కల్పించాలని కోరారు.ప్రస్తుతం ముసాయిదా బిల్లు విడుదల చేసిన నేపథ్యంలో అభ్యంతరాల స్వీకరణకు ప్రభుత్వం ఏప్రిల్ 29 నుంచి మూడు వారాల గడువు ఇచ్చింది."ముసాయిదా బిల్లుపై అ బ ˏ ˇ య ం త ˇ ం ా ల న ు బిణ.ణతిణ.శ్రీజీఎనీబీతీఏణఎజీతిశ్రీ.ఇనీఎ కు మెయిల్ చేయవచ్చు లేదా హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోనని కార్మికశాఖ భవన్‌లో రాతపూర్వకంగా ఇవ్వచ్చు" అని కార్మిక శాఖ ప్రకటించింది.

## ముంబైలో టౌన్‌ప్లానింగ్ డిప్యూటీ డైరెక్టర్ వైఎస్ రెడ్డి నివాసంలో ఈడీ తనిఖీలు

## రూ.9 కోట్లకు పైగా నగదుతో పాటు రూ.23.25 కోట్లు విలువ చేసే బంగారం, వజ్రాలను స్వాధీనం



హైదరాబాద్ మే 15 హైదరాబాద్‌లో మరోసారి ఈడీ సోదాలు కలకలం సృష్టించాయి. ముంబయి వసాయి విరార్ మున్సిపల్ కార్పొరేషన్ స్కామ్‌లో భాగంగా ఈడీ అధికారులు.. ముంబై, హైదరాబాద్‌తో పాటు 12 ప్రాంతాల్లో గురువారం సోదాలు నిర్వహించారు. ముంబైలో టౌన్‌ప్లానింగ్ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న వైఎస్ రెడ్డి నివాసంలో ఈడీ అధికారులు తనిఖీలు చేశ.. భారీగా నగదును గుర్తించినట్లు సమాచారం. మొత్తం రూ.9 కోట్లకు పైగా నగదుతో పాటు రూ.23.25 కోట్లు విలువ చేసే బంగారం, వజ్రాలను ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ సోదాలకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## 20 న జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి


## ఏఐటియూసి జిల్లా ఉపాధ్యక్షుడు భూమేశ్వర్

జగిత్యాల, :ఈ నెల 20న జరిగే దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసి జిల్లా ఉపాధ్యక్షులు ఇరుగురాల భూమేశ్వర్ కార్మిక వర్గ శ్రేణులకు పిలుపు. నిచ్చారు.గురువారం పెగడపల్లి మండల కేంద్రంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గోడ పత్రిక ను ఆవిష్కరించారు.అనంతరం ఇరుగురాల భూమేశ్వర్ మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్వాతంత్రం కు ముందు సాధించుకున్న 44 చట్టాలను నాలుగు లేబర్ కోడులుగా విభజించి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా చట్టాలు మారుస్తూ కేంద్ర ప్రభుత్వం కార్మిక ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని ప్రజల జీవనోపాధిపై దాడి చేస్తుందన్నారు..ఐదు సంవత్సరాలకు ఒకసారి కనీస వేతనాలు చట్టాలను మారుస్తూ కనీస వేతన జీవోను మారుస్తూ పెంపుదల చేయాల్సింది పోగ ఎనిమిది గంటల పని దినాలకు బదులుగా 12 గంటల విధానాన్ని తీసుకొస్తున్నారన్నారు.సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని జాతీయ ప్రయోజనాలకు వ్యతిరేకంగా కార్పొరేట్ శక్తులకు అనుకూల విధానాలను అవలంబిస్తున్నదన్నారు. కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని ఎన్నికలకు ముందు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈపీఎఫ్ పథకం కింద రిటైర్ అయిన కార్మికులకు కనీసం పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలన్నారు.కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 12 సార్లు జాతీయ సంఘాలు సమ్మె చేయడం జరిగిందన్నారు.అయినా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉందన్నారు.కేంద్రంలో ఉన్నటువంటి జాతీయ సంఘాలు ఏఐటీయూసీ, సిఐటియు, హెచ్ఎంఎస్, ఐఎఫ్టియు, బి ఆర్ టి యు సంఘాలు ఉమ్మడిగా సమ్మెకు పిలుపునిచ్చారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంఘాలు ఫెడరేషన్లు అసోసియేషన్లు జాతీయ సమ్మెలో పాల్గొంటున్న అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు తనిగారపు ప్రవీణ్, మండల కన్వీనర్ రాచర్ల సురేష్, సిగిరి రాజ్ కుమార్, ఆత్మకూరి రాజేష్, బొమ్మనకంకర్, కల్లేపల్లి సుధాకర్, తడగొండ అంజి, రావుట్ల స్వామి, కుంటల రాజయ్య, వద్దూరి రవి, బండపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

## కంచి గచ్చిబౌలి నష్టాన్ని ఎలా పూడుస్తారు సుప్రీం ప్రశ్న

న్యూఢిల్లీ, మే 15 హైదరాబాద్‌లో వివాదానికి కారణమైన కంచ గచ్చిబౌలి భూములపై సుప్రీంకోర్టులో వాదనలు నడిచాయి. ఈ విచారణ సందర్భంగా ప్రభుత్వంపై సుప్రీంకోర్టు సీరియస్ అయింది. వివాదాస్పద భూముల్లో చెట్ల నరికివేతపై సమాధానం చెప్పాలని నిలదీసింది. ఈ చెట్ల నరికివేతను సమర్థించుకోవద్దని మండిపడింది. పర్యావరణాన్ని పునరుద్ధరించకుంటే మాత్రం జైలుకు వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించింది. చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ ఆగస్టిన్ జార్జ్ ధర్మాసనం హైదరాబాద్‌లోని కంచ గచ్చిబౌలి భూ వివాదంపై విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ప్రభుత్వంపై తీవ్ర పదజాలంతో సుప్రీంకోర్టు మండిపడింది. ప్లాన్ ప్రకారమే అక్కడ వారంతాల్లో చెట్లు నరికేశారని ఆక్షేపించింది. అలా చేయడానికి ప్రధాన కారణం ఏంటని ప్రశ్నించింది. భారీ సంఖ్యలో యంత్రాలు, బుల్డోజర్లను మోహరించి పనులు చేయడాన్ని తప్పుపట్టింది. తాము అభ్యంతరం చెప్పకముందే పనులు చేస్తున్నట్టు పేర్కొంది. అక్కడ జరిగిన ప్రకృతి విధ్వంసం ఎలా సరి చేస్తారో చెప్పాలని ఆదేశించింది. జరిగిన తప్పును సమర్థించుకోవద్దని వార్నింగ్ ఇచ్చింది. ఎలా చెట్లు నాటుతారు పర్యావరణాన్ని ఎలా కాపాడుతారో చెప్పాలని సూచించింది. లేకుంటే కచ్చితంగా సీఎస్‌పై చర్యలు ఉంటాయని వెల్లడించింది. ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ... కంచ గచ్చిబౌలిలో పనులు నిలిపివేసినట్టు తెలిపారు. పర్యావరణానికి ఎలాంటి హాని లేకుండానే అక్కడ అభివృద్ధి ప్రాజెక్టులు చేపడతామని వెల్లడించారు. రిజిస్ట్రర్ చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని న్యాయస్థానాన్ని కోరారు. దీంతో కేసును జులై 23కు వాయిదా వేశారు. ఈ వివాదంలోనే విద్యార్థులను అనవసరంగా అరెస్టులు చేశారని న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు పిటిషన్‌దారులు. అయితే ఇది కేవలం పర్యావరణానికి సంబంధించిన అంశంగానే చూడాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అందుకే దీనిపై వేరే పిటిషన్ వేయాలని సూచించింది.

## వల్లభనేని వంశీకి అస్వస్థత.. ఆస్పత్రికి తరలింపు



అమరావతి గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని జైలు నుంచి ఆస్పత్రికి హుటాహుటిన తరలించారు. శ్వాస తీసుకోవడంతో ఆయన ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని జైలు సిబ్బందికి చెప్పడంతో వెంటనే ఆయన్ను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.వల్లభనేనికి ప్రస్తుతం వైద్యం అందిస్తున్నారు. ఈ విషయం బయటకు తెలియడంతో ఆస్పత్రి వద్దకు వైకాపా వర్గీయులు భారీగా చేరుకున్నారు. వల్లభనేని వంశీ ఆరోగ్యంపై ఆరా తీస్తున్నారు.

## వ్యభిచారం ముఠా గుట్టు రట్టు నిందితుల్లో బంగ్లా దేశీయులు

సికింద్రాబాద్ గోపాలపురంలో నార్త్జోన్ టాస్కోఫోర్స్ పోలీసుల దాడులు జరిగాయి. వ్యభిచారం చేయిస్తున్న ముఠా గుట్టును టాస్క్‌ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. ఇద్దరు బంగ్లాదేశీయులతో పాటు మొత్తం ఐదుమందిని అరెస్ట్ చేశారు. బంగ్లాదేశ్ కు చెందిన అమ్మాయిలతో సాకిన్ ఓసేన్, విమల్ సేన్ వ్యభిచారం చేయిస్తున్నారు.పోలీసుల అదుపులో ఇద్దరు యువతులు ఒకరు బంగ్లాదేశ్, మరొక్కరు పశ్చిమ బెంగాల్ చెందిన వారిగా గుర్తించారు. ముగ్గురు యువకుల్లో ఒకరు బంగ్లాదేశీయుడు. అక్రమంగా బంగ్లాదేశ్ నుంచి భారత్ వచ్చినట్లు గుర్తించారు. గోపాలపురం పోలీస్ స్టేషన్ లో నిందితులను అప్పగించారు.

## మంటల్లో బస్సు దగ్ధం

మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రైవేటు బస్సు పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం మేడ్చల్ మండలంలోని బండ మైలారం నుండి కొంపల్లికి వెళ్తుండగా మేడ్చల్ ఐటిఐ వద్ద రాగానే ఓ ప్రైవేట్ బస్సు లో మంటలు ఒకసారిగా చెలరేగాయి. దీంతో డ్రైవర్ అప్రమత్తమై బస్సును పక్కకు ఆపాడు. క్షణాల్లో బస్సు మొత్తం పూర్తిగా దగ్ధమైంది. బస్సులో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. షార్ట్ సర్క్యూట్ ద్వారానే బస్సు దగ్ధమైందని డ్రైవర్ తెలిపారు. సంఘటనా స్థలానికి ఫైర్ ఇంజన్ నీ చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. ఘటన స్థలానికి మేడ్చల్ పోలీసులు చేరుకొని పూర్తి వివరాలను సేకరించారు.

## పది కోట్ల బంగారం వ్యాపారి పరారీ

బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ మోసం వెలుగులోకి వచ్చింది. గత 15 సంవత్సరాలుగా చేతన్ జువెలర్స్ పేరిట ప్రగతి నగర్‌లో నితీష్ జైన్ అనే వ్యక్తి బంగారం వ్యాపారం చేస్తున్నాడు. సుమారు రూ.10 కోట్ల విలువ చేసే బంగారం, ఆభరణాలతో నితీష్ జైన్ పరారయ్యాడు. దీంతో.. అతని బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు. మే10వ తేదీ నుంచి దుకాణం తెరవకపోవడంతో బాధితులకు అనుమానం వచ్చింది.స్థానికంగా ఉన్న బంగారు దుకాణాల వద్ద బంగారాన్ని తీసుకు వచ్చి ఆభరణాలు చేయడంతో పాటు కష్టమర్లకు అమ్ముతూ దుకాణదారులకు జైన్ దగ్గరయ్యాడు. తన నెట్?వర్క్?ను పెంచుకుంటూ అందరికీ నమ్మకం కలిగించి ఒక్కసారిగా భారీగా బంగారు ఆభరణాలతో జంప్ అయ్యాడు.భారీ మొత్తంలో అతనికి బంగారం ఇచ్చిన నగల దుకాణాదారులు లబోదిబోమంటున్నారు. బంగారాన్ని తాకట్టు పెట్టుకుని మరీ వడ్డీలకు ఇస్తుండే వాడని బాధితులు తెలిపారు. స్థానికులు కూడా పెట్టి బాధితులను నితీష్ జైన్ ఆకర్షించాడు. కేపీహెచ్?బీ, బాచుపల్లి పరిధిలో తన వ్యాపారాన్ని నితీష్ జైన్ సాగించాడు.

## అనంతలో భారీ వర్షాలు

అనంతపురం జిల్లాలో భారీ వర్షానికి పలు కాలనీలు నీట మునిగాయి. ఎగువ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున నీటి ప్రవాహం పోటెత్తింది. దాతో పలు ఇళ్లలోకి వరద నీరు చేరింది. ప్రజలు అవస్థలు పడ్డారు. అనంతపురం రూరల్ కుక్కలపల్లి కాలనీ, ప్రజాశక్తి నగర్, రాప్తాడు పరిధిలోని కందుకూరు సీపీఐ కాలనీలోకి నీరు ప్రవేశించింది. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. శిల్ప లేపాక్షి నగర్లోనూ ఇళ్లలోకి వరద నీరు చేరింది.

## వరంగల్ లో అందాల రాశుల పర్యటన

వరంగల్ ప్రపంచ సుందరి పోటీలో పాల్గొనే సుందరీమణులు చారిత్రక ఓరుగల్లు నగరంలో పర్యటించారు. ఈ సందర్భంగా అతిథులకు తెలంగాణ సంప్రదాయం ప్రకారం బతుకమ్మ, మేళతాళాలతో స్థానిక మహిళలు, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, సీపీ సన్‌ప్రీత్‌సింగ్, ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. రామప్ప ఆలయం వద్ద చీరకట్టులో మెరిసిన అందాల భామలు గ్రూప్ ఫొటో షూట్‌లో పాల్గొన్నారు. రామప్ప ఆలయ విశిష్టతను టూరిజం గైడ్లు వారికి వివరించారు. అంతకుముందు హరిత కాకతీయ వద్ద మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి సందడి చేశారు. మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు రెండు బృందాలుగా ఏర్పడి వరంగల్ నగరంలో పర్యటిస్తున్నారు.

# పవన్ కళ్యాణ్ ఆదేశంతో పెద్దిరెడ్డి కుటుంబం కేసు.. అసలేం జరిగిందంటే..

తిరుపతి, మే 15 చిత్తూరు జిల్లాలో అటవీ భూములను అక్రమించారన్న అభియోగాలపై మాజీ మంత్రి వైసీపీ సీనియర్ నేత పెద్దిరెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యులపై అటవీ శాఖ కేసు నమోదు చేసింది. ఒకవైపు తిరుపతిలో బుగ్గ మఠం ఆక్రమణలపై నోటీసులు, మరోవైపు పులిచెర్ల మండలంలో అటవీ శాఖ భూములను ఆక్రమించారన్న అభియోగాలతో కేసులు నమోదు కావడం రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.చిత్తూరు జిల్లాలో అటవీ భూములను అక్రమించారన్న అభియోగాలపై మాజీ మంత్రి వైసీపీ సీనియర్ నేత పెద్దిరెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యులపై అటవీ శాఖ కేసు నమోదు చేసింది. ఒకవైపు తిరుపతిలో బుగ్గ మఠం ఆక్రమణలపై నోటీసులు, మరోవైపు పులిచెర్ల మండలంలో అటవీ శాఖ భూములను ఆక్రమించారన్న అభియోగాలతో కేసులు నమోదు కావడం రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. దీంతో పెద్దిరెడ్డి కుటుంబాన్ని కేసులు వెంటాడుతున్నాయన్న పరిస్థితి నెలకొంది. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ చేసిన విచారణ నివేదిక పవన్ కళ్యాణ్ కు ఆదేశంతో ఈ మేరకు ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. అటవీ భూములను ఆక్రమించిన పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులపై క్రిమినల్ కేసులతో పాటు అటవీ చట్టాల ప్రకారం కేసులు బనాయించాలన్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశం మేరకు.. అటవీ శాఖ చర్యలు చేపట్టింది. ఇందుకు సహకరించిన అధికారులను గుర్తించి శాఖా పరమైన చర్యలు చేపట్టాలని కూడా పవన్ కళ్యాణ్ ఆదేశించారు.. దీంతో పలువురు అధికారుల్లో గుబులు రేపుతోంది. ఈ మేరకు అటవీ భూముల అన్యాక్రాంతంపై పెద్దిరెడ్డి తో పాటు కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేశారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తోపాటు ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే ద్వారక నాథరెడ్డి, ఇందిరమ్మలపై కేసు నమోదు చేసింది అటవీశాఖ. పులిచర్ల మండలం మంగళం పేట అటవీ భూముల ఆక్రమణపై ఈ మేరకు చర్యలు తీసుకుంది.మంగళంపేట అటవీ ప్రాంతంలో 28.19 ఎకరాల మేర ప్రభుత్వ భూమి ఆక్రమించినట్లు అటవీశాఖ అధికారుల నిర్ధారణతో ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఫారెస్ట్ యాక్ట్, వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్ లోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది. అటవీ భూముల ఆక్రమణపై చిత్తూరు జిల్లా కలెక్టర్, ఎస్పీ, కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అధికారుల కమిటీ ఇచ్చిన రిపోర్ట్ మేరకు చర్యలు తీసుకుంది.అటవీ భూములను ఆక్రమించడంతో పాటు జీవ వైవిధ్యానికి హాని కలిగించేలా వ్యవహరించారని ప్రైమరీ అఫెన్స్ రిపోర్టులో పేర్కొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెద్దిరెడ్డి అక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టిన ప్రభుత్వం.. చర్యలు చేపడుతోంది. పులిచెర్ల మండలం మంగళంపేట అటవీ ప్రాంతంలో భూముల ఆక్రమణల వ్యవహారం రెండు నెలలు క్రితమే బయటికి వచ్చినా పూర్తి స్థాయి నివేదిక వచ్చాకే అటవీశాఖ చర్యలు తీసుకోవడం చర్చగా మారింది. జాప్యానికి కారణాలపై అనేక విమర్శలు ఉన్నా.. ఈ క్రమంలోనే.. పెద్దిరెడ్డి కుటుంబంపై కేసు నమోదు కావడం సంచలనంగా మారింది.అటవీ భూముల అన్యాక్రాంతం వ్యవహారంపై త్వరలోనే ఛార్జ్ షీట్ దాఖలు చేసేందుకు సిద్ధం అవుతున్న చిత్తూరు జిల్లా అటవీ శాఖ అధికారులు.. వివరాలు వెల్లడించే సాహసం చేయకపోవడం కొసమెరుపు..

# తిరుపతిలో పెరియార్ పోస్టర్లు

బీజేపీ ఫైర్తిరుపతి, మే 15 తిరుపతిలో ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ పేరుతో సభలు నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సభలను జయప్రదం చేయాలని పోస్టర్లు వేశారు. తిరుపతిలో నిర్వహిస్తున్న ఈ సభకు పెరియార్ అనే తమిళనాడు కవికి సంబంధం లేకపోయినా తిరుపతి అంతా ఆయన పోస్టర్లతో నింపేశారు. పెరియార్ హిందూ వ్యతిరేకిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన దేవుళ్లపై, ఆలయాలపై ఎన్నో ఘోరమైన వ్యాఖ్యలు చేశారు. వాటన్నింటినీ ఇప్పుడు పోస్టర్ల రూపంలో తిరుపతిలో వేశారు. భగవద్గీత, పురాణాలను కాల్చివేయాలని టెంపుల్స్ ను, పండగులను పరిష్కరించాలని పెరియార్ ఎప్పుడో 80 ఏళ్ల కిందట ఇచ్చిన పిలుపుల్ని ఇప్పుడు పోస్టర్లుగా వేసి హిందూత్వాన్ని కించ పరుస్తున్నారు. హిందువుల ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అయిన తిరుపతిలో ఇలా చేయడం వెనుక భారీ కుట్ర ఉందని అనుమానిస్తున్నారు. ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ ఏఐవైఎఫ్ అనేది కమ్యూనిస్టు పార్టీలకు చెందిన అనుబంధ సంస్థ. నిరుద్యోగం, ఉపాధి అవకాశాలు, పాలకుల విధానాలు తదితర అంశాలపై బోధనలు, చర్చలు, తీర్మానాలు చేస్తామని సభలు పెడతారు. కానీ చేసేది మాత్రం తప్పుడు రాజకీయాలు, హిందూత్వంపై దాడి. ఇలాంటి వాటిని అసలు క్షమించకూడనదన్న అభిప్రాయం హిందూత్వ వాదుల నుంచి వస్తోంది. ప్రజాస్వామ్యంలో ఎవరైనా అన్ని రకాల అభిప్రాయాలను వెలిబుచ్చవచ్చు. మన దేశంలో ఆ స్వేచ్ఛ ఎక్కువ ఉంది. అయితే అది.. ఇతరుల్ని కించపర్చడానికి రెచ్చగొట్టడానికి కాదు. అలా చేయడం నేరం. తిరుపతి లాంటి ప్రసిద్ధ పుణ్యక్షేత్రంలో ఇలాంటి పోస్టర్లు వేయడం... భగద్గీతను తగులపెట్టాలని చెప్పడం.. ఆలయాలను బహిష్కరించాలని పిలుపునివ్వడం అంటే చిన్న విషయం కాదని భావిస్తున్నారు. ఈ అంశంపై ప్రభుత్వ పెద్దలు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వినిపిస్తోంది. కమ్యూనిస్టు పార్టీల యూత్ విభాగానికి.. పెరియార్ వాదనలకు ఏమైనా సంబంధం లేదు. ఉద్దేశపూర్వకంగా తప్పు ప్రచారం చేయడానికే ఇలా తిరుపతిలో సభ పెట్టి పోస్టర్లు వేశారని అనుకోవచ్చు.

## అనంతపురం జిల్లాకు చేరుకున్న మంత్రి నారా లోకేష్
## నేటి నుంచి మూడు రోజులపాటు జిల్లాలో పర్యటన



అనంతపురం మంత్రి నారా లోకేష్ గురువారం అనంతపురం జిల్లాకు చేరుకున్నారు. శుక్రవారం నుంచి అయన మూడు రోజులపాటు జిల్లా లో పర్యటిస్తారు. ప్రత్యేక హెలికాప్టర్లో గుత్తి మండలం బేతపల్లికి మధ్యాహ్నం 1.23 నిమిషాలకు చేరుకున్నారు. అయనకు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, ఇతర ఎమ్మెల్యేలు,కాల్వ శ్రీనివాసులు , దగ్గుపాటి ప్రసాద్ , శ్రావణి ,జయరాం , ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ. ,పార్థసారథి ,జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్, ఎస్పీ జగదీష్ ,ఇతర ప్రజాప్రతినిధులు గుంటూరు మేయర్ కోవెల మూడి రవీంద్ర , ఎడిసీసీ చైర్మన్ ముంటీమడుగు కేశవ్ రెడ్డి, టిడిపి నాయకులు మురళీ, రామలింగారెడ్డి ,పశుపుల శ్రీరామ్ రెడ్డి ,తదితర ,కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు

# టీటీడీ ట్రస్ట్ లకు భారీగా విరాళాలు



తిరుమల అమెరికా బోస్టన్ కు చెందిన ఎన్అర్ఐ భాగవతుల ఆనంద్ మోహన్ గురువారం నాడు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుని తన క్యాంప్ కార్యాలయంలో కలిసి విరాళం డిడిలను అందజేసారు. ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్ కు రూ 1,00,01,116, ఎస్వీ గోసంరక్షణ ట్రస్ట్ కు రూ 10,01,116, ఎస్వీ విద్యాదాన ట్రస్ట్ కు రూ 10,01,116, ఎస్వీ వేదపరిరక్షణ ట్రస్ట్ కు రూ 10,01,116, ఎస్వీ సర్వశ్రేయాస్ ట్రస్ట్ కు రూ 10,01,116 లు విరాళం అందజేసారు. చైర్మన్ బీఅర్ నాయుడు దాతను అభినందించారు.

# 88మధ్యప్రదేశ్ బిజెపి మంత్రి విజయ్ షాకు సుప్రీంకోర్టు షాక్



బోపాల్ మే 15 మధ్యప్రదేశ్ బిజెపి మంత్రి విజయ్ షాకు సుప్రీంకోర్టు షాకిచ్చింది. ఆపరేషన్ సిందూర్ లో పాల్గొన్న కల్నల్ సోఫియా ఖురేషిని "ఉగ్రవాదుల సోదరి" అని అన్నందుకు తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలని మంత్రి విజయ్ షా సుప్రీం కోర్టుకు వెళ్లారు. అయితే, మంత్రికి న్యాయస్థానం ఊహించని షాకిచ్చింది. ఈ సమయంలో జోక్యం చేసుకోలేమంటూ మంత్రి పిటిషన్ ను తిరస్కరించింది.కాగా, పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్, ఆపరేషన్ సిందూర్ నిర్వహించి.. ఉగ్రస్థావరాలపై దాడులు చేసి వాటిని ధ్వంసం చేసింది. ఈ ఆపరేషన్ గురించిన వివరాలు వెల్లడించిన కల్నల్ సోఫియా ఖురేషిపై మంత్రి విజయ్ షా మాట్లాడుతూ.. వాళ్ల సోదరినే పంపి ఉగ్రవాదులకు ప్రధాని మోడీ, తగిన బుద్ధి చెప్పారని వివాదాస్పద కామెంట్స్ చేశారు. దీంతో సర్వత్రా తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. మంత్రి వ్యాఖ్యలపై మధ్యప్రదేశ్ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేస్తూ..మంత్రి విజయ్ షాపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆయనపై ఇండోర్‌లోని మోవ్‌లోని మాన్పూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

# రైతు అవగాహన సదస్సులో పాల్గొన్న జిల్లా కలెక్టర్

హుస్నాబాద్ కుందన్ వానిపల్లి గ్రామ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఆయా ప్రాంత రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారుముందుగా ప్రసిద్ధ ఎఫ్ పి ఓ సంఘం అధ్యక్షుడు ఏలేటి స్వామిరెడ్డి ఈ ఆర్థిక సంవత్సరం లో సంఘం సాధించిన ప్రగతి, లావాదేవీల గురించి క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.రైతు కు లాభం చేకూర్చాలి. పంటను పండించిన తర్వాత మార్కెట్ రేటు, సౌకర్యాలు అందించే వాళ్లు కావాలని క్రిషి కల్ప ఫౌండేషన్ వారితో టైయాప్ అయ్యాం.ప్రసిద్ధ ఎఫ్ పి ఓ మరియు క్రిషి కల్ప ఫౌండేషన్ వారు చేస్తున్న పనిని ఆయా మండలాల్లో అగ్రికల్చర్, హార్టికల్చర్ అధికారులను విస్తృతంగా రైతులతో అవగాహన కల్పించాలి.ఈ మండలం లో వరి ఎక్కువ పత్తి మొక్కజొన్న ఇతర కూరగాయలు పంటలకు తక్షణమే లాభసాటి రేటు కావాలని కొన్ని ప్రైవేట్ కంపెనీలు ముందుకు వచాయి.ఉత్పత్తిని పెంచడం కోసం కొన్ని కంపెనీలు వచ్చాయని తెలిపారు. కంపెనీలు చాలామంది పెడుతుంటారు కానీ రైతులు వారి నుండి మనకు ఏ రకంగా బెనిఫిట్ అవుతుందని ఆలోచించాలి. రైతు కూడా పంటకు కావలసిన ధర ఎంత వస్తుంది అనే ఒక రెస్పాన్స్ బుల్ గా ఎదగాలి. దీనికోసం అవగాహన కల్పించేందుకు ముందుకు వెళ్తున్నాం.మండలంలో ప్రాసెసింగ్ యూనిట్ 5 ఎకరాలలో భూమిని సీడ్ ప్రాసెస్, స్టోరేజ్ యూనిట్ ప్రాసెసిన్ యూనిట్ ఇలా అనేక రకాల డెవలప్ చేయడానికి కేటాయించడం జరిగింది. జిల్లాలోనే అత్యంత అభివృద్ధి చెందిన ప్రసిద్ధ ఎఫ్ బి ఓ ను మరింత అభివృద్ధి చేయడానికి సభ్యుల సంఖ్య పెంచాలని సూచించారు. ఎక్కువ మంది సభ్యులు ఉంటే ఇంకా బెటర్ గా బిజినెస్ చేయవచ్చు.పరికరాల కావాలన్న, ఇతర ఎలాంటి అవసరాలు అయినా ప్రభుత్వం తరఫునుంచి ఇవ్వడానికి సుముఖంగానే ఉన్నాం.రైతులకు ఎంతగానో అభివృద్ధి చేస్తున్నటువంటి క్రిషి కల్ప ఫౌండేషన్ వారికి కృతజ్ఞత. ఇటు రైతులతో మాట్లాడుతూ అటు ట్రేడర్స్ ని తీసుకురావడంలో బాగా కృషి చేస్తున్నారు.ప్రసిద్ధ, ప్రహర్ష ఎఫ్ పి ఓ లే కాకుండా రైతులు విభిన్నంగా ఆలోచించడం, సేంద్రీయ పద్దతి వ్యవసాయం, సాంకేతిక పరిజ్ఞానం నీ ఉపయోగించుకుని వ్యవసాయం చేస్తున్నారు.రైతులు నేర్చుకోవాలనే దృక్పథం ఉంటే ఏదైనా సాధ్యం అవుతుందనీ ఉన్న వనరులను ఉపయోగించుకుని రైతులు మరింత అభివృద్ధి చెందాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో క్రిషి కల్ప ఫౌండేషన్ సీఈవో సీఎం పాటిల్, డీఈవో రాధిక, డిహెచ్ఓ సువర్ణ, పలు స్టార్ట్ అప్ కంపెనీ ప్రతినిధులు, ఇతర గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

# చెట్లను నరికితే ఉపేక్షించేది లేదు

అవనిగడ్డ రోడ్ల పక్కన చెట్లను ఎవరైనా ఇష్టారాజ్యంగా నరికితే ఉపేక్షించేది లేదని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ స్పష్టం చేశారు. గురువారం చల్లపల్లి, మోపిదేవి మండలాల పరిధిలోని పెద్దకళ్లేపల్లి రోడ్డులో చెట్ల నరికివేసిన తీరును ఎమ్మెల్యే పరిశీలించారు. జాతీయ రహదారిలో మొక్కలు తగలబెట్టిన తీరు పరిశీలించారు. ఈ ఘటనలపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్తలు శ్రమతో పెంచిన చెట్లను నరికితే సహించేది లేదన్నారు. ఇష్టారాజ్యంగా చెట్లు నరికిన వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. చెట్లు నరికింది ఎంతటి వారినైనా సహించకుండా వాల్టా చట్టం అమలు చేయాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వనజాక్షి, ఎంపీడీఓ డాక్టర్ ఏవీ రమణ, సీఐ ఈశ్వరరావు, ఎస్ఐ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## శ్రీ సరస్వతి అమ్మవారికిపంచామృతాభిషేకలు, ప్రత్యేక పూజలు



జగిత్యాల రూరల్ మే 15 పొలాస గ్రామంలోని సహస్ర లింగాల దేవాలయంలో సరస్వతి నది పుష్కరాల సందర్భంగా గురువారం ఉదయం సరస్వతి అమ్మవారికి పంచామృతాభిషేకాలు, అష్టోత్తర నామాల పూజ మరియు అమ్మవారికి సామూహిక హారతిని నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి వేద బ్రాహ్మణోత్తం వచ్చి ఆశీర్వాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు ఆలయ చైర్మన్ నలమాస గంగాధర్ మాట్లాడుతూ సరస్వతి పుష్కరాలను పురస్కరించుకొని గురువారం నుండి 12 రోజులపాటు అమ్మవారికి ప్రత్యేక పూజలను అభిషేకాలను నిర్వహిస్తున్నామని భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు..ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, ప్రముఖులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు

## కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం
## వారం రోజుల పాటు తెలికపాటి వర్ష సూచన

విశాఖపట్నం నైరుతి బంగళాఖాతం పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవరస్తం కొనసాగుతోందని విశాఖ వాతావరణ శాఖ అధికారి తెలిపారు.దీని ప్రభావంతో వారం రోజుల పాటు తెలికపాటి వర్షసూచనలు ఉన్నాయని,ఉత్తర కొస్తా జిల్లాలో తెలికపాటి పలు ప్రాంతాల్లో వర్షాలు, మూడు రోజుల పాటు దక్షిణ కొస్తా జిల్లాలో పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తాయని తెలిపారు.

## హై లైఫ్ ఎక్స్ పో పోస్టర్ ఆవిష్కరణ

హైదరాబాద్ సరికొత్త లైఫ్ స్టైల్, వెడ్డింగ్ ఫ్యాషన్స్ కోరుకునే ఔత్సహికుల కోసం హై-లైఫ్ ఎగ్జిబిషన్కు సంబంధించిన పోస్టర్ను బంజారాహిల్స్ లోనీ, నటి స్రవంతి చొక్కవరపు, నటి చాందిని తదితరులతో కలిసి ఆవిష్కరించారు. ఈనెల మే 23 నుంచి మూడు రోజులపాటు నోవాటెల్ హోటల్ లో.. హై-లైఫ్ ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఎగ్జిబిషన్ లో ఏర్పాటు చేసే సరికొత్త ఉత్పత్తులను తారలు ప్రదర్శించారు. ఫ్యాషన్ అండ్ లైఫ్ స్టైల్ దుస్తులు, సృజనాత్మకత జోడించి రూపొందించిన వెడ్డింగ్ దుస్తులు, బంగారు, డైమండ్ ఆభరణాలను ఈ ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణీయంగా నిలుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

## ఓయూ భోతనేతర సిబ్బందికి టైం స్కేల్ వర్తింపచేయాలి

హైదరాబాద్ ఓయూలో బోధనేతర సిబ్బంది టైం స్కేల్ ను వర్తింపచేయాలని మహార్యాలీ నిర్వహించారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల నుండి పరిపాలన భవనం వరకు ర్యాలీ నిర్వహించి తమ డిమాండ్ ను నెరవేర్చాలని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఓయూ రిజిస్ట్రార్కు తమ వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా తాము యూనివర్సిటీలో చాలిచాలని పనిచేస్తున్నామన్నారు. గతంలో ఉన్న విసి 1500 రూపాయలను పెంచితే ప్రస్తుతం ఉన్న విసి అది కూడా తగ్గించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రవేట్ సెక్యూరిటీ కి 30 వేల రూపాయలు జీతాలు ఇస్తూ 350 మందికి రిక్రూట్ చేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ గత 25 సంవత్సరాలుగా పనిచేస్తున్న తమకు 15000 మాత్రమే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు టైం స్కేల్ ను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

# రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి వేగంగా అడుగులు

**కూటమి ప్రభుత్వ పాలసీలతో పెట్టుబడులకు దేశ, విదేశీ సంస్థల ఆసక్తి**

**సచివాలయంలో సిఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన 6వ SIPB సమావేశం**


**19 ప్రాజెక్టులకు సంబంధించి రూ. 33 వేల కోట్ల పెట్టుబడులకు ఆమోదం**

**ఎనర్జీ, టూరిజం, ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 35 వేల మందికి ఉద్యోగావకాశాలు**

**ఇప్పటివరకు 6 ఎస్ఐపీబీల్లో 76 ప్రాజెక్టుల ద్వారా రూ.4,95,796 కోట్ల పెట్టుబడులకు ఆమోదం**

**వీటి ద్వారా 4,50,934 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు**

**ఒప్పందాలు చేసుకున్న సంస్థల పనుల పురోగతిపై డాష్ బోర్డ్ ద్వారా పర్యవేక్షణ**



అమరావతి, మే 15 : రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి వేగంగా అడుగులు పడుతున్నాయి. కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన పాలసీలతో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు దేశ, విదేశీ సంస్థల ఆసక్తి చూపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకుని వెను వెంటనే ప్రాజెక్టుల స్థాపనకు శ్రీకారం చుడుతున్నాయి. ఇప్పటికే కొన్ని సంస్థలు శంకుస్థాపనలు కూడా నిర్వహించగా... మరి కొన్ని కంపెనీలు పెట్టుబడులపై ఒప్పందాలు చేసుకుంటున్నాయి. గత ప్రభుత్వ విధానాలతో రాష్ట్రంపై విశ్వాసం కోల్పోయిన పారిశ్రామిక వేత్తలను తిరిగి రాష్ట్రానికి రప్పించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలితాలను ఇస్తున్నాయి. 11 నెలల కాలంలో ఎస్ఐపీబీ ఇప్పటికి 6 సార్లు సమావేశం కాగా, 76 ప్రాజెక్టులకు సంబంధించి రూ.4,95,796 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపింది. వీటి ద్వారా 4,50,934 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగనున్నాయి. తాజాగా గురువారం సచివాలయంలో సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన 6వ ఎస్ఐపిబి సమావేశంలో 19 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు. వీటికి సంబంధించి రూ. 33 వేల కోట్లకు పైగా పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. ఎనర్జీ, టూరిజం, ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో ఈ పెట్టుబడుల ద్వారా దాదాపు 35 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

ప్రాజెక్టుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ :

ఈ సందర్భంగా సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ... 'రాష్ట్రంలో పెట్టుబడుల కోసం ముందుకు వచ్చి ఒప్పందాలు చేసుకున్న సంస్థలు... ప్రాజెక్టుల శంకుస్థాపన నుంచి ప్రారంభోత్సవం వరకు అధికారులు నిరంతర పర్యవేక్షణ జరపాలి. ప్రతి ప్రాజెక్టు పురోగతిని నిరంతరం ఫాలోఅప్ చేయాలి. ఆయా సంస్థల పెట్టుబడులు, క్షేత్ర స్థాయి పనుల స్థితిగతులను తెలుసుకునేందుకు డాష్ బోర్డ్ తీసుకురావాలి. తద్వారా ఏ ప్రాజెక్టు ఏ స్థాయిలో ఉంది అనేది తెలుసుకోవచ్చు. పెట్టుబడులతో పాటు వచ్చిన ఉద్యోగాల వివరాలతో పోర్టల్ రావాలి. ఎస్ఐపిబి సమావేశాల్లో కొత్త పెట్టుబడులకు ఆమోదం తెలపడంతో పాటు... ఇప్పటికే ఆమోదం తెలిపి ఒప్పందాలు చేసుకున్న ప్రాజెక్టులకు సంబంధించి ప్రోగ్రెస్ వివరించాలి' అని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

50 వేల హెూటల్ రూములు లక్ష్యం :

టూరిజం ప్రాజెక్టుల ఏర్పాటుపై సిఎం చంద్రబాబు మాట్లాడుతూ...'టూరిజం సెక్టార్‌లో హెూటళ్లు, రూముల కొరత ఉంది. పెద్దఎత్తున హెూటల్ రూమ్‌లు వస్తే పర్యాటకానికి ఊపు వస్తుంది. 50 వేల రూమ్‌లు అందుబాటులోకి తేవాలి అనేది మన ముందున్న లక్ష్యం. హెూటల్ రూమ్‌ల ధరలు అందుబాటులో ఉంటే పర్యాటకులు ఆయా ప్రాంతాల్లో బస చేస్తారు. కారవాన్స్‌కు సంబంధించి పాలసీని కూడా సిద్ధం చేసి అమల్లోకి తేవడం ద్వారా కొత్త పర్యాటకులకు కొత్త అనుభూతి కలుగుతుంది. తద్వారా పర్యాటక ఆదాయం కూడా పెరుగుతుంది. ముఖ్యంగా దేవాలయాలకు వచ్చే వారికి మంచి వసతి అనేది చాలా ముఖ్యం. కుటుంబాలతో వచ్చే వారు ప్రశాంతమైన, పరిశుభ్రమైన వాతావరణంలో ఉండాలి అనుకుంటారు. రాష్ట్రంలో రద్దీగా ఉండే 21 దేవాలయాల్లో వసతి సౌకర్యం పెంచే చర్యలు తీసుకోవాలి. టెంట్లు (గుడారాలు) ఏర్పాటు చేసి వసతి కల్పించే ప్రాజెక్టులను ప్రారంభించాలి. అదే విధంగా గోదావరి, కృష్ణా నదుల వద్ద నిర్వహిస్తున్న హారతుల కార్యక్రమాన్ని ఆధ్యాత్మిక శోభ పెంచేలా చేపట్టాలి' అని ముఖ్యమంత్రి సూచించారు. పారిశ్రామికరంగంపై మాట్లాడుతూ... 'వ్యవసాయ వ్యర్థాలను కొన్ని చోట్ల తగలబెడుతున్నారు... దీన్ని నివారించాల్సి ఉంది. చిన్నచిన్న ప్లాంట్ల ద్వారా అగ్రికల్చర్ వేస్ట్‌ను సర్క్యులర్ ఎకానమీగా మార్చాలి. అగ్రికల్చర్ వేస్ట్‌ను సద్వినియోగం చేసుకునే పరిశ్రమలకు ప్రోత్సాహం ఇవ్వాలి' అని సిఎం సూచించారు.

6వ ఎస్ఐపీబీ ఆమోదం తెలిపిన పెట్టుబడుల వివరాలు :

6వ ఎస్ఐపీబీ సమావేశంలో వివిధ రంగాలకు చెందిన మొత్తం 19 సంస్థలకు సంబంధించి రూ. 33,720 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. వీటి ద్వారా 34,621 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి.

ఐ అండ్ సి డిపార్ట్‌మెంట్ :

1) దెక్కన్ ఫైన్ కెమికల్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ : కుమరవరం, అనకాపల్లి జిల్లా – రూ.1,560 కోట్ల పెట్టుబడులు, 1,800 ఉద్యోగాలు

2) భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ : పాలసముద్రం, శ్రీ సత్యసాయి జిల్లా – రూ.1,400 కోట్ల పెట్టుబడులు, 800 ఉద్యోగాలు

3) పీయూఆర్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ : ఓర్వకల్, కర్నూలు జిల్లా – రూ.1,286 కోట్ల పెట్టుబడులు, 1,200 ఉద్యోగాలు

4) బ్లూ జెట్ హెల్త్ కేర్ లిమిటెడ్ : రాంబిల్లి, అనకాపల్లి జిల్లా – రూ.2,300 కోట్ల పెట్టుబడులు, 1,750 ఉద్యోగాలు

5) జుపిటర్ రెన్యూవబుల్స్ ప్రైవేట్ లిమిటెడ్ : రాంబిల్లి, అనకాపల్లి జిల్లా – రూ.2,700 కోట్ల పెట్టుబడులు, 2,216 ఉద్యోగాలు

టెక్స్‌టైల్ డిపార్ట్‌మెంట్ :

6) రాంభద్ర ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ : తణుకు, పశ్చిమ గోదావరి జిల్లా – రూ.228 కోట్ల పెట్టుబడులు, 250 ఉద్యోగాలు

7) మోహన్ స్పింటెక్స్ : మాలవల్లి, కృష్ణా జిల్లా – రూ.482 కోట్ల పెట్టుబడులు, 1,525 ఉద్యోగాలు

8) ఏటీసీ టైర్స్ ఏపీ ప్రైవేట్ లిమిటెడ్ : అచ్యుతాపురం, అనకాపల్లి జిల్లా – రూ.1,779 కోట్ల పెట్టుబడులు, 600 ఉద్యోగాలు

ఏపీఐఐసీ డిపార్ట్‌మెంట్ :

9) వింగ్‌టెక్ మొబైల్ కమ్యూనికేషన్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ : తిరుపతి జిల్లా – రూ.1,061 కోట్ల పెట్టుబడులు, 10,098 ఉద్యోగాలు

10) అలీప్ కుప్పం : చిత్తూరు జిల్లా – రూ.5 కోట్ల పెట్టుబడులు, 1,500 ఉద్యోగాలు

ఎనర్జీ డిపార్ట్‌మెంట్ :

11) నితిన్ సాయి కనస్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ : ఏలూరు జిల్లా – రూ.150 కోట్ల పెట్టుబడులు, 500 ఉద్యోగాలు

12) దేశ్‌రాజ్ సోలార్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ : అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలు – రూ.2,920 కోట్ల పెట్టుబడులు, 230 ఉద్యోగాలు

13) ఆంప్లస్ ఎనర్జీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ : కడప జిల్లా – రూ.3,941 కోట్ల పెట్టుబడులు, 260 ఉద్యోగాలు

14) బొండాడ ఇంజినీరింగ్ లిమిటెడ్ : అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలు – రూ.9,000 కోట్ల పెట్టుబడులు, 3,900 ఉద్యోగాలు

టూరిజం డిపార్ట్‌మెంట్ :

15) బెంగాల్ అల్టిమేట్ రిసార్ట్స్ ఎల్ఎల్‌పి: తిరుపతి – రూ.150 కోట్ల పెట్టుబడులు, 350 ఉద్యోగాలు

16) స్రవంతి హెూటల్స్ అండ్ రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ : తిరుపతి – రూ.327 కోట్ల పెట్టుబడులు, 570 ఉద్యోగాలు

17) వరుణ్ హాస్పటాలిటీ ప్రైవేట్ లిమిటెడ్ : విశాఖపట్నం – రూ.899 కోట్ల పెట్టుబడులు, 1,300 ఉద్యోగాలు

ఐటీ డిపార్ట్‌మెంట్ :

18) డైకిన్ ఎయిర్ కండిషనింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ : శ్రీసిటీ, తిరుపతి జిల్లా – రూ.2,475 కోట్ల పెట్టుబడులు, 5,150 ఉద్యోగాలు

19) సెన్సోరెమ్ ఫోటోనిక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ : కర్నూలు జిల్లా – రూ.1,057 కోట్ల పెట్టుబడులు, 622 ఉద్యోగాలు

# ఏడాది పాలనలో చేసిన మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**కూటమి మధ్య చిచ్చుకు వైసిపి కుట్రలను తిప్పికొట్టండి**

**రెడ్ బుక్ మరువను... కేడర్ ను ఇబ్బంది పెట్టిన వారిని వదలను**

**సీనియర్లు, జూనియర్లను గౌరవిస్తా... పనిచేసే వారిని గుర్తిస్తా**

**మన పెద్దపండుగ మహానాడును విజయవంతం చేయండి**

**గుంతకల్లు ఉత్తమ కార్యకర్తల సమావేశంలో యువనేత నారా లోకేష్**



గుంతకల్లు: ప్రతి కార్యకర్త మన ప్రభుత్వం చేసింది చెప్పుకోవాలి, భారతదేశంలో ఏ రాష్ట్రంలో కూడా 4వేల పెన్షన్ ఇవ్వడం లేదు. అవ్వతాతలకు అండగా నిలిచేందుకే పెన్షన్ పెంచాం, ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లిస్తున్నాం. వాటిగురించి పార్టీ కార్యకర్తలంతా ప్రజల్లోకి వెళ్లి మాట్లాడాలని తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. గుంతకల్లు నియోజకవర్గం గుత్తి సమీపంలోని రామరాజుపల్లిలో ఉత్తమ కార్యకర్తల సమావేశంలో యువనేత లోకేష్ మాట్లాడుతూ....అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నట్లే కసితో పనిచేయాలి. బాబు సూపర్ %-% 6, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీలో పార్టీ తరపున పలు హామీలు ఇచ్చాం. ఒక్కొక్కటిగా వాటిని అమలుచేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. 11నెలల ప్రజాప్రభుత్వంలో వృద్ధాప్య పెన్షన్ 4వేలకు, వికలాంగ పెన్షన్ 6వేలకు పెంచాం. రాష్ట్రవ్యాప్తంగా పేదల ఆకలితీర్చే అన్నక్యాంటీన్లు ప్రారంభించాం. ఉచిత గ్యాస్ పథకాన్ని అమలు చేస్తున్నాం. ఈ పథకంలో నిబంధనలు సడలించి లబ్ధిదారుల ఎకౌంట్ లో నేరుగా డబ్బులు చేయాలని నిర్ణయించాం. మత్స్యకారులకు ఆర్థికసాయం అందించాం, చేనేతలకు 200 యూనిట్ల విద్యుత్ ఇచ్చాం. రోడ్లపై గుంతలన్నీ పూడ్చుకుంటూ వస్తున్నాం. జూన్ మాసంలో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలు ఇస్తాం. ఆర్థిక ఇబ్బందులున్నా ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలుచేస్తూ ముందుకెళ్తున్నాం.

వైసిపి దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి

మన ప్రభుత్వం స్కూళ్లు మూసివేస్తుందని వైసిపి తప్పుడు ప్రచారం చేస్తోంది. ఒక్క పాఠశాలను కూడా మూయడం లేదు. అది మన లక్ష్యం కాదు. ఒక క్లాస్ కు ఒక టీచర్ ఉండాలన్నదే మన ధ్యేయం. మన ప్రభుత్వంలో వచ్చేనాటికి కేవలం 1200 స్కూళ్లలో క్లాసుకో టీచర్ ఉంటే, ఇప్పుడు 9800 మోడల్ ప్రైమరీ స్కూళ్లు ఉన్నాయి. గతంలో ప్రభుత్వ స్కూళ్లలో 45లక్షల మంది విద్యార్థులు ఉండగా, ఇప్పుడు 33లక్షలకు పడిపోయారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు దీటుగా తీర్చిదిద్దుతాం. మంత్రి నారాయణ సహకారంతో ప్రభుత్వ జూనియర్ కాలేజిల్లో మంచి ఫలితాలు వచ్చాయి. మన ప్రభుత్వం జూన్ మాసానికి సంవత్సరం అవుతుంది. జూన్ నుంచి తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ ఇస్తాం. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా అన్నీచేస్తాం. బిజెపి, జనసేన పార్టీతో కలిసి పొత్తుతో పోటీచేశాం. నామినేటెడ్ పదవుల విషయంలో వారితో మాట్లాడి పదవులు ఇస్తున్నాం. కొందరు వైసిపి వాళ్లు అపోహలు సృష్టిస్తున్నారు, వక్ఫ్ సవరణలు ప్రతిపాదించి ముస్లిం సోదరులకు అండగా నిలిచాం. ఎవరికీ ఇబ్బంది లేకుండా చూసుకునే బాధ్యత టిడిపి చూసుకుంటుంది. జనసేన తో కలిసి పోటీ చేశాం, భవిష్యత్తులో కలిసే ప్రయాణం చేస్తాం, మా మధ్య ఎలాంటి అరమరికలు లేవు. ఈరోజు మనం తలెత్తుకుని తిరగడానికి కేంద్ర సహకారం కారణం. దేశవ్యాప్తంగా విశాఖ స్టీల్ తప్ప అన్ని ప్రైవేటీకరిస్తున్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులకు సాయం చేస్తున్నారు. వైసిపి వాళ్లు చిచ్చుపెట్టాలని చూస్తారు, సమర్థవంతంగా తిప్పికొట్టండి.

5ఏళ్లలో చేయలేనిది 11నెలల్లో చేశాం

యువగళం పాదయాత్ర చేసినపుడు కార్యకర్తల అభీష్టం మేరకు కష్టపడిన కార్యకర్తలను గుర్తించడానికి మీ ముందుకు వస్తున్నా. కార్యకర్తల పనితీరును టెక్నాలజీకి అనుసంధానం చేస్తే ఎవరు పనిచేస్తారో తెలుస్తుందని నేను ఆనాడే చెప్పా. దీనివల్ల ఎవరు పనిచేస్తున్నారో స్పష్టంగా తెలుస్తుంది. ప్రభుత్వ కార్యక్రమానికి వచ్చే ముందు క్లస్టర్, గ్రామ, మండల నేతలను కలుస్తానని చెప్పిన మేరకు రేపు మెగా సోలార్ పార్కు శంకుస్థాపనకు వచ్చే ముందు ఇక్కడకు వచ్చా. అయిదేళ్లలో వైసిపి ప్రభుత్వం చేయలేనిది 11నెలలో చేసి చూపించాం. కరెంటు చార్జీలు పెంచమని చెప్పాం. జగన్ నిర్వాకం వల్లే ట్రూ అప్ చార్జీలు వేయాల్సి వస్తోంది. దీనిపై మనం మాట్లాడకపోతే దెబ్బతింటాం. 16,347 టీచర్ పోస్టులతో మెగా డిఎస్సీ ఇచ్చాం. చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రానికి పెద్దఎత్తున కంపెనీలు వస్తున్నాయి. అనంతపురానికి రూ. 22వేల కోట్ల విలువైన భారీ సోలార్ విండ్ ప్రాజెక్టు వస్తోంది. విశాఖకు టిసిఎస్ డెవలప్ మెంట్ సెంటర్ వస్తోంది. రాబోయే అయిదేళ్లలో మనపిల్లలకు ఉద్యోగాలు వస్తాయి. పార్టీ కార్యకర్తలంతా ప్రభుత్వపరంగా చేపట్టే అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి.

అందరి కష్టంతో చరిత్రను తిరగరాశాం

పార్టీ ఆవిర్భావం తర్వాత ఎప్పుడూ లేనివిధంగా ప్రజలు కూటమికి 94శాతం సీట్లు ఇచ్చారు. సునామీ మాదిరి ప్రజలు ఇచ్చిన తీర్పుతో చరిత్ర తిరగరాశాం, దీనివెనుక కార్యకర్తల కష్టం, త్యాగాలు ఉన్నాయి. నాలుగున్నర దశాబ్ధాల్లో అధికారం, ప్రతిపక్షం రెండూ చూశాం. అయితే గత అయిదేళ్ల లాంటి అరాచక పాలన ఇదివరకెన్నడూ చూడలేదు. గతంలో చంద్రబాబు పరామర్శకు వెళ్తే ఎవరూ ఆపే సాహసం చేయలేదు. 2019 నుంచి 24వరకు భయానక పరిస్థితులు కల్పించారు, చంద్రబాబుగారు బయటకు రావాలంటే ఇంటి గేట్లకు తాళ్లు కట్టేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరిగితే బి.ఫాంలు పట్టుకెళ్లారు, ఇళ్లు ధ్వంసం చేశారు. పుంగనూరులో అంజిరెడ్డి తాత మీసాలు మెలేసి తొడగొట్టి నామినేషన్ వేశారు. ఆయనే నాకు స్ఫూర్తి. పల్నాడులో మంజులారెడ్డి అనే తెలుగు మహిళ బూత్ ఏజంటుగా ఉన్నందుకు కత్తులతో దాడిచేసినా పోలింగ్ అయ్యే ఓటింగ్ మిషన్ సీల్ వేసేవరకు అక్కడే ఉన్నారు. పల్నాడులో చంద్రయ్య మెడపై కత్తిపెట్టి జై జగన్ అనమంటే జై చంద్రబాబు అన్నందుకు మెడకోసి హత్యచేశారు, అయిదేళ్ల రాక్షస పాలనలో అనేక కష్టాలు మనం ఎదుర్కొన్నాం.

సభ్యత్వంలో సత్తా చాటాం

తెలుగుదేశం పార్టీ రెండేళ్లకోసారి చేపట్టే సభ్యత్వం గతంలో ఎన్నడూ లేనివిధంగా చేసి చూపించారు. భారత్ లో ఏ పార్టీకి లేనివిధంగా కోటి సభ్యత్వాలు టిడిపికే సొంతం. దానికి కార్యకర్తల కష్టమే కారణం. కార్యకర్తల బీమాను అయిదులక్షలకు పెంచాం, పేదపిల్లలకు నిరంతరం ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఉచిత విద్య అందిస్తున్నాం. కార్యకర్తలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటాం. గుంతకల్లులో గుమ్మనూరు జయరాంను ఎన్నికలకు నెలముందు చంద్రబాబు గారు ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించారు, అయినప్పటికీ భుజాలపై మోసి గెలిపించారు. కార్యకర్తలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలు తెలుసుకోవాల్సిందిగా ఎమ్మెల్యేని కోరుతున్నా. వారి సమస్యలు పరిష్కరించే బాధ్యత తీసుకోవాలి. పార్టీలో పాత,కొత్తల కలయిక జరగాలి. పనిచేసినవారికి పెద్దపీట వేయాలి. సీనియర్లు, జూనియర్లను గౌరవిస్తా, పనిచేసేవారిని ప్రోత్సహిస్తా. కార్యకర్తలు గ్రూపు రాజకీయాలకు దూరంగా ఉండాలి. మనందరిదీ ఒకటే వర్గం, అది తెలుగుదేశం. గతంలో ఎప్పుడూ గెలవని మంగళగిరిలో 2019లో పోటీచేసి నేను ఓడిపోయా. మొదటిరోజు బాధపడినా రెండోరోజు నుంచి కసిపెరిగింది. కష్టపడి పనిచేసి అక్కడ చరిత్ర తిరగరాశాం. భారీ మెజారిటీతో గెలిచాం, మంగళగిరిలో ఇప్పుడు ఎటువంటి గ్రూపులు లేవు.

కేడర్ ను ఇబ్బందులు పెట్టినవారిని వదలను

పార్టీ కేడర్ ఎర్ర బుక్ గురించి అడుగుతున్నారు. మన కార్యకర్తలను ఇబ్బందులు పెట్టిన వారిని వదలను. నా అంతట నేనుగా ఎవరితో గొడవపెట్టుకోను, మన జోలికి వస్తే మాత్రం వదలను. గత ప్రభుత్వంలో మద్యంలో ఎంత కుంభకోణం జరిగిందో రాష్ట్రమంతా చూస్తున్నారు. ప్రజలను చైతన్యవంతులను చేసి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఈ క్రమంలో కొంచెం సమయం పట్టొచ్చు. కార్యకర్తలు అహంకారం లేకుండా ప్రజల్లోకి వెళ్లి వారి చుట్టూ తిరగాలి. పార్టీ అధినేత తీసుకున్న నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాల్సిందే. కార్యకర్తల కోసం జగన్ పై కంటే మూడురెట్ల ఎక్కువగా పార్టీలో పోరాడుతున్నా. ఇది మన కుటుంబం, మన పార్టీ. అన్యాయం జరిగితే నన్ను, ఇతర పార్టీ పెద్దలను కలవాలి. ఇన్ చార్జి మంత్రి నెలకు ఒకసారి రావాలని ఇప్పటికే చెప్పా. జోనల్ కోఆర్డినేటర్, పార్లమెంటు అధ్యక్షుడు ఉన్నాడు. సమస్యలపై నాలుగు గోడల మధ్య యుద్ధం చేద్దాం, బయటకు వచ్చాక జై తెలుగుదేశం అని నినదిద్దాం.

త్వరలో మై టిడిపి పేరుతో కొత్త యాప్

పార్టీ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు కేడర్ కు చేరవేసేందుకు మహానాడు తర్వాత కొత్త యాప్ మై టిడిపి పేరుతో కొత్త యాప్ విడుదల చేస్తాం. కెఎస్ఎస్, బూత్, క్లస్టర్, అందరికీ ఒకే యాప్ ద్వారా కార్యక్రమాలపై సందేశాలు పంపిస్తాం. ఈనెల 18,19,20 నియోజకవర్గ స్థాయిలో మినీ మహనాడు జరుగుతుంది. 27,28, 29 కడపలో మన పెద్దపండుగ మహనాడు జరుగుతుంది. ఈ కార్యక్రమంలో కార్యకర్తలంతా ఉత్సాహంగా పాల్గొనాలి. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, అనంతపురం ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, జోన్ %-% 5 కోఆర్డినేటర్ కోవెలమూడి నాని, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, అనంతపురం పార్లమెంటు టిడిపి అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ పాల్గొన్నారు.

## రైలు లో మంటలు..ప్రయాణికులు సురక్షితం

యాదాద్రి జిల్లా బీబీనగర్ వద్ద రైలులో మంటలు చెలరేగాయి. మిర్యాలగూడ నుంచి కాచిగూడ వెళుతున్న రైలు భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి దాటుతుండగా పొగలు అలుముకున్నాయి. గమనించిన ప్రయాణికులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. బీబీనగర్ రైల్వే స్టేషన్లో రైలును ఆపిన సిబ్బంది ఫైరింజన్ సహాయంతో మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. ప్రమాదంలో ఎవరికి ఎలాంటి అపాయం జరగలేదన్నారు.

## మత్స్యకారులు, మత్స్య కార్మికుల మహా ధర్నా

హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద జాతీయ మత్స్యకారుల డిమాండ్స్ డే సందర్భంగా మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని మహాధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం కేటాయిస్తున్న లక్షల కోట్ల బడ్జెట్లో బడా పెట్టుబడిదారులు, సంపన్న వర్గాలకు రాయితీలు, ఫలాలు అందుతున్నాయే తప్పా నిజమైన మత్స్యకారులకు బడ్జెట్ కేటాయింపులో న్యాయం జరుగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో గత పదేళ్లుగా బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వలన మత్స్యకారుల బ్రతుకులపై అనేక భారాలు పడుతున్నాయన్నారు. దేశవ్యాప్తంగా మత్స్య పరిశ్రమ అభివృద్ధి కొరకు మత్స్యకారులశ్రీ సంక్షేమానికి బడ్జెట్లో కేంద్ర ప్రభుత్వం లక్ష కోట్ల రూపాయలు, రాష్ట్ర ప్రభుత్వం 5వేల కోట్ల రూపాయలు నిధులు కేటాయించాలని కోరారు. అదేవిధంగా మత్స్య సొసైటీలోని సభ్యులందరికీ 10 లక్షల రూపాయలు గ్రూప్ ఇన్సూరెన్స్ ఎలాంటి షరతులు లేకుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# నిద్రవస్తులో ఉన్న దేవాదాయశాఖ అధికారులు.



**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 15 మే 2025**నెక్నంపూర్ లో గల దేవాదాయ శాఖకు సంబంధించిన విలువైన భూమిలో రోడ్డు నిర్మాణం చేపట్టడం చట్టరీత్యా నేరమని తాను బాధ్యతగల నాగరికునిగా ట్విట్టర్ లో పోస్టు చేసినందుకు గాను తనను నేరస్తుడిగా పరిగణిస్తున్నారని అల్కాపూర్ నివాసి తెలుపగా, అలా కాదు అట్టి రోడ్డు మునిసిపల్ అధికారుల ఆధీనములో వేస్తున్నారని అయినను సదరు వ్యక్తి లంచం అడుగు తున్నాడని పోలీసు యంత్రాంగానికి విన్నవించు కోన్నామని అందుకు పోలీసులు అతనిపై ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయడం జరిగినదని మరోకపక్క ఉన్న వారు తెలుపు తున్నారు. అసలుకు సంబంధిత దేవాదాయ శాఖ అధికారులు మాత్రం ఈ విషయమై తమకు సంబంధం లేని విషయంగా పరిగణిస్తూ నిమ్మకు నీరెత్తినట్లు గమ్మున ఉండడంపై కాస్తా స్థానిక ప్రజానీకం విడ్డూరపడు తున్నారని, కావున ఈ విషయమై రాజ్యాంగ బద్దంగా అన్ని అధికారాలు కలుగియున్న ఉన్నత స్థాయి అధికారులు లేదా స్థానిక రంగారెడ్డి జిల్లా కలెక్టరు కానీ విషయ పరిజ్ఞానం తెలుసు కోవడానికి ఇట్టి విషయమై కలుగ చేసుకొని వాస్తవానికి అసలు స్థలం ఎవరిది, రోడ్డు ఎవరు వేస్తున్నారు, ఎందుకు వేస్తున్నారు, అయితే రోడ్డు వేయడానికి అసలుకు అనుమతులు తీసుకున్నారా లేదా అనే విషయమై అన్ని కొణకలో కులకషంగా తెలుసుకోవడనికి పూర్తి దర్యాప్తు జరిపించాలని తద్వారా అధికారులను తిక మక పెడుతూ ప్రక్క త్రోవ పట్టిస్తున్న వారు ఎంతటి వారైనా విచారణ పేరుతో తేల్చి అట్టి వారిపై చట్ట రీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని ముస్ముందు ఈ తరహా ఆశా మాశీ చర్యలు ఎవరూ చేపట్టకుండా తగిన గుణపాఠం చెప్పాలని ది సిటిజన్స్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు అందె లక్ష్మణ్ రావు అధికారులను వినమ్ర పూర్వకంగా కోరడమైనది.

# పారిపోయిన దొంగ అరెస్ట్,రిమాండ్




**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ మే 15 :** మంచిర్యాల జిల్లాలోని లక్షెట్టిపేట పట్టణంలో గత రెండురోజుల క్రితం నస్పూర్ పోలీస్ స్టేషన్లో దొంగతనం కేసులో అరెస్ట్ చేసి రిమాందుకు తరలిస్తున్న రాంమల్లే గజానంద్ ఏ కరణ్ అనే దొంగను పట్టుకొని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచడం జరిగిందని గురువారం సీఐ అల్లం నరేందర్ తెలిపారు. అయన తెలిపిన వివరాల ప్రకారం. నిందితుడు మావల మండలానికి చెందిన వాడని,చెడు వ్యసనాలకు బానిసై దొంగతనాలు చేస్తూ నస్పూర్ పోలీసులకు పట్టుబడ్డాడన్నారు.అక్కడి పోలీసులు కేసు నమోదు చేసి లక్షెట్టిపేట జైలుకు తీసుకురాగా, పోలీసుల నుండి తప్పించుకొని పారిపోయాడన్నారు.నిందితున్ని కోసం గాలిస్తుండగా గురువారం ఉదయం బస్టాండ్ సమీపంలో ఎస్సై గోపతి సురేష్,సిబ్బందితో కలిసి పట్టుకొని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు సీఐ తెలిపారు.నిందితున్ని చాకచక్యంగా పట్టుకున్న ఎస్సై జి సురేష్,సిబ్బందిని సీఐ అభినందించారు.

# రైతులు ఉద్యాన వన శాఖ లోని పథకాలను సద్వినియోగం చేసుకోండి

## జిల్లా ఉద్యాన వన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారిని కే అనిత



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి మే 15 :** మంచిర్యాల జిల్లా ఉద్యాన శాఖా సాగు ప్రణాళిక ఆయిల్ పామ్ సాగు కై లక్ష్యంగా 2000 ఎకరాలకు గాను ప్రణాళికలు రూపొందించినట్లు మంచిర్యాల జిల్లా ఉద్యాన వన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారిని కే.అనిత తెలిపారు.జిల్లాలోని 4 క్లస్టర్ లు అయిన బెల్లంపల్లి క్లస్టర్ 260 ఎకరాలు, భీమిని క్లస్టర్ 440 ఎకరాలు, చెన్నూర్ క్లస్టర్ 791 ఎకరాలు, మంచిర్యాల క్లస్టర్ 509 ఎకరాలు, మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా మొత్తం 2000 ఎకరాల్లో 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఉద్యాన శాఖా సాగు ప్రణాళిక ఖరారైందని తెలిపారు. సమీకృత ఉద్యాన అభివృద్ధి మిషన్ ద్వార 116.11 లక్షలతో పండ్ల తోటలు పెంపకం (డ్రాగన్ ఫ్రూట్,అరటి, పపయా,మామిడి,జామ,నిమ్మ),కూరగాయల సాగు,పూల తోటల పెంపకం,ప్లాస్టిక్ మల్చింగ్,పాత తోటల పెంపకం పునరుద్దరణ, నీటి కుంటల ఏర్పాటు,షెడ్ నెట్ హౌస్,రిపెనింగ్ చాంబర్,సోలార్ డ్రైయ్యర్స్,ఉద్యాన యంత్రికరణ (మినీ ట్రాక్టర్స్ 3, పవర్ వీడర్స్ 6, బ్రష్ కట్టర్స్ 16, నవ్ స్టాక్ స్పేయర్స్17 పెర్మి కంపోస్ట్ యూనిట్స్.11 రకాల కొత్త పంటల పంపకం,పాత తోటల పునరుద్ధరణ మరియు సాగుకై యంత్రాలు,నిర్మాణాలకు ను 35% నుంచి 75% వరకు రాయితీ తో కూడిన 210.40.అంచనా ఖర్చు.157.22 అని తెలిపారు.

రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం ద్వార లక్షల రూపాయలతో సుక్ష్మ సేద్యం,తుంపర్ల సేద్యం,తీగ జాతి కూరగాయల సాగుకు శాశ్వత పందిరి నిర్మాణం వంటి పథకాలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో బింద సేద్యం 162.45 లక్షల రూపాయలు,215 హెక్టార్లకు.తుంపర సేద్యం 30.36 లక్షల్లో 160 హెక్టార్లు/యూనిట్స్ కి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం శాశ్వత పందిళ్ళ నిర్మాణానికి రూ. 25 లక్షలతో 50.00 ఎకరాల్లో. నేషనల్ మిషన్ ఆన్ ఏడిబుల్ ఆయిల్స్ పథకం ద్వార 2000 ఎకరాలలో ఆయిల్ పామ్ తోటలను పెంచడానికి. జాతీయ వెదురు మిషన్ పథకం ద్వారా 7.20 లక్షలతో 50.00 ఎకరాలలో మొక్కలను పెంచటానికి గాను అని పేర్కొన్నారు.రైతులు వినియోగించుకోవాలి ప్రభుత్వం ఉద్యాన పంటలకు రాయితీ కల్పిస్తుంది/అందిస్తుంది. ఉద్యాన శాఖా అమలు చేస్తున్న పథకాలను రైతులు వినియోగించుకోవాలి.ఆసక్తి గల రైతులు ఉద్యాన శాఖా అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి.దరఖాస్తు తో పాటు పట్టా పాసుపుస్తకం, ఆదార్ కార్డ్,బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్, పాసు పోర్ట్ సైజ్ ఫోటో,కుల ధ్రువికరణ పత్రం (%ాజ/ూ% రైతులు) జిరాక్స్ ప్రతులు జమ చేయాలి.ఆసక్తి గల రైతులు ధరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉద్యాన మరియు పట్టుపరిశ్రమ శాఖా,అధికారి కే. అనిత తెలిపారు.ఈ పథకం మరిన్ని వివరాలు,సందేహాల నివృత్తికై క్రింద పేర్కొన్న ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించగలరని తెలిపారు

.బెల్లంపల్లి డివిజన్ - బెల్లంపల్లి తాండూర్ -కాసిపేట, జె. అర్చన (8977713955)భీమిని డివిజన్- భీమిని,కన్నేపల్లి, నెన్నెల,వేమనపల్లి టి. అరుణ్(8977713960) చెన్నూర్ డివిజన్ భీమారం,చెన్నూర్, జైపూర్,కోటపల్లి, మందమర్రి- యం.కళ్యాణి (8977713957)మంచిర్యాల డివిజన్ దండేపల్లి, హాజీపూర్,జన్నారం,లక్షెట్టిపెట,నస్పూర్,మంచిర్యాల కె. సహజ 8977713954

## విదేశాల్లో ఉద్యోగాల పేరిట మోసాలు

### ఐదుగురు అరెస్టు

శంషాబాద్ విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని అమాయకులను నమ్మించి వర్క్ వీసా కు బదులుగా విసిటింగ్ విసాలు ఇప్పించి మోసాలకు పాల్పడుతున్న ఐదు మంది నిందితులను శంషాబాద్ ఎయిర్ పోర్ట్ పోలీసులు గుర్తించారు. కేసు వివరాలను శంషాబాద్ ఎసిపి శ్రీకాంత్ గౌడ్ వెల్లడించారు. అమాయకులకు విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని 5 మంది వెస్ట్ గోదావరి జిల్లాకు చెందిన సత్యనారాయణ, చిలుకూరి బాలాజీ, అన్నమయ్య జిల్లా కు చెందిన సుంకర శివకుమార్, కడపకు చెందిన గోపాల్, హైదరాబాద్ కు చెందిన అంజి లు కలిసి కొంతమంది అమాయకులకు వర్క్ వీసా కు బదులుగా విసిటింగ్ వీసాలు ఇచ్చి గల్ఫ్ దేశాలకు పంపించేందుకు ప్రయత్నించారు. అయితే విషయం తెలుసుకున్న శంషాబాద్ ఎయిర్ పోర్ట్ పోలీసులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి నిందితులకు గుర్తించారు. ఐదు మంది నిందితుల్లో ముగ్గురు పరారీలో ఉండగా ఇద్దరు పోలీసులకు చిక్కారు. సుంకర శివకుమార్, చిలుకూరి బాలాజీలను అదుపులోకి తీసుకొని విచారించారు. విచారణలో నిందితులు అమాయకులకు విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ వర్క్ వీసాకు బదులుగా విసిటింగ్ వీసాలు ఇచ్చి మోసాలకు పాల్పడుతున్నట్లు తేలింది. దీంతో నిందితుల వద్ద 14 వీసాలు, 14 పాస్ పోర్ట్ లు, 7 సెల్ ఫోన్ లు, 16 ఫ్లైట్ టికెట్ లు, రెండు స్టాంపులు, స్టాప్ ప్యాడ్, ల్యాప్ టాప్ స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరో ముగ్గురు నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. పట్టుబడ్డ ఇద్దరు నిందితులను రిమాండ్ కు తరలించారు.

# భారీ వర్షానికి తడిసి ముద్దయిన ధాన్యం

**కేంద్రాల వద్దనే తడిసిన వరి ధాన్యం**

**సకాలంలో తూకం వేయకపోవడమే ఇందుకు కారణం**

**తడిసిన ధాన్యాన్ని వెంటనే తూకం వేయాలి**

**తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతన్నలు**



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి( మే 15 ప్రజాబలం)** సంగారెడ్డి జిల్లా నియోజకవర్గంలోని వివిధ మండలాల గ్రామాలలో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి, వరి ధాన్యాన్ని ఆరబోసుకున్న రైతన్నలకు తీవ్ర నష్టాన్ని కలిగించింది, ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని రైతులు అష్ట కష్టాలు పడి, వరి కొనుగోలు కేంద్రాల వద్దకు తాము పండించిన వరి ధాన్యాన్ని తీసుకొని వచ్చినప్పటికీ, అక్కడి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, వడ్లను సకాలంలో తూకం వేయకపోవడంతో, పలు గ్రామాల రైతులు, రాత్రి పగలు తేడా లేకుండా నిద్రాహారాలు మాని, తమ వడ్ల వద్దనే పడిగాపులు కాస్తున్నారు, అయినప్పటికీ కొనుగోలు కేంద్రాల నిర్వహకులు, తమ ఇష్టాను సారంగా, వ్యవహరించడమే కాకుండా, పెత్తందారులకు కొమ్ము కాస్తూ, సన్న చిన్న కార్ రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని, పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, ఇట్టి విషయాన్ని సంబంధిత వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ ఏ ఒక్క అధికారి స్పందించకపోవడం దురదృష్టకరమని, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, బుధవారం నాడు రాత్రి కురిసిన వర్షానికి వరి ధాన్యం మొత్తం తడిసి ముద్దయింది, తడిసిన తమ ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే స్పందించి, తూకం వేసి రైతులను ఆదుకోవాలని, పలు గ్రామాల రైతులు కోరుతున్నారు, పంట సాగు కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు రుణాలు తెచ్చి పంట సాగు చేసినప్పటికీ, అట్టి పంటలు పొట్టకు వచ్చే దశలో, బోరు బావులు నీరు పోయకపోవడంతో సాగు చేసిన వరి పంట తమ కళ్ళముందే ఎండిపోయింది, ఎంతో కొంత చేతికి వచ్చిన పంటలను, యంత్రాలతో కోయించి వరి కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చామని అన్నారు, కొనుగోలు కేంద్రాల వద్ద సమయానికి తూకం వేయకపోవడంతో, రాత్రి



కురిసిన భారీ వర్షానికి, తమ ధాన్యం తడిసి ముద్దయిందన్నారు, ఒకవైపు పంట సాగు కోసం తెచ్చిన అప్పులు తీర్చలేక, పండించిన కొద్దిపాటి ధాన్యాన్ని సకాలంలో తూకం వేయకపోవడంతో, రైతన్నలు కంటతడి పెట్టారు, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, వెంటనే తడిసిన తమ ధాన్యాన్ని తూకం వేసి, మద్దతు ధర కల్పించి తమను ఆదుకోవాలని, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు, లేనియెడల మాకు మరణమే శరణ్యమని పలు గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు....

# వివాహ వేడుక లో పాల్గొన్న మాజీ జడ్పీటీసీ, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్



**ఇల్లందు ప్రతినిధి మే 15 (ప్రజాబలం)** కామేపల్లి మండలం పండితాపురం గ్రామానికి చెందిన ఆవుల నాగేశ్వరరావు - లింగమ్మ ల కుమారుడైన సాయి - సుక్కమ్మ ( కొణిజర్ల మండలం లింగగూడెం గ్రామానికి చెందిన మాదాసు కోటయ్య, నాగమణి ల కుమార్తె) ల కు జరిగిన క్రైస్తవ వివాహ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ మాజీ జడ్పిటిసి మేకల మల్లిబాబు యాదవ్ పాల్గొని నూతన వధూవరులను అక్షింతలు వేసి నిండు నూరేళ్ల పాటు చల్లగా అనురాగ దాంపత్యంతో జీవించాలని వివాహం అనే శుభ కార్యక్రమం జీవితంలో ఒక మైలురాయి లాంటిదని, ఆనందంగా సుఖ సంతోషాలతో గడపాలని మనసారా ఆశీర్వదించారు.ఈ సందర్భంగా గ్రామస్తులు అడిగిన సమాచారం మేరకు ఇండ్లు లేని అర్హులైన నిరుపేదలకు విడతల వారీగా మంజూరు చేయడం జరుగుతుందని, గత ఏప్రిల్ నెల నుండి రేషన్ షాపులలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభమైందని, అదేవిధంగా అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు త్వరలో మంజూరు చేయడం జరుగుతుందని, బీసీ ఎస్సీ ఎస్టీల పక్షపాతి కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని, గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పిదాల కారణంగా ఎంత లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ, తీవ్ర నష్టం జరిగినప్పటికీ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఒక్కొక్కటిగా పథకాలు అమలు చేస్తున్నాయని, అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అమలు చేసే విధంగా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేకపోతుల మహేష్, బండి లక్ష్మీనర్సు, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పాటిబండ్ల ప్రసాద్, బండి ఉపేందర్ దొడ్ల వెంకన్న ఆవుల నరసింహారావు బాదావత్ నాగరాజు తొండల ముత్తయ్య అనంతుల శ్రీను, వేముల బుచ్చిబాబు కొమ్మిని అప్పారావు, పల్లె ఉపేందర్ జలగం వెంకటేష్ ఆవుల వెంకన్న, ఆవుల నగేష్, జంపాల ఉపేందర్, మరియు తదితర బంధుమిత్రులు పాల్గొన్నారు




తేదీ:15-05-2025 గురువారం రోజున రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ లోని గుమ్మి పుల్లయ్య భవన్లో తెలంగాణ రాష్ట్ర బీడీ వర్కర్స్ ఫెడరేషన్ కౌన్సిల్ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి బి.గోవర్ధన్ రాష్ట్ర అధ్యక్షులు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీడీ కార్మికులకు ఈపీఎఫ్ఓ ద్వారా కనీస పెన్షన్6000/- రూపాయలు ఇవ్వాలని, ఈఎస్ఐ హాస్పిటల్ అన్ని జిల్లాలలో నిర్మించాలని, ప్యాకర్లు, షేఖర్లకు మాత్రమే ఈఎస్ఐ సౌకర్యం ఉందని, కానీ జిల్లాలలో అందుబాటులో లేదని, ఎలా వెళ్లాలో, ఎవరిని సంప్రదించాలో తెలియదని, వర్ది బీడీ లేకుండా అందరూ కార్మికులకు పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, నెలలో 24 రోజుల పని కల్పించాలని అన్నారు. అనంతరం మే 20వ తేదీన జరుప తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పోస్టర్ను ఆవిష్కరించడం జరిగింది. నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, కనీస వేతనం 26,000 ఇవ్వాలని, కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్ విధానం రద్దు చేయాలని, అందరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, 8 గంటల పని విధానం అమలు చేయాలని, చట్టాలను, కార్మిక హక్కులను కాపాడుకోవడం కోసం ఈనెల 20వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో సుతారి రాములు, ముక్రం, కడారి రాములు, అజ్జ వేణు, తోట బిక్షపతి, కొక్కుల శాంత, కె.వి.అనసూయ, వెన్న మహేష్, అయ్యవారు లక్ష్మణ్, ఆది రంగారెడ్డి, ఎన్. బాలగౌడ్, కే. పార్వతి, శాంత తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మానకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి జన్మదిన వేడుకలు.



రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, ఇల్లంతకుంట, ( ప్రజాబలం ), ఇల్లంతకుంట మండల కేంద్రంలో బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో మానకొండూరు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ జన్మదిన వేడుకలు జరుగగా దానికి ముఖ్యఅతిథిగా రాజన్న సిరిసిల్ల జిల్లా జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు హాజరై కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపినారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో చాలామంది నాయకులు రాజకీయాలు చేస్తూ ఉంటారు, కానీ కొందరు మాత్రమే ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ ప్రజలతో కలిసి వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయేలా జీవిస్తుంటారని అన్నారు. ఈకోవకే రసమయి బాలకిషన్ చెందుతారని అన్నారు. మానకొండూరు మాజీ శాసనసభ్యులు డాక్టర్ రసమయి బాలకిషన్ రెండు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసే, రాష్ట్ర సాంస్కృతిక సారధి చైర్మన్ గా రెండుసార్లు పదవి బాధ్యతలు నిర్వహిస్తున్న కొంచెం కూడా గర్వం కూడా కనిపించనీయకుండా తన పని తాను చేసుకుంటూ వెళ్లిన మృదుస్వభావి రసమయి అని అన్నారు. ఒకవైపు మానకొండూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి మరొకవైపు పార్టీకి వెన్నుదన్నుగా నిలిచిన, నాయకులకు, కార్యకర్తలకు, సాధారణ జనానికి ఆపద కాలంలో అండగా నిలుస్తూ జనం మెచ్చిన నేతగా గుర్తింపు పొందాడు అని అన్నారు. నాడు తెలంగాణ ఉద్యమం కొనసాగుతున్న రోజులలో ప్రజల కష్టాలు చూడలేక తెలంగాణ రాష్ట్ర సమితిలో చేరి కెసిఆర్ వెంట వచ్చి తెలంగాణ సాధించేంతవరకు ధూమ్ దాం కార్యక్రమాలు రాత్రి పగలు తేడా లేకుండా నిర్వహిస్తూ, నిద్రాహారాలు లేకున్నా, నిద్రలేని రాత్రులు ఎన్నో గడిపి ఉద్యమాన్ని దగ్గర నుండి నడిపించారని అన్నారు. మానకొండూరు నియోజకవర్గ పరిధిలో తను శాసన సభ్యులుగా ఉన్నన్ని రోజులు ఏ ఇంట్లో ఏ కష్టం వచ్చినా తెలుసుకొని మరి సహాయం చేసిన గొప్ప మనసున్న వ్యక్తి రసమయి అని అన్నారు. సామాన్య ప్రజలే తన బలం, బలహీనత అనే నేత వారికి సేవ చేయడానికి ఎంత కష్ట నష్టాలు ఎదురైన వారి కష్టం తీర్చడానికి దూరమైన పోరాడుతానని చెప్తూ ఉంటాడని అన్నారు. కష్టం వచ్చిన ప్రజలు సహాయం చేయమని అడగకుండానే ప్రజల కష్టాలను తెలుసుకొని మరీ వెళ్లి సాయం చేసే గొప్ప మనసున్న వ్యక్తి రసమయి అని అన్నారు. కష్టం వచ్చిన ప్రతి కుటుంబంలో ఒక కొడుకుగా, ఒక అన్నగా బాధ్యతలు తీసుకుంటూ వారి బాగోగులు చూసుకుంటూ వారి కుటుంబంలో ఒకరిగా కలిసిపోయాడని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ ప్రజా ప్రతినిధులు, అన్ని అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు, బి ఆర్ ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.




# పారిశుధ్య కార్మికుల రక్షణ, భద్రత అందరి బాధ్యత డీఆర్డీఓ శేషాద్రి

## ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం



రాజన్న సిరిసిల్ల జిల్లా, మే -15 (ప్రజాబలం ప్రతినిధి)గ్రామాల్లో పరిశుభ్రత నెలకొల్పడానికి రేయింబవళ్ళు శ్రమిస్తున్న పారిశుధ్య కార్మికుల రక్షణ, భద్రత, గౌరవం కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని డీఆర్డీఓ శేషాద్రి పేర్కొన్నారు.యూనిసెఫ్ - స్వచభారత్ సమన్వయంతో పారిశుధ్య కార్మికుల రక్షణ, భద్రత, గౌరవం అనే అంశంపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లాలోని ఆయా మండలాల ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించగా, డీఆర్డీఓ శేషాద్రి హాజరై మాట్లాడారు. గ్రామాల్లో చెత్త నిర్వహణ, సేంద్రీయ ఎరువు తయారీ, తదితర అంశాలపై పనిచేస్తున్న పారిశుధ్య కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఉద్ఘాటించారు.పారిశుధ్య కార్మికులకు పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన, ఇష్టమైన రీతిలో పని చేసేందుకు సరైన వాతావరణం ఏర్పాటు చేయాలని యూనిసెఫ్ శిక్షకుడు ఫణీంద్ర తెలిపారు.పారిశుధ్య కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలని, తరచుగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, రక్షణ కవచాలు ఇచ్చి వాడేలా అవగాహన కల్పించాలని సూచించారు. దీంతో కార్మికుల, వారి కుటుంబ సభ్యుల భద్రతకు చేయూత ఇస్తుందని యూనిసెఫ్ సమన్వయకర్త కిషన్ స్వామి తెలిపారు.ప్రతి ఇంటి స్థాయిలో తడి, పొడి చెత్త వేరు, కంపోస్ట్ షెడ్ల వినియోగం, ఎరువు తయారీ, చెత్త నుంచి సంపద తయారీ తదితర అంశాలపై స్వచ్ఛభారత్ శిక్షకుడు రమేష్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా జిల్లాలో సామూహిక ఇంకుడు గుంతలు, పైప్ కంపోస్ట్ పద్ధతులు, విజయగాధల పై సిరిసిల్ల స్వచ్ఛ భారత్ కో ఆర్డినేటర్ సురేష్ తెలిపారు.అనంతరం ఉత్తమ సేవలు అందిస్తున్న జిల్లాలోని పలువురు పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఎల్పీఓ నరేష్, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, కార్మికులు, ఎస్బీఎం కన్సల్టెంట్ ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వేతనాలు, పెన్షన్లు రాక గ్రంధాలయ సిబ్బంది ఇబ్బందులు

జగిత్యాల, :చాలీ చాలని వేతనాలతో,పెన్షన్ డబ్బులతో కాలం వెళ్లదీస్తున్న గ్రంధాలయ సంస్థ ఉద్యోగులకు వేతనాలు,పెన్షనర్లకు పెన్షన్ డబ్బులు గత 2 నెలల నుంచి రాక కుటుంబ పోషణ భారంగా మారిందని తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్రకార్యదర్శి,జగిత్యాల జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.గురువారం జిల్లా కేంద్రంలోని పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో జిల్లా గ్రంధాలయ సంస్థ ఉద్యోగుల,పెన్షనర్ల సమావేశం జరిగింది.ఈ సమావేశంలో హరి ఆశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రతి నెల సక్రమంగా వేతనాలు రాక పోవడంతో గ్రంధాలయ సంస్థల ఉద్యోగులు,పెన్షనర్లు నిత్యావసర సరుకుల కోసం,వైద్య సేవల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి ఉందన్నారు.మీ వేతనాలు,పెన్షన్లు వస్తాయని నమ్మకం మాకు లేదని అప్పులు,అరువు దొరక్క పస్తులు ఉండాల్సిన దయనీయ పరిస్థితిలో గ్రంధాలయ సంస్థ ఉద్యోగులు,పెన్షనర్లు కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.వెంటనే గ్రంథాలయ సంస్థల ఉద్యోగులకు రెండు మాసాల వేతనాలు,పెన్షనర్లకు పెన్షన్ డబ్బులు చెల్లించాలని డిమాండ్ తో రాష్ట్ర ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క కు,రాష్ట్ర గ్రంధాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్ లకు ఫ్యాక్స్ ద్వారా వినతిపత్రం హరి ఆశోక్ కుమార్ పంపారు, ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లం విజయ్,ఉపాధ్యక్షుడు వెల్మల ప్రకాష్ రావు,కోశాధికారి గౌరిశెట్టి విశ్వనాథం, ఆర్గనైజింగ్ కార్యదర్శి కే.సత్యనారాయణ,నాయకులు నీలగిరి జగదీశ్వర్ రావు, కే.మధుసూదన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మే 20వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె ను విజయవంతం చేయండి.

## కార్మిక సోదరి, సోదరులారా మేల్కొండి. నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలి.



రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, బోయినపల్లి, ( ప్రజాబలం ), కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన బిజెపి నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం తన కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను మరియు కార్పొరేట్ అనుకూల, మతోన్మాద చర్యలను మరింత దూకుడుగా అమలు చేస్తున్నది. కార్మిక వర్గం సమస్యల పోరాటాల ద్వారా 100 సంవత్సరాలలో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్ లను ముందుకు తెచ్చింది. వీటికి వ్యతిరేకంగా గత ఐదేళ్లుగా కార్మిక వర్గం చేస్తున్న ఆందోళన, పోరాటాలతో లేబర్ కోడ్ ల అమలు ఐదు సంవత్సరాలు ఆలస్యమైన, ఇప్పుడు వాటిని అమలు చేసి కార్మిక హక్కులను పూర్తిగా హరించే ప్రయత్నం చేస్తుంది. 2025-26 కేంద్ర బడ్జెట్లో తమ కార్పొరేట్ విధానాలకు అనుకూలంగా కేటాయింపులు చేసింది. సామాజిక సంక్షేమానికి కోతలు పెట్టింది. సామాన్యులపై పన్నుల భారం మోపి, కార్పొరేట్ గుత్తా సంస్థలకు, బడా పెట్టుబడిదారులకు వేల కోట్ల రాయితులు ప్రకటించింది. ఉపాధి, నిరుద్యోగం, అధిక ధరలు, ఆకలి, అసమానతలు, ఆరోగ్య రక్షణ లాంటి ప్రాథమిక సమస్యలను పట్టించుకోకపోగా, ఈ సమస్యలను మరింత తీవ్ర రూపం దాల్చి ఆర్థిక విధానాలను విచక్షణ రైతంగా అమలు చేస్తున్నది. కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను వెనక్కి కొట్టేందుకు, భారత రాజ్యాంగ కల్పించిన ప్రాథమిక హక్కులను రక్షించుకునేందుకు కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు 2025, మే 20 న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర కార్మిక వర్గం మే 20 న జరిగే సమ్మెకు సమాయత్తం కావాలని సంఘటిత, అసంఘటిత రంగం కార్మికులు, ప్రభుత్వ రంగ సంస్థల కార్మికులు, ఉద్యోగులందరూ ఈ సమ్మెను జయప్రదం చేయాలని బోయినపల్లి మండలం రత్నపేట గ్రామంలో దేశభక్తి సార్వతీక సంఘం పోస్టర్ను విడుదల చేస్తూ కార్మిక సంఘాలు పిలుపునివ్వడం జరిగింది.

ఈ కార్యక్రమంలో మండల సిఐటియు కన్వీనర్ గురిజాల శ్రీధర్, మరియు జిల్లా రైతు సంఘం అధ్యక్షులు రామంచా అశోక్, మరియు రత్నంపేట హమాలీ కార్మికులు శిలువేని రాజు, గడ్డి మహిపాల్, గడ్డి శ్రీకాంత్, గడ్డి అనిల్, రాగల లచ్చయ్య, గడ్డి శ్రీధర్, పర్ల పెల్లి అంజయ్య, మార రవి, ఓరుగంటి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా నిరు పేదలను యువ వికాసం లబ్ధిదారులుగా ఎంపిక చేయాలి::జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ


## మే 20 లోపు లబ్ధిదారుల వివరాలను ఎంపీడీవోలు సమర్పించాలి రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించిన జిల్లా కలెక్టర్



రాజన్న సిరిసిల్ల జిల్లా, మే-15 (ప్రజాబలం ప్రతినిధి)జిల్లాలో పారదర్శకంగా నిరు పేదలను యువ వికాసం లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు.గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ రాజీవ్ యువ వికాసం పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సిరిసిల్ల జిల్లాలో రాజీవ్ యువ వికాసం క్రింద మనకు 36 వేల 819 దరఖాస్తులు వచ్చాయని, వీటిని మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పరిశీలించి 30 వేల 627 దరఖాస్తులను బ్యాంకులకు ఫార్వర్డ్ చేశామని , 6 వేల 192 దరఖాస్తులను వివిధ కారణాల చేత తిరస్కరించామని అన్నారు.బ్యాంకులు 30 వేల 627 దరఖాస్తుదారుల బ్యాక్ గ్రౌండ్ స్క్రూట్ ని పూర్తి చేశాయని తెలిపారు. గంభీర్ రావు పేట మండలంలో దళారులు యువ వికాసం పథకం క్రింద యూనిట్ ఇప్పిస్తామని ప్రజల నుంచి డబ్బులు తీసుకుంటున్నట్లు సమాచారం అందుతుందని, పారదర్శకంగా యువ వికాసం యూనిట్ల ఎంపిక జరుగుతుందని ఎవరు డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.సిరిసిల్ల జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు పారదర్శకంగా జరిగిందని, అదేవిధంగా ప్రభుత్వ నియమ నిబంధనలను పాటిస్తూ నిరుపేదలకు ప్రథమ ప్రాధాన్యత కల్పిస్తూ పారదర్శకంగా వికాసం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.దళారుల ఒత్తిడి లేకుండా పేదలకు మాత్రమే పథకం అందాలని, ఎక్కడైనా అనర్హులకు చేరితే సమానత అధికారులపై కూడా చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రజలను మోసగిస్తున్న దళారుల పట్ల కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జాగ్రత్తగా ఉండాలని కలెక్టర్ హెచ్చరించారు.ఈ సమావేశంలో డి ఆర్ డి ఓ శేషాద్రి, ఎల్ డి ఎం మల్లికార్జున్, మైనార్టీ వెల్ఫేర్ అధికారి భారతి బీసీ వెల్ఫేర్ అధికారి రాజ మనోహర్ ఈ.డి.ఎస్సీ కార్పొరేషన్ స్వప్న, ఎం.పి.డి.ఓ.లు , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# బిర్యానిలో బల్లి పోలీసుల రంగప్రవేశం





ఇబ్రహీంపట్నం సాగర్ రహదారిపై ఉన్న మై ఫీల్ ఫ్యామిలీ రెస్టారెంట్ లో చికెన్ బిర్యానీ తిన్న కస్టమర్ కి బిర్యానీలో బల్లి రావడంతో ఒక్కసారిగా షాక్కు గురయ్యాడు. ఇదేమిటని మై ఫీల్ ఫ్యామిలీ రెస్టారెంట్ యజమానిని నిలదీయడంతో మంచిగా ఫ్రై అయింది తిను అని చెప్పడంతో ఆగ్రహానికి గురైయాడు. షేరిగూడ గ్రామానికి చెందిన గుజ్జా కృష్ణ రెడ్డి పోలీసులకు 100 డయల్ చేయగా పోలీసులు మేనేజర్ ను పోలీస్ స్టేషన్ కు తీసుకువెళ్లారు

# వీరయ్య చౌదరి కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి లోకేష్

## అన్ని విధాల అండగా ఉంటానని భరోసా



ఒంగోలుః ఇటీవల ఒంగోలులో దారుణహత్యకు గురైన టీడీపీ నేత, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి కుటుంబ సభ్యులను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పరామర్శించారు. ఈ ఉదయం ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలులోని వీరయ్య చౌదరి నివాసానికి వెళ్లిన మంత్రి లోకేష్.. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వీరయ్య చౌదరి సతీమణి, కుమారుడు, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. వీరయ్య చౌదరితో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తుచేసుకున్నారు. యువగళం పాదయాత్ర సమయంలో తనతో పాటు అడుగులు వేశారని, పార్టీ పటిష్టత కోసం కృషిచేసిన వీరయ్య చౌదరి దారుణహత్య బాధాకరమని అన్నారు. హత్య నిందితులను కఠినంగా శిక్షిస్తామన్నారు. వీరయ్య చౌదరి కుటుంబానికి పార్టీ అన్ని విధాల అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు డోలా బాల వీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్, ఉగ్ర నరసింహ రెడ్డి, బిఎన్ విజయకుమార్, ఇంటూరి నాగేశ్వరరావు, జిల్లా టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



# గ్రామీణ , పట్టణ స్థానిక సంస్థల ప్రతినిధులతో సమావేశమైన 16వ ఆర్థిక సంఘం సభ్యులు సౌమ్య కంటి ఘోష్

## స్థానిక సంస్థల అబివృద్ధి కోసం నిధులు కేటాయించాలని 16వ ఆర్థిక సంఘం సభ్యులును కోరిన గ్రామీణ , పట్టణ స్థానిక సంస్థల ప్రతినిధులు




తిరుపతి, స్థానిక సంస్థల మౌలిక సదుపాయాల కల్పన, అబివృద్ధి కోసం నిధులు కేటాయించాలని 16వ ఆర్థిక సంఘం సభ్యులు అయిన సౌమ్య కంటి ఘోష్ ను కోరిన గ్రామీణ ప్రాంతాల స్థానిక సంస్థల ప్రతినిధులు, పట్టణ స్థానిక సంస్థల ప్రతినిధులు. గురువారం స్థానిక తాజ్ హోటల్ నందు పట్టణ స్థానిక సంస్థల అబివృద్ధి పనులలో భాగంగా శానిటేషన్, రోడ్లు , త్రాగు నీరు, డ్రైనేజీ మొదలగు అంశాలపై గ్రామీణ ప్రాంతాల స్థానిక సంస్థల ప్రతినిధులు, పట్టణ స్థానిక సంస్థల ప్రతినిధులుతో సమావేశమైన 16వ ఆర్థిక సంఘం సభ్యులు సౌమ్య కంటి ఘోష్,ఆర్థిక సంఘం జాయింట్ సెక్రటరీ ఎస్.గౌతమ్ అల్లాడ.అడఆఓఆ డైరెక్టర్ పి. సంపత్ కుమార్, పి ఆర్ అండ్ ఆర్ డి అడిషనల్ కమిషనర్ ఎం. సుధాకర్ రావు, జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్, తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య పాల్గొన్నారు. గ్రామాల అబివృద్దే లక్ష్యంగా.. గ్రామాలలో అనేక అబివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని, వివరిస్తూ..స్థానిక సంస్థలకు అవసరమైన తాగునీటి సరఫరా, పారిశుధ్యం, రహదారుల నిర్మాణం, రవాణా, వీధి లైట్లు, మురుగునీటి పారుదల వ్యవస్థ, మౌలిక సదుపాయాల కల్పనకు, గ్రీన్ అంబాసిడర్ల వేతనాలు తదితర ముఖ్యమైన అంశాలపై కేంద్రం నుండి నిధుల విడుదల కోసం, ఆర్థిక సాయం కొరకు కమిషన్ దృష్టికి గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు తీసుకెళ్ళారు. గ్రామాలు అబివృద్ధి కి మరిన్ని నిధులు కేటాయించడం వలన గ్రామాలు మరింత అబివృద్ధి చెందే అవకాశం ఉంటుందని తెలిపారు. టైడ్ మరియు అన్ టైడ్ నిధులు వేరుగా కాకుండా ఒకే మొత్తంలో నిధులు కేటాయించాలని ఆర్థిక సంఘం సభ్యులను కోరారు. 2011 జనాభా లెక్కల ప్రాతిపదిక కాకుండా ప్రస్తుతం జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలని తెలిపారు.



గ్రామీణ ప్రాంతాల స్థానిక సంస్థల ప్రతినిధులు, పట్టణ స్థానిక సంస్థల ప్రతినిధుల సూచనలు, అభిప్రాయాలను కమిషన్ పరిశీలిస్తుందని ఈ సందర్భంగా 16 వ ఆర్థిక సంఘం సభ్యులు తెలిపారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల గ్రామీణ స్థానిక సంస్థల నుండి సర్పంచ్, జడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎంపీపీ లు గ్రామీణ, పట్టణ ప్రతినిధులు మునిసిపల్ మేయర్, చైర్మన్ లు పాల్గొన్నారు.జడ్పీ సీఈవో రవి కుమార్ నాయుడు , డిప్యూటీ సి .ఈ. ఓ జుబేదా, డి.పి. ఓ సుశీల దేవి, శ్రీ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి ఆర్థిక సంఘనీ సెక్షన్ అధికారులు రాజశేఖర్, భూషణ రావు, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

# యోర్నిమాంబ జాతర లో పసుపు బిందెల యాత్ర

విశాఖపట్నం విశాఖ శ్రీ యెర్నిమాంబ అమ్మవారి జాతరోత్సవాల్లో జీవీ ఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలో కార్పొరేటర్ పూర్ణిమ,శ్రీధర్ ఆధ్వ ర్యంలో జరిగిన నీలదార యాత్రలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ పాల్గొని అమ్మవారినీ దర్శిం చుకున్నారు.జ్ఞానపురం నుండి అమ్మవారి ఆలయం వరకు భారీగా స్థానిక మహిళలతో పసుపు నీళ్ల బిందులు పట్టుకొని జరిగిన యాత్ర లో వాసుపల్లి పాల్గొని చీర, పసుపు కుంకుమ బుట్టను తలపై పట్టుకుని ఆలయానికి నడిచి వెళ్లి అమ్మవా రికి సమర్పించారు.అనంతరం వాసుపల్లి గణేష్ కుమార్ మీడి యాతో మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ ఎంతగానో కృషి చేశార న్నారు. మళ్లీ ప్రజల ఆశీస్సులతో రానున్న జగన్ ప్రభుత్వంలో పంటల తల్లి, సంతాన దేవతగా ప్రసిద్ధిగాంచిన ఇక్కడి శ్రీ యెర్నిమాం బ అమ్మవారి ఆలయాన్ని మరింత విస్తరించే విధంగా కృషి చేస్తానని అమ్మవారి పాదాల సాక్షిగా వాసు పల్లి తెలిపారు. కార్పొరేటర్ కోడి గుడ్ల పూర్ణిమ శ్రీధర్ మాట్లాడుతూ గతంలో ఇక్కడి ఆలయాన్ని తొల గించే ప్రక్రియలో వాసుపల్లి గణేష్ కుమార్ అడ్డుకొని స్థానికంగా అమ్మ వారి ఆలయాన్ని అభివృద్ధికి తోడ్ప డ్డారన్నారు. మళ్లీ వైసిపి ప్రభుత్వం లోనే వాసుపల్లి గణేష్ కుమార్ నేతృత్వంలో భక్తులకు సౌకర్యార్థం అన్ని వసతులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆలయ అభివృద్ధిని అడ్డుకునే కుతంత్ర రాజకీయాలు చేస్తున్నారని కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తక్షణమే స్థానిక అమ్మవారి ఆలయంలో శాశ్వత షెడ్డు నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు.

# తూకివాకంలోని ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ నిర్వహణ బాగుంది.

## – 16వ ఆర్థిక కమిషన్ మెంబర్ సౌమ్య కంటి ఘోష్

తూకివాకంలోని ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ ను జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్, నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య తో కలిసి సందర్శించిన 16వ ఆర్థిక కమిషన్ మెంబర్ సౌమ్య కంటి ఘోష్ తూకివాకంలోని ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ నిర్వహణ బాగుంది.



తిరుపతి, తూకివాకంలో తిరుపతి తిరుపతి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ నిర్వహణ బాగుందని 16వ ఆర్థిక కమిషన్ సభ్యులు సౌమ్య కంటి ఘోష్ అన్నారు. గురువారం ఉదయం తూకివాకం నందలి తిరుపతి నగరపాలక సంస్థ నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ (చెత్త నుండి సంపద కేంద్రం) ను జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్, నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య తో కలిసి పరిశీలించిన 16వ ఆర్థిక కమిషన్ బృంద సభ్యులు సౌమ్య కంటి ఘోష్, సెక్రటరీ గౌతమ్ అల్లాడ. ఈ ప్లాంట్ నందు ఘన వ్యర్థాల నిర్వహణ, తడి చెత్త నిర్వహణ కంపోస్టు, బయో మెథనైజేశన్ ప్లాంట్, భవన నిర్మాణ వ్యర్థాల నిర్వహణ తదితర యూనిట్ల నిర్వహణ గురించి తిరుపతి కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్, తిరుపతి మున్సిపల్ కమిషనర్ శ్రీమతి మౌర్య పలు అంశాలు వివరించారు.ఈ ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా నగరంలో ఏర్పడిన అన్ని రకాల చెత్తను, మురుగునీటిని నిర్వహణ చేసి సంపద సృష్టించే విధానం గురించి వివరించారు. తిరుపతి నగరంలో సేకరించిన తడి, పొడి చెత్త ద్వారా ఏర్పడిన పొడి చెత్త నిర్వహణ చేస్తారని, ఇందులో వచ్చిన ప్లాస్టిక్ వ్యర్థాలు తదితరాలను ప్రాసెసింగ్ చేసి సిమెంట్ ఫ్యాక్టరీలకు విక్రయిస్తారని, తడి చెత్త ను నిర్వహణ చేసి కంపోస్టు ఎరువుగా మార్చి రైతులకు, ఉద్యానవనాలకు విక్రయిస్తారని, ఇక మార్కెట్ నుండి వెలువడే వ్యర్థాలు, హోటల్స్ నుండి సేకరించిన వ్యర్థాలను నిర్వహణ చేసి వంట గ్యాస్ ను ఉత్పత్తి చేసి విక్రయించడం జరుగుతుందని తెలిపారు. నగరంలో ప్రతిరోజూ ఉత్పతి అయ్యే సుమారు 25 టన్నుల భవన నిర్మాణ వ్యర్థాలను నిర్వహణ చేసి ఆరు రకాలుగా గుల్ల, ఇసుకగా మారుస్తారని, ఇలా ఉత్పతి అయిన ఇసుక గుల్ల తో పేవర్స్ తయారు చేస్తారని తెలిపారు. ప్రతిరోజూ తడి చెత్త 150 టన్నులు, 75 టన్నులు పొడి చెత్త నిర్వహణ చేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే ట్రీటెడ్ వేస్ట్ నీటిని పరిశ్రమలకు విక్రయించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, లైజన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 2న తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో యువ కవుల సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరించిన జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



తెలంగాణ జీవన విశిష్టతను చాటిచెప్పడానికే ఈ సమ్మేళనంయువతలో సాహిత్యాభిలాషను, చైతన్యాన్ని నింపడానికి ఇది దోహదపడుతుందితెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వ్యాఖ్యలుతెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2వ తేదీన యువ కవుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ జాగృతి ప్రకటించింది. తెలంగాణ సారస్వత పరిషత్ లో జరగనున్న ఈ సమ్మేళనానికి సంబంధించిన పోస్టర్ ను గురువారం నాడు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ... తెలంగాణ జీవనశైలి విశిష్టతను చాటి చెప్పడంతో పాటు యువతలో సాహితీ స్పృహను, చైతన్యాన్ని పెంపొందించడానికి ఈ యువ కవి సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలంగాణ తాత్వికతను, చరిత్రక నేపథ్యాన్ని, సాంస్కృతిక వైభవాన్ని, సౌభ్రాతృత్వాన్ని, సహనశీలతను, సమగ్రతను, సమాజంలో ఉండే సమిష్టితత్వాన్ని ప్రతిబింబించేలా యువ కవులు తమ కలాలకు పదును పెట్టాలని కవిత పిలుపునిచ్చారు.పాల్గొన దలచిన కవులు, కవయిత్రులు 35 ఏళ్ల లోపువారు అయి ఉండాలి. తెలుగు, హిందీ ఇంగ్లీష్, ఉర్దూలలో కవితలు వినిపించవచ్చు. నమోదు చేయించుకోవడానికి కవులు తమ వివరాలతో ఈ నెల 26 లోపు ఎజీలతిబిష్ట్రజీ.బివశ్రీజీనిణజీనిజీఏణఎజీతిశ్రీ.ఇనీఎ కు మెయిల్ చేయాలి. కవులు తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమ చరిత్రను, పోరాట స్ఫూర్తిని చాటిచెప్పాలని కవిత పిలుపునిచ్చారు. తెలంగాణ నేల మీద అనేక గొప్ప కవులు, కవయిత్రులు తమ రచనల ద్వారా సామాజంలో చైతన్యాన్ని రగిలించారని, ఆ పరంపరను కొనసాగించడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని అన్నారు. గోల్కొండ కవుల సంచిక ద్వారా సురవరం ప్రతాప్ రెడ్డి తెలంగాణ రచయితలు, కవులు, కవయిత్రుల ఆత్మగౌరవాన్ని చాటిచెప్పారని, ఆ స్ఫూర్తితో తాము ముందుకు సాగుతున్నట్లు తెలియజేశారు. అయితే, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ సాహిత్యానికి కనీస గౌరవం ఇవ్వడం లేదని విమర్శించారు. దాశరథి శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఎన్ని సార్లు విజ్ఞప్తి చేసినా ప్రభుత్వం దున్నపోతు మీద వాన పడ్డట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. అలాగే, జానపదానికి గౌరవం దక్కడం కోసం జీవితాంతం కృషి చేసిన బిరుదురాజు శత జయంతి కు రాష్ట్ర ప్రభుత్వం కనీస గౌరవం ఇవ్వలేదని, గొప్ప కవులు, కళాకారులు సమాజానికి చేసిన సేవలను ప్రభుత్వం విస్మరించడం తగదని సూచించారు. ఈ కార్యక్రమంలో కవులు కాంచనపల్లి, వనపట్ల సుబ్బయ్య, ఘనపురం దేవేందర్, జాగృతి నాయకులు నవీన్ ఆచారి, శ్రీధర్ రావు, మనోజ్ గౌడ్, లలిత యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధి విషయంలో రాజీ పడేది లేదు

నియోజకవర్గ పరిధిలోని వార్డు 8 కలాసిగూడ లో కంటోన్మెంట్ హాస్పిటల్ నుండి ప్రభుత్వ టాయిలెట్ కాంప్లెక్స్ వరకు సీసీ రోడ్డు వేయడానికి ఎమ్మెల్యే శ్రీ గణేష్ నియోజకవర్గ స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ నుండి 32 లక్షల రూపాయలను కేటాయించి ఈరోజు కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు బానుక నర్మద మల్లికార్జున్ తో కలిసి పనులను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కంటోన్మెంట్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు తీసుకురావడంలో ముందుంటానని , గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు నియోజకవర్గ అభివృద్ధికి ఎన్ని నిధులైనా ఇస్తానని చెప్పారని, రాజకీయాలకతీతంగా అందరం నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేద్దామని, కంటోన్మెంట్ నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దామని చెప్పారు. ఈ పనుల ప్రారంభోత్సవంలో బోర్డు మాజీ వైస్ ప్రెసిడెంట్ జయప్రకాష్, బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామ్, యువజన కాంగ్రెస్ నాయకులు అరవింద్, నాయకులు ప్రేమ్ కిరణ్, ముఖేష్, హయత్ ఖాన్, శ్రీనివాస్, అల్లం ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com